తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో

వైకుంఠపాళి

(వర్తమాన రాజకీయ వ్యాసాల సంపుటి)

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D.,

ముద్రణ : 2024 మే

ప్రతులు : 500

C సర్వ హక్కులు రచయితవే.

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్, 7671909759

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య : 978-93-343-2485-3

టైటిల్ డిజైను : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

వెల రూ. : 225/-

ప్రచురణ కర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి Ph.D.

డి.టి.పి. :
శ్రీ దుర్గ గ్రాఫిక్స్, తెనాలి, సెల్ : 9110761291

విషయసూచిక

		పుట సంఖ్య
1.	షర్మిలను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేయటం సరైన చర్యేనా?	10
2.	డా॥ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ సాక్షిగా – ఆంధ్రాలో పరాకాష్టకు చేరిన దళితులపై దమనకాండ!	19
3.	మన దేశం ఉత్తర, దక్షిణంగా విడిపోక తప్పదా? ఎలక్షన్స్ తరువాతైనా దక్షిణాది వారికి న్యాయం జరుగనుందా?	24
4.	అధికారం పోయినా మారని కే సి ఆర్ ఫ్యూడల్ మనస్తత్వం – పతనం అంచున బీ ఆర్ ఎస్	31
5.	మోడీతో వీజీ కాదు... వీజీ కాదు ... చంద్రబాబు జాగ్రత్త !	37
6.	ఆంధ్రాకొచ్చిన మరో రకం నూతన దీపావళి ! నూతన ప్రభుత్వానికి హార్దిక స్వాగతం!	47
7.	కొత్త ప్రభుత్వం – పెను సవాళ్లు!	53
8.	వెంటనే మాకు అధికారం కావాలి – అసహనంతో జగన్, కె టి ఆర్ ల వింత ప్రహసనాలు!	59
9.	హడావుడిగా వచ్చిన వరదలకు, జగన్ మీడియా సృష్టిస్తున్న అసత్య తుపానులకు చంద్రబాబు ఎదురీత!	68
10.	జర్నలిజంలో 'బాలన్స్'గా రాయటం అంటే ఏమిటీ? జర్నలిజం విలువలు, సూత్రీకరణల్లో నిజం ఎంత?	76
11.	యూట్యూబు నియంత్రీకరణ / క్రమబద్ధీకరణ అవసరమా? కాదా?	85
12.	తెలుగు తల్లికి పట్టిస్తున్న రాజకీయ మకిలి	92
13.	ఏది నిజం?ఏదికల్పితం? రాజకీయాలలో జరిగే వాస్తవానికి పత్రికల్లో కనిపించే దానికి మధ్య భయంకర అంతరం	98
14.	ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రతిపక్షాల డొల్లతనం, వెకిలి వాగుడు!	106
15.	ఆంధ్రాను పాకిస్తాన్ గా మార్చి చంద్రబాబుపై ద్వేషం విరజిమ్ముతున్న బి ఆర్ ఎస్ నాయకులు	113
16.	చంద్రబాబును దెబ్బ తీయడానికి మత వివాదాలను సృష్టిస్తున్న జగన్ ముఠా!	120
17.	కరోనా మళ్ళీ పలకరింపుకు వచ్చింది! జాగ్రత్త, జాగ్రత్త!	126
18.	మోడీకనామిక్స్ .... మసిపూసి మారేడుకాయ!	134
19.	ఒకే దేశం ....కానీ ఒకే ఎలక్షన్ కమిషన్ కాదా ?	141
20.	చంద్రబాబు అరెస్ట్ వెనుక ఎవరూ గుర్తించని కోణాలు–'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' అంటే ఏమిటీ?	147

నా మాట

'తెలుగు రాష్ట్రాల రాజకీయ వైకుంఠపాళి' అనే ఈ వ్యాసావళి తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న రాజకీయ వికృతత్వానికి ముంజేతి కంకణం లాంటిది. అన్నం ఉడికిందా, లేదా తెలుసుకోవడానికి అన్నం మొత్తం పట్టుకొని చూడనక్కరలేదు. ఒక మెతుకు పట్టుకొని చూస్తే తెలుస్తుంది అని ఒక నానుడి మన తెలుగు నాట ఎప్పటినుంచో ఉంది. తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్నది నిజంగా 'వైకుంఠ పాళే'. నేటి తరానికి ఈ పదంపై ఒక ఆట ఉన్నదన్న సంగతి కూడా తెలియకపోవచ్చును. కానీ, వైకుంఠపాళి అనే ఆటకు 'పరమపదసోపాన పటం' అని మరో పేరుకూడా ఉంది.

పాములు, నిచ్చెనలు ఉంటాయి ఈ ఆటలో. అన్నింటికన్నా పైనా ఉండేది 'వైకుంఠం'. చదరంగంలో గళ్ళు ఉన్నట్టు ఈ 'పాము, నిచ్చెన పటం' లో పెద్ద పాములు, చిన్న పాములు, పెద్ద నిచ్చెనలు, చిన్న నిచ్చెనలూ ఉంటాయి. ఇవి పటంలోని గళ్ళల్లో ప్రారంభమై, వాటిలోనే ముగుస్తాయి. ఇవి పటానికి నిలువుగా, ఏట వాలుగా, అడ్డంగా ఉంటాయి.

ఎంతమందైనా ఒకే సారి ఆడవచ్చు. ఒక్కొక్కరు ఒక్కో రంగు గవ్వనో, లేక రాయినో, లేక ఒక కాయనో ఆడే వ్యక్తి గుర్తుగా పెట్టుకొని, గవ్వలు వేసి ఏ అంకె వస్తే ఆ అంకె దగ్గరకు దానిని జరపాలి. అక్కడ పాముంటే, పాము ఆ కాయను మింగినట్టు. అప్పుడు ఆ పాము తోక ఏ అంకె దగ్గర ముగిస్తే అక్కడకు ఆ కాయ తిరుగు టపాలో చేరుతుంది. ఆ వ్యక్తి పందెం అయిపోతుంది. తరువాత వ్యక్తి మళ్ళీ గవ్వలు వేస్తాడు. ఏ అంకె వస్తే ఆ అంకె దగ్గర కాయ పెడతాడు. ఒక వేళ అక్కడ నిచ్చెన

ఉంటే ఆ కాయ ఆ నిచ్చెన ఎక్కి దాని మొదలు చివర ఎక్కడుంటుందో అక్కడికి వెళ్తాడు. తిరిగి గవ్వలు వేస్తాడు. ఇలా సాగే ఆటలో ఒక్కోసారి వైకుంఠం చేరబోతామనంగా పుసుక్కున మనం వేసిన గవ్వల సంఖ్య పాము నోటిలో పడి నేరుగా కిందికి, మొదటికి వచ్చేస్తుంది. అది ఈ ఆటలో ఉండే వింత, వేడుక. కేవలం అదృష్టం ఆధారంగా పాములు, నిచ్చెనలు దాటుకొని వైకుంఠం చేరి పండుతామా, లేక చివర్లో పామునోట్లో పడి మొదటకొస్తామా, లేక మధ్యలోనే పాములనోట్లో పడుతూ క్రిందికీ, పైకి పల్టీలు కొడతామన్నది ఈ ఆటలో ప్రాథమిక సవాలు.

ఆసాంతం ఉత్కంఠతో సాగే ఈ ఆట ఒకప్పుడు ఊళ్ళల్లో చెట్లకింద, చేమలకిందా ఆడుకొనేవారు. ఇదో వేడుక నాడు. నేడు ఇది రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజల భవిష్యత్తుకు ఒక ప్రాణాంతకమైన ఆటగా మారింది. ఎలా అంటారేమో....?

స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో నాటి పెద్దలు కాంగ్రెస్ పార్టీలో నేర్చుకొన్న తొలిఆట ఇది. అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలన ఉన్నప్పుడు కూడా ఒకళ్ళనొకళ్ళు పడ తోసుకొని, తామ అధికారంలోకి రావటం కోసం ఈ ఆట ఆడేవారు. కాల క్రమేణా ఇది ఇతర పార్టీలకు వ్యాపించింది. ఇప్పుడు 'వైకుంఠపాళి' స్వరూపం మారింది. ఇప్పుడు ఈ కొత్త 'వైకుంఠపాళి'ఆటలో ప్రధాన రాజకీయపార్టీలు, నాయకులు కాకుండా సహాయ నటులు పెద్ద సంఖ్యలో రంగ ప్రవేశం చేశారు.

వారెవరో కాదు, ఒకటి మీడియా (సోషల్ మీడియా, చెత్తాచెదారం వంటివి అన్నీ), కుహనా మేధావులు (డబ్బుకు తెలివిని అమ్ముకునే వేశ్యలు). వీరు నేర చరితులకు, నేరాలకు, నేరాలు చేసి రాజకీయ ముసుగులో ఎదురుదాడి చేయగలవారికి మద్దతుగా అవసరమైన 'పొలిటికల్ డిస్కోర్స్',

'రాజకీయ రిటోరిక్ ' అన్నీ సిద్ధం చేసి ఉంచుతుంటారేప్పటికప్పుడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అర్ధరాత్రి హత్య చేసి, ఆ హత్య ముఖ్యమంత్రే చేశాడని మైకులముందు వగలేడ్పులు ఏడ్చి, సానుభూతి పొంది అధికారంలోకి రావాలని చూసే పచ్చి నెత్తురు తాగే కరుడుగట్టిన నేరస్తుడికి వంత ఎంత గొప్పగా పాడ్తారో, పత్రికల్లో రాస్తారో ఉహకందదు. అంత ప్రతిభ కలిగిన నేర–మేధావులు కూడా.

ఈ కరుడుగట్టిన నేరచరిత రాజకీయ నాయకుడు (లు), తమకు అధికారం దక్కేందుకు కుహనా మేధావులను సలహా కమిటీలలో వేస్తారు. వాళ్ళు కుత్రంత్రాలని రచిస్తారు. అందుకు దగ్గ రాజకీయ ఉపన్యాసాలను సిద్ధం చేస్తారు. సాధారణ ప్రజలకిది అర్ధమయ్యే లోపలే కక్కాల్సిన విషం కక్కేస్తారు. రాష్ట్ర వినాశనం జరిగినా కరదుగట్టిన నేరస్తుదు జైలుకుపోకుండా ఉపాయాలు ఎప్పటికప్పుడు మారుస్తూ, ఆ నేరస్తుడు రాజకీయాలలో భద్రంగా కొనసాగేలా చూస్తారు. వాళ్ళ కేసులున్నా ఏళ్ల తరబడి కోర్టుకు కూడా పోరు. విచారణలకు హారిజరుకాకుండా కోర్టులనీ, లాయర్లను, జడ్జీలను టోకున కొనేస్తారు. ఇంత లాబీయింగ్ చేయగలరా అని జనం ఆశ్చర్యపోయేలా అన్నీ నడిపిస్తారు. సామాన్యులు ఇవి పట్టించుకోకుండా వాళ్ళను డబ్బులిచ్చి పథకాల పేరిట ఏమారుస్తారు. ఫలితంగా ఒకరినొకరు తోసుకొని పైకి వచ్చే రాజకీయం ఆగిపోయి, ఏకంగా రాష్ట్రాలను టోకున కుప్ప కూల్చే కుట్రకు తెర లేపాయి నేటి రాజకీయ పార్టీలు.

అందువలననే, ఈ 'వైకుంఠపాళి' పదాన్ని ఇటీవలనే మన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు వాడారు. 'వైకుంఠపాళి' ఆట ఆడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సహితం పణంగా పెడుతున్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు, అధోగతి పాలు చేసి, రాజకీయ పబ్బం

గడుపుకొంటున్నారు. ప్రజలు పన్నులతో వచ్చిన ఖజానా ఆదాయాన్ని పథకాలపేరుతో ప్రజలకు మళ్లించటం, అభివృద్ధి పనులను అటకెక్కించి రాష్ట్రాన్ని ఎక్కడికక్కడ దోచుకోవటం వంటివి రాష్ట్ర హితానికి మంచిది కావు. ప్రజలు కూడా స్వార్థ రాజకీయాలకు 'జై కొట్టడం ఈ విషయంలో కొసమెరుపు. 'మాకు పథకాలక్రింద వేలకు వేలు ఖజానా డబ్బులు పంచండి. రాష్ట్రం ఏమైనా మాకు ఫర్వాలేదు', అన్నవాదన వినిపిస్తున్నారు.

ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మార్చే పథకంలో ప్రజలు ఉండటం ఆయనను ఈ మాట అనేలా చేసింది. ఒక ప్రభుత్వం చేసిన తీర్మానాలను, అభివృద్ధి పనులను కొత్తగా వచ్చిన మరో ప్రభుత్వంన్యాయంగా ముందుకు తీసుకెళ్ళాలి. అందుకు పూర్తిగా భిన్నంగా, అందునా ఎలెక్షన్ల ముందు హామీ ఇచ్చి, మరీ అధికారంలోకి రాగానే వాటిని అటకెక్కిస్తుంటే, రాష్ట్ర భవిష్యత్తు రెండడుగులు ముందుకు, రెండడుగులు వెనక్కి వెళ్తున్న చందంగా మారిందనే అర్థంలో వారు ఈ పదం వాడారు.

'వైకుంఠపాళి' ఆట ఆడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని సహితం పణంగా పెడుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కనిపించని వికృత రాజకీయ క్రీడ తెలుగు రాష్ట్రాల్లో తాండవిస్తుంది. 'చంపైనా, చచ్చైనా అధికారం కావాలి. అధికారం లేకపోతే బతకలేం' అన్న రాజకీయ వికృత క్రీడా విధానం మునుముందు ఈ దేశాన్ని ఏం చేయబోతుందో విజ్ఞులైన పాఠకులే ఉహించాలి. ఈ వ్యాసావళి ఆ దిశగా మిమ్మల్ని చదివించగలిగితే, ఆలోచింపచేస్తే రచయితగా ఈ పుస్తకం వెలువరించటంలో అర్థం ఉంటుందని నా భావన. ఈ పుస్తకంలో 17 వ్యాసాలు అక్షరాంజలి మాస పత్రికలో అచ్చైనాయి. మిగతా మూడు వ్యాసాలు విశాలాంధ్ర

దినపత్రికలో వచ్చాయి. ఈ వ్యాసాలను ప్రచురించినందుకు అక్షరాంజలి సంపాదకులు డా॥ పి.వి.ఎమ్. పవన్ గారికి, విశాలంధ్ర సంపాదకులు ఆర్.వి. రామారావు గారికి నా ధన్యవాదాలు.

నా అరవై ఏడేళ్ల జీవితంలో భారత దేశంలో జరిగిన అన్ని రాజకీయ కుట్రలను, కుతంత్రాలను చూశాను. స్వాతంత్ర్యం రాకముందు భారత దేశంలో రాజ్యాలు, రాజులు, బ్రిటీష్, ఫ్రెంచ్, డచ్ వారి రాజకీయ కుతంత్రాలనూ చదివాను. నాగరికత పురోగతి చెందిన కొద్దీ మానవ సమాజం మెరుగైన మనుగడవైపు అడుగులిడుతుందేమోనని ఆశపడ్డాను. నానాటికి మన తెలుగు రాష్ట్రాల రాజకీయ వికృత క్రీడ చూస్తుంటే, దిగజారిన మేధావి వర్గాల ఏకపక్ష మనస్తత్వం రాక్షస రూపం దాలుస్తుంటే, ఇంతకంటే పరిస్థితులు దిగజారుతాయేమోనని భయం వేస్తుంది. అలా కాకూడదన్న ఆశతో ...

డా॥ కొప్పరపు నారాయణ మూర్తి Ph.D

అక్షరాంజలి ఆర్థిక సహాయం

ఈ పుస్తకాన్ని వేయాలని సంకల్పించిన వెంటనే, అక్షరాంజలి గ్రూప్ సంపాదకులు డా పి వి ఎం పవన్ గారు దీనికి అయ్యే డి. టి. పి, సెట్టింగ్ ఖర్చు తాను భరిస్తానని, అన్నమాట ప్రకారం డబ్బు పంపినందుకు, వారికి, అక్షరాంజలి యాజమాన్యానికి నా మనః పూర్వక ధన్యవాదాలు.

డా॥ కొప్పరపు నారాయణ మూర్తి Ph.D

షర్మిలను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేయటం సరైన చర్యేనా?

వై ఎస్ షర్మిలను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తీసుకురావటం ద్వారా కాంగ్రెస్ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఏ సంకేతం పంపించింది? ఖచ్చితంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్ చేపట్టిన ఈ చర్యను చూసి నవ్వుకొంటున్నారు. జగన్ అంటే పడని శక్తులు కొన్ని ఖచ్చితంగా దీనిని జగన్ పై షర్మిల ప్రతీకారంగా భావించవచ్చు. కొంత కాంగ్రెస్ చేసిన ఈ పనిని ఒక గొప్ప' ఎత్తుగడగా' వర్ణించవచ్చు. కానీ, ఇదంతా తాత్కాలిక ఉదరమాత్రమే. తెలంగాణాలో పార్టీ పెట్టి శృంగభంగమై, ఆఖరుకు ఎన్నికలకు కూడా పోకుండానే షర్మిల తోకముడిచిన చందం ప్రజల స్మృతిపథంలో ఇంకా ఉండనే ఉంది. సొంత క్యాడర్ వద్దని మొత్తుకొని చెబుతున్నా వినకుండా, ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ లో ఎలాగైనా దూరి, ఎట్టకేలకు తను పోటీ చేయక పోవటం వల్లనే కాంగ్రెస్ కు 30 సీట్లు వచ్చాయని చెప్పుకొనే తెంపరితనం, గౌరంగా బయట పడేందుకు ఆమె పడిన తహతహ, ఆడిన నాటకం ప్రజలు విస్మరించ లేదు. "నేను 'తెలంగాణా కోడలిని'. ఇక్కడ పార్టీపెట్టి ప్రజలకు వై ఎస్ ఆర్ పాలన మరోసారి అందించాలన్న లక్ష్యంతో వచ్చాను, అది నా హక్కు " అని పెద్ద పెద్ద పలుకులు పలికిన ఈమె ఇప్పుడు హఠాత్తుగా 'ఆంధ్రా'కు ఎందుకు బిచాణం మార్చినట్లో, అందుకు ఆమె ఏమి సంజాయిషీ ఇస్తుందో వినాలన్న ఆసక్తి ఎంతో ఉంది.

కేవలం కాంగ్రెస్ లో చేరినందుకు, వాళ్ళు ఆమెకు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టినందున ఆవిడకు చేసేది లేక, మరోదారి లేక ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలిగా వచ్చిందా? ఒకప్పుడు అన్న కోసం,

అన్న జైలులో ఉన్నప్పుడు తనకు తాను 'జగనన్న బాణాన్ని' అని, 'ఒక్క అవకాశం' ఇవ్వండని, 'వై ఎస్ ఆర్ పాలన అంటే ఏమిటో మళ్లి చూపిస్తా' మని పలికిన బీరాలు ఏమయ్యాయి? ఈ నాలుగేళ్లు తనతండ్రి హయాంలో దిక్కుమాలిన అక్రమ ఆర్జన ద్వారా వై ఎస్ జగన్ సంపాయించిన ఆస్తిలో వాటాలకోసమే పార్టీ పెట్టిన సంగతి తెలుగు ప్రజలు గుర్తుపెట్టుకోరా ? అక్రమార్జన ద్వారా వచ్చిన ఆస్తిలో వాటాల కోసం అన్నా చెల్లెళ్ళ మధ్య జరిగిన తగులాటలో రాష్ట్రం నాశనం అయినా పట్టించుకోని షర్మిల , ఏనాడూ ఒక సారి ఇటు వైపు చుడనుకూడా చూడని షర్మిల ఒక్క సారిగా అధ్యక్ష పీఠం ఎక్కేస్తే ఆవిడ మీద, వై ఎస్ ఆర్ సానుభూతిపరులు ఎక్కడలేని ప్రేమ ఒలకపోసేసి ఆవిడని , కాంగ్రేస్ ను అందలం ఎక్కిస్తారా? 2029లో ఆవిడ కాంగ్రేస్ ను ఒక బలమైన పార్టీగా మారుస్తారా? దట్టంగా మేకప్ వేసుకొని, ఖరీదైన కార్లలో నుంచి దిగి, తండ్రి హావ భావాలను ఒలకపోస్తే వై ఎస్ ఆర్ పై గుడ్డి అభిమానం తో ఉన్న ప్రజలు ఆమె అన్నకు ఒక అవకాశం ఇప్పించారేమో ? ఆనాడు , తల్లి , చెల్లీ తన అన్నపాలన విషయంలో హామీలు గుప్పించి , ఆ తరువాత ఆస్తి పంపకాల సొంత గొడవల్లో రాష్ట్రాన్ని దాని ఖర్మకు దానిని వదిలేయటం ఎంతవరకూ తెలుగుప్రజలు విస్మరించ గలరు, క్షమించ గలరు . అంటే, వై ఎస్ కుటుంబంలో ఎవరు, ఎప్పుడు ఏ వేషం వేసి ప్రజల ముందుకు వచ్చినా ప్రజలు 'మా వై ఎస్ ఆర్ ' అన్న మళ్ళీ వచ్చాడు, మరోసారి ఆవిడకు, కాంగ్రేస్ కు పట్టం కట్టేద్దామనుకొంటారా? తెలుగు ప్రజలు అంత 'ఇంగిత జ్ఞానం', 'లౌక్యం' లేని వారా? ఎక్కడో కాంగ్రేస్ దివాళా కోరుతనం బయట పడటం లేదూ?

ప్రచారాలప్పుడు ఎడా పెడా హామీలు గుప్పించి, ఎన్నికలై అధికారం చేతికొచ్చాక ఆస్తులు ఇవ్వకపోయినా, పాలనలో భాగస్వామ్యం కలిపించకపోయినా, తాము ప్రజలకు ఇచ్చిన మాటలు వట్టి మూటలవుతున్నప్పుడు తల్లీ, కూతురూ ప్రజల ముందుకు వచ్చి తామూ జగన్ వలన మోసపోయిన బాధితులమని , తామూ ప్రజలవెంట ఉండి తామిచ్చిన హామీలు నెరవేరేందుకు పోరాడుతామని ఏనాడైనా మాట్లాడారా? పైగా వారాడిన నాటకం ఇక్కడ ఒకసారి గుర్తు చేసుకోవాలి. 'మేము తెలంగాణాకు వచ్చేసాము, ఇప్పుడు అక్కడ ఏమి జరుగుతోందో మాకు తెలియదు. ప్రస్తుతం షర్మిల, నేనూ తెలంగాణాలో పార్టీ పెట్టె ప్రయత్నంలో ఉన్నాము' ఇది నాటి వై ఎస్ జగన్ తల్లి గారి లెక్కబెట్టి, గుదిగుచ్చి బదులిచ్చిన మాటలు.

వై ఎస్ ఆర్ హఠాత్తుగా పోవటంతో, ప్రజలలో ఆయనపట్ల ఉన్న అభిమానాన్ని సొమ్ము చేసుకొనేందుకు కొడుకుకు ఒక రాష్ట్రం , కూతురుకు ఒక రాష్ట్రం కట్టబెట్టే అంతరాలోచనతోటే 'తల్లి ఆడించిన నాటకం ఇది' అని అభివర్ణించే వారు లేకపోలేదు. అయితే ఈ నాటకం ఎక్కడో బెడిసికొట్టింది. ఇది పైకి ఆస్తి పంపకాలలో వచ్చిన తేడాగా కనపడ్డా, వై ఎస్ విజయమ్మ ఇద్దరికీ చెరో రాష్ట్రం పంచాలని వేసిన ప్రయత్నం జగన్ కు సుతాము ఇష్టంలేదని అంతర్గత వర్గాల భోగట్టా. తానొక్కడే వై ఎస్ అధికారానికి వారసుడుగా ఉండాలని జగన్ సంకల్పం. ఎప్పుడైతే తన ఉద్దేశం పట్టించుకోకుండా వై ఎస్ విజయమ్మ ముందుకు వెళ్లిందో, ఒక పెద్ద మీటింగ్ పెట్టి పాత కాంగ్రేస్ వాళ్ళైనా ఉండవల్లి, కే పి ఆర్, చింతా మోహన్ లాంటి వాళ్ళను పిలిచి ఆశీస్సులు అడిగిందో అప్పుడే ఈమెకు ఆర్థిక బలం లేకుండా చేయాలని చూశాడు జగన్.

అయినా పార్టీతో ముందుకు వెళ్లిన షర్మిల తన తండ్రి వయస్సున్న కే సి ఆర్ ను తిట్టకూడని భాషలో తిట్టటం ప్రారంభించింది. మొదట్లో జగన్ మొహమాటంతో కే సీ ఆర్ ఊరుకున్నా, శ్రుతి మించి రాగాన పడటంతో, చివరకు పోలీస్ ఆఫీసర్లను కూడా కొట్టడం చేయటంతో షర్మిల దారులన్నీ మూసేసాడు. అప్పుడుగూడ కే సీ ఆర్ పై ఆక్రోశం వెళ్ళగక్కిందే గాని , అలాంటి పన్లే ఆంధ్రాలో జగన్ చేస్తుంటే తల్లీ , కూతురు పల్లెత్తు మాటైనా మాట్లాడలేదు. ఇది వై ఎస్ కుటుంబం కొత్త తరహా రాజకీయ పోరాటం. ఇది తెలుగు ప్రజలకు అర్థం కాలేదా అంటే సమాధానం 'విచిత్రం'గా ఉంటుంది . ఆ 'విచిత్రం' లో 'జగన్ హత్యలుచేయించినా ఫర్వాలేదు, దళితులను, స్త్రీలను ఊచకోత కోయించినా ఇబ్బంది లేదు, మా క్రైస్తవుడైతే చాలు' అన్న భావన ఎక్కడో చెప్పీ చెప్పనట్టుగా ఉంటుంది. ఇది ఆంధ్రాలో క్రిస్తవానికి ఆధునిక నిర్వచనం. అదివేరే విషయం.

ముందు జగన్ పాలనలో వాటా కోరడంలో తేడా వచ్చిందా, లేక ఆస్తి విభజన చేయడానికి నిరాకరించడంలో విబేధం వచ్చిందా అన్నదానిపై అనేక ఊహాగానాలు ఉన్నాయి. నిజానికి అక్రమమో, సక్రమమో గాని జగన్ సంపాదించిన ఆస్తి మొత్తం జగన్దే. ఆవిషయమై జగన్ పై కేసులు నేటికీ ఉన్నాయి. అవి అక్రమమని తేలితే జైలుకు వెళ్ళేది జగనే కానీ షర్మిల కాదు.కేసులు వాదించేందుకు లాయర్లకు కోట్ల ఫీజులు కడుతుంది కూడా జగనే. షర్మిల స్వయంగా ఏదైనా ఫ్యాక్టరీ, సంస్థ నడిపి కోట్లు సంపాదించి అదంతా తండ్రి పేరున జరిపించినట్టు బయటికి తెలియదు. అలాంటపుడు ఆస్తి వ్యవహారంగా కన్నా పాలనలో భాగం ఇవ్వలేదన్న వాదనకే ఎక్కువ మొగ్గు తూగుతుంది అదీగాక వై ఎస్ ఆర్ కు ఏమైనా ఆస్తి ఉందా అనేది సందేహమే. ఎందుకంటే

ముఖ్యమంత్రి కాకముందు ఆయన ఇన్కమ్ టాక్స్ రిటుర్నులు చెప్పేకథ ప్రకారం ఆయనకేమంత ఆస్తి లేదు . కాబట్టి వివాదం ఏదైనా ఉంటే జగన్ పాలనలో తనక్కూడా ప్రాధాన్యం ఇవ్వకపోవటమే. అందువల్ల తెలివిగా ఇద్దరిమధ్యా గొడవలేకుండా వై. ఎస్ .విజయమ్మ ఇద్దరినీ చెరో రాష్ట్రానికి పంపకం చేసింది. ఆ విధంగా రాజ శేఖర్ రెడ్డి సంతానాన్ని రెండు శాపాలుగా మార్చి రెండు రాష్ట్రాలను పీడించమని పంపినట్లయింది. నిజానికి మనస్తత్వం రిత్యా జగన్, షర్మిల మధ్య పెద్ద తేడా లేదు . ఇద్దరూ నియంతృత్వ పోకడలున్న వారే . పార్టీని ప్రజాస్వామ్యంలో నడపటంకన్నా తమ ఇష్ట ప్రకారం నడపటంలోనే ఆసక్తి కలవారు. షర్మిల తెలంగాణాలో పార్టీ నడిపిన తీరులో తనదైన నియంతృత్వ పోకడ ఉందని ఆ పార్టీనుంచి బయటికి వచ్చిన వారు తీవ్రంగా విమర్శించారు.

ఇక కాంగ్రెస్ మాటకొస్తే 'అదో అవినీతి పార్టీ' అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిక్షణం దుయ్యబడుతుంటే, కాంగ్రెస్ ఏమైనా గుణపాఠం నేర్చుకొందా అనేది సందేహమే. అవినీతో, నీతోగాని ఎలాగోలాగ తిరిగి ఆంధ్ర రాష్ట్రంలో రావాలని అది చూపిస్తున్న ఆరాటం 'కాంగ్రెస్ తోక ఎప్పటికీ వంకరే' అని నిరూపిస్తుంది . తెలంగాణాలో రేవంతరెడ్డి సాధించిన పలుకుబడి అతని వ్యక్తి గత శ్రమ. తండ్రి పేరు చెప్పుకొని , అక్రమాస్తులను ఎన్నికల్లో విచ్చలవిడిగా పంచి పాలనలోకి రాలేదు. కష్టపడి తన ప్రతిభతో వచ్చాడు. రేవంత్ రెడ్డికి కులం, మతం, ఎస్సి , ఎస్టీల ఓట్లు చర్చిను, మసీదును వెనకనుంచి ప్రభావం చేయటంతో రాలేదు. కానీ జగన్ అధికారంలోకి రావటానికి చర్చీలు , మసీదులు గంపగుత్తగా కృషి చేశాయి. అందువల్ల, జగన్, షర్మిల స్వయం ప్రకాశకాలు కారు. నిముషం మాట్లాడితే, అందులో రాజశేఖర రెడ్డి పేరెత్తకపోతే తమ ఉపన్యాసం

ప్రజలు పట్టించుకోరని భయపడతారు. 'నా కొడుకు వివాహ నిశ్చయ లేఖ నా తండ్రి మసీదు దగ్గర పెట్టడానికి వచ్చాను' అని చెప్పదు షర్మిల. 'రాజశేఖర రెడ్డిగారి మనుమడి వివాహ నిశ్చయ శుభలేఖ ఆయన సమాధి ముందు పెట్టడానికి వచ్చాను' అని చెబుతుంది. జగన్ కానీ, షర్మిల కానీ మాటకుముందోసారి , మాటతరువాతోసారి రాజశేఖర రెడ్డి పేరు ఏత్తకపోతే రాజకీయంగా బతకలేని పర్తిస్థితి. అటువంటి జగన్, షర్మిలతో కాంగ్రెస్ తిరిగి ఎన్నడూ పూర్వ వైభవం పొందలేదు. ఈ ఐదేళ్లలో ప్రజలు జగన్ నాటకాలను చూశారు , షర్మిల నటన వైదుష్యాన్ని తిలకించారు . ఎందుకో కాంగ్రెస్ ఆంధ్రలో షర్మిలను మించిన నాయకురాలిని కాంగ్రెస్కు దక్షత వహించమని కోరలేకపోయింది. ఇది కాంగ్రెస్లో నిజంగా ఉన్న నాయకత్వ లేమినా, లేక నిజంగానే రేవంత్ వంటి నాయకులు ఆంధ్రాలో లేరా? ఎఅన్న సందేహం కలుగుతుంది.

ఇప్పుడుకూడా షర్మిల పార్టీలో తనకన్నా సీనియర్లైనా రఘువీరారెడ్డి, తులసిరెడ్డి, గిడుగురాజు రుద్రరాజు, చింతా మోహన్ వంటి పెద్దల సలహా వింటుందని, వారు చెప్పినట్టు వింటుందని ఎవరైనా అనుకొంటే అది పగటి కలే . మాటిమాటికి ఢిల్లీ వెళ్ళవలసి ఉంటుంది . తనకు ఇష్టం లేకపోయినా అధిష్టానం చెప్పినట్టు చేయవలసి ఉంటుంది. ఇదంతా జగన్, షర్మిల డి ఎన్ ఏ లో లేని విషయం . అంతేగాదు ఇక్కడ తెలుగు ప్రజలు ఆశ్చర్య పోయే విషయం ఒకటి నిన్న జరిగింది . ఆమె అధ్యక్ష పదవిని స్వీకరించేందుకు గన్నవరం విమానాశ్రయం నుంచీ బీసెంట్ రోడ్డుకు వెళ్తుంటే పోలీస్ అభ్యంతరం పెట్టి రెండు గంటలసేపు ఆ రహదారిని దిగ్బంధం చేయటం జరిగింది . ఆ తరువాత ఆమె 'అధ్యక్ష ప్రమాణం' చేసి, జగన్ పాలనను దుయ్యబదుతూ అనర్గళంగా గంటపాటు

ప్రసంగించారు. ప్రసంగం అంతా చిరునవ్వు తొణికిస్తూ (సందర్భానికి తగ్గట్టుగా స్వరం, ఆహార్యం మార్చకుండా) గడగడా ఒప్పజెప్పినట్టు విమర్శించారు. ఎక్కడైనా ఎవరైనా గంభీర విషయాన్ని చెబుతున్నప్పుడు ఆహార్యం మారుతుంది. గొంతు, మోడులాషన్లో భిన్న స్థాయిలు అందుకొంటారు. కానీ , ఒకే మూస పద్ధతిలో ఆమె ప్రసంగించటం అక్కడ కూర్చున్నవారికి, పత్రికల వారికి ఒక వింతగా తోచింది . అన్నింటికీ మించి ఇంతకాలం 'మాది తెలంగాణా, మాకు ఆంధ్రాతో ఏమి సంబంధం 'అంటూ పత్రికల వారి ప్రశ్నలను దాటవేసిన షర్మిల ఇవన్నీ తెలిసిగూడ ఆస్తి కోసమో , పదవి కోసమో వీటిని విమర్శించకుండా ఉన్నట్టే గదా. ఇప్పుడు అవన్నీ ఏకరువు పెట్టి ఈమె చేసేదేముంది?

ఇంకా వింతేమిటంటే ఇక్కడ దళితులపై, స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలగురించి కాకుండా మణిపూర్ లో 2000 క్రిస్తవ చర్చిలు కూలిపోవటం ఆమె ప్రసంగంలో ప్రత్యేక ఆకర్షణ. అంటే 'క్రిస్తవ మార్క్' ఎన్నికల్లో చూపించాలన్న ప్రయత్నం విరమించలేదన్నమాట. ఇది బీజేపీకీ 'కర్రనిచ్చి కొట్టించుకోవడం' అంటారు. ఇప్పటికే జగన్ పాలన వచ్చాక సందుకు అయిదు చర్చిలు వెలిశాయి. రాత్రీపగలూ చర్చిలలో పాటలు, డిస్కోలు, ప్రసంగాలు, ఉచిత భోజనాలు ఎక్కువైపోయాయి. రోడ్లు జామ్లు అయిపోతున్నాయి. తటస్థ హిందువులు, హిందువులుగా చలామణి అవుతూ క్రిస్తవం పాటిస్తున్నవారు కూడా ఈ ధోరణికి నివ్వెరపోతున్నారు. 'అతి సర్వత్రా వర్జయత్' అన్న దానిని వారు ఇప్పుడు పదే పదే వల్లే వేసుకొంటున్నారు. ఇప్పుడు ఈమె కూడా 'క్రిస్టియన్ కార్డు' ఆడటం మొదలు పెడితే, ఆమె వలన కాంగ్రేస్ కు ఒనకూడే ప్రయోజనం ఏమిటో ఆపార్టీ వారే తేల్చుకోవాలి. అంతేగాదు. గతంలో ఏదైనా విషయాలలో

నోరువిప్పి, పోరాడి ఉంటే తెలంగాణాలో ఉన్నా న్యాయం వైపు ఉందని పలువురు అనుకొనే అవకాశం ఉండేది. అంటే, తుదకంటూ తనకు ఏ న్యాయం జరగదని తెలిసి, ఆంధ్రాలోకి అడుగుపెట్టాక నోరు తెరవటాన్ని, అదీ ఎన్నికలకు 80 రోజుల ముందు ఈ విషయాలన్నీ తానే గత నాలుగేళ్లుగా గమనిస్తూ , పోరాడుతున్నట్లు బిల్డప్ ఇస్తూ మాట్లాడితే ప్రజలు నవ్విపోరా? ఏది ఏమైనా ప్రసంగాల మాటకొస్తే అన్నా, చెల్లెళ్ళ ఇద్దరిదీ సినీ ఫక్కీనే అని ప్రజలు నవ్వుకుంటున్నారు.

చివరగా 'అవినితి' పై కాంగ్రెస్ తీరు గురించి ఒకమాట చెప్పాలి స్వయంగా అనేక కేసుల్లో రాజశేఖరరెడ్డి నిందితుడు. సి బి ఐ తన ఛార్జిషీట్ లో అలానే పేర్కొంది. ఆ విషయంలో జగన్ వాదన, షర్మిల వాదన ఒకటే . అవన్నీ కల్పిత నేరాలే అని. ఒకప్పుడు గులామ్ నబి ఆజాద్ 'జగన్, షర్మిల' ది కాంగ్రెస్ డి ఎన్ ఏ అని అనటం వెనుక ఉద్దేశం ఏమిటీ? తప్పుడు కేసులు పెట్టారనా లేక అవినీతి కాంగ్రెస్ డి ఎన్ ఏ అనా? అంతేగాదు , 'కాంగ్రెస్ నాడు జగన్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఉంటే జగన్ వేరే పార్టీ పెట్టి ఉండేవాడే కాదు' అని కూడా పలువురు కాంగ్రెస్ పెద్దలు ప్రవచిస్తుంటారు. దీని అర్థం ఏమిటి? ఇప్పటికీ కాంగ్రెస్ 'అవినీతి ' పరులను తమ పార్టీలో చేర్చుకొంటూ , వారిని అందలం ఎక్కిస్తూ, మోడీని 'అవినీతిపరుడు' అని , ఆదానీతో కుమ్మక్కై కోట్ల అవినీతికి పాల్పడ్డారని రంకెలు వేస్తూనే ఉంటారా?

ఏది ఏమైనా దేశం , రాష్ట్రం ఎలెక్షనులకు వెళ్లనున్న ఈ తరుణంలో షర్మిల లాంటి వ్యక్తిని కాంగ్రెస్ అధ్యక్ష స్థానంలో పెట్టి కాంగ్రెస్ చేయ కూడని పనిచేసింది. అవినీతిపరుడైన అన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, అవినీతిపరుడైన తండ్రి కూతురు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు. మోడీకి

ఇంతకంటే బలమైన సరకు ఎక్కడన్నా దొరుకుతుందా? ఇది బీజేపీ పురందరేశ్వరి, ప్రధాని మోడీలకు బ్రహ్మాస్త్రాలను అందించటమే. ఆంధ్ర ప్రజలను ఈ విషయంలో మోడీ దున్ని పారేస్తే, 'ఇంకా కాంగ్రెస్ మురికినే తెలుగు ప్రజలు మోస్తుండాలా?' అన్నది అసలు ప్రశ్న. ఏతావాతా తేలేదేమిటంటే కాంగ్రేస్ తోక ఎప్పటికీ వంకరే, అవినీతిపరులను అక్కున చేర్చుకోవటంలో దానికి ఎటువంటి మొహమాటం లేదు. అందునా మోడీ లాంటి వారు కడిగేస్తున్నా సరే.

(అక్షరాంజలి మాసపత్రిక మార్చి, 2024)

డా॥ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ సాక్షిగా - ఆంధ్రాలో పరాకాష్టకు చేరిన దళితులపై దమనకాండ!

జర్నలిస్ట్ ఇవాళ జనపల్లి శ్రీనివాసులుకు విచారణలేకుండా విధించిన అయిదు సంవత్సరాల కారాగారం నుంచీ విముక్తి లభించింది. 2018లో సార్వత్రిక ఎన్నికల ముందు విశాఖపట్నం విమానాశ్రయంలో తనపై కోడి కత్తితో హత్యాయత్నం చేసాడనే నెపంతో జనపల్లి శ్రీనివాసులును తొలిసారి నిర్బంధంలోకి తీసుకొన్నారు. అప్పటినుంచీ ఈ కేసు విచారణ ముందుకు సాగకపోగా, పాపం శ్రీనివాసులు ఐదేళ్లు జైల్లోనే మగ్గాడు. 'జనపల్లి శ్రీనివాసులు దళితుడు కాబట్టి న్యాయం అతనికి దూరం అయింది' అని దళిత సంఘాలు నెత్తి, నోరు కొట్టుకొని మరీ చెబుతున్నాయి. లేకపోతే ఒక వ్యక్తి నేరం నిరూపణ కాకుండానే జైలులో ఐదేళ్లు గడపటం డా భీంరావు అంబెద్కర్ రాసిన రాజ్యాంగం ఊహించి ఉండదు. అది రాజ్యాంగం లోని వ్యక్తి స్వేచ్ఛకు (ఆర్టికల్ 19) వ్యతిరేకం కూడా .

ఇక్కడ మరో విషయం జ్ఞప్తి చేసుకోవాలి. కాకినాడకు చెందిన వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్లో శిరోముండనం చేశారు ఆంధ్ర పోలీసులు. ఇసుక అక్రమరవాణాను అడ్డుకొన్నందుకు పోలీస్ స్టేషన్లోనే పోలీసులే ఈ శిరోముండనం జరిపించారు. సాక్షాత్తు రాజానగరం ఎం ఎల్ ఏ జక్కంపూడి రాజా నేతృత్వంలో ఉండే ఈ నియోజకవర్గంలో జరిగిన ఘోరం ఇది. నాటి రాష్ట్ర పతి స్వయంగా జోక్యం చేసుకొన్నా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరికి కోర్టే శరణం అయింది. అంతకు ముందు కాకినాడ స్వతంత్ర ఎం ఎల్ ఏ తోట త్రిమూర్తులు విశాఖకు చెందిన దళిత యువకులుకోటి చిన్నరా,

డి వెంకటరత్నయిలకు శిరోముండనం చేయించారు. ఈ రెండు కేసుల్లోనూ విచారణ ఇన్నేళ్లు సాగలేదు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జోక్యం చేసుకొని ఆ కేసులపై ఉన్న స్టే లను తొలగించి, సత్వరమే విచారణ పూర్తి చేయమని ఆదేశించింది.

మరో కేసులో కాకినాడ కు చెందిన ఎం ఎల్ సి అనంతబాబు తన కారు డ్రైవర్, దళిత యువకుడైన వీధి సుబ్రహమణ్యంను దారుణంగా కొట్టి చంపినా, అతనికి ఆరు నెల్లల్లోనే బెయిల్ లభించింది. ఇప్పుడు అనంతబాబు స్వేచ్ఛగా ముఖ్యమంత్రితోనే హెలికాప్టర్లలో చక్కర్లు కొడుతూ, జగన్మోహన్ రెడ్డి పక్కనే కుర్చీలో కూర్చోవటం మనం మీడియాలో చూసాం. ఇక విశాఖకు చెందిన దళిత డాక్టర్ సుధాకర్ కు కేవలం మాస్కులు లేవని మీడియా ముందు వాపోయినందుకు పట్టిన దుర్గతి రాష్ట్ర ప్రజలంతా ఎరిగినదే.

ఇక విశాఖకు చెందిన దళిత డాక్టర్ సుధాకర్ కు కేవలం మాస్కులు లేవని మీడియా ముందు వాపోయినందుకు పట్టిన దుర్గతి రాష్ట్ర ప్రజలంతా ఏంరిగినదే. అలానే యరిచెర్ల కిరణ్ కుమార్ను పోలీసులే కొట్టి చంపారు చీరాలలో మాస్క్ పెట్టుకోలేదని. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో, ఎన్నెన్నో కేసులు ఈ ఐదేళ్లలో మన కళ్ళముందు సాక్షాత్కరిస్తాయి. ఎందరో దళిత మహిళలు మానభంఘానికి గురై ట్రాక్టర్ల క్రింద, ఇతర ప్రదేశాలలో హత్యకు గురైనారు. అన్నింటికీ మించి అమరావతి దళితమహిళల పైన పోలీసుల జులుం మర్చిపోవటం చూసిన వారికెవరికైనా సాధ్యమా. ఒళ్ళు గగుర్పొడిచేట్టుగా ఆ దళిత స్త్రీలను హింసించిన వైనం బ్రిటిష్ పాలనను తలపించింది. ఇంకా దారుణం ఏమిటంటే దళితులమీదనే దళిత చట్టాలను, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని వాడి వారిని జైలులో

పెట్టడం. ఒక రకంగా రాష్ట్రంలో మున్నెన్నడూ చూడని హింస ఈ ఐదేళ్లలో సాగింది. ప్రతిసారీ హైకోర్టు, సుప్రీమ్ కోర్టులకెళ్లి జైలునుంచి బయటికి వచ్చేటందుకు దళితులు అనుభవించిన మానసిక, శారీరక హింస మానవ సహన పరిమితి దాటి, 'అంతకు మించి' అన్నట్టు సాగింది. ఈ ఐదేళ్లు రాష్ట్రంలో దళితులకు ఓ పీడకలనే చూపించాడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి. పేరుకు రాష్ట్ర హోంమంత్రి దళితురాలై నా, ఇవన్నీ ఆవిడ కళ్ళముందే జరుగుతున్నా ఆవిడ ప్రేక్షక పాత్రనే పోషించిందంటే రాష్ట్రంలో పాలన ఏ స్థితికి దిగజారిందో అర్థం అవుతుంది .

నిజానికి దశాబ్దాల క్రితం కాంగ్రెస్ పాలనలో జరిగిన కారంచేడు (1985), చుండూరు (1991) ఘటనలను ఇప్పటికీ చెప్పుకొంటుంటారు. అప్పట్లో దళిత నాయకులు వీరోచిత పోరాటాలు సాగించారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా. ముఖ్యంగా ఈ దారుణాలకు ఒడిగట్టిన వారిని అరెస్టు చేసి ప్రభుత్వమే వారికి శిక్షలు పడేట్లుగా ఒప్పించారు. కారంచేడు ఘటనప్పుడు ముఖ్యమంత్రి ఎన్ టీ ఆర్. ఘటనలో ప్రధాన పాత్ర ధారులు ఆయన బంధువులే. చుండూరు ఘటనప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ జనార్ధన రెడ్డిగారు. రెండు సందర్భాలలోనూ ఆయా పాలకుల కులస్తులే ఈ దారుణాలకు ఒడిగట్టారు. 'కరుడుగట్టుకుపోయిన కమ్మ, రెడ్డి కులతత్వాలే ఈ క్రూర ఘటనలకు కారణం' అని అనేకమంది విదేశీ సామాజిక పరిశోధకులు తమ విశ్లేషణలలో పేర్కొన్నారు. బొజ్జా తారకం, కత్తి పద్మా రావుల పోరాటాలు కొంత రాజకీయ సామాజిక చైతన్యాన్ని ప్రజలలో తెచ్చాయి. ఆ తరువాత అటువంటి సంఘటనలు జరగలేదు.

ఇప్పుడు అంతకంటే ఘోరమైనవి గత అయిదేళ్ల జగన్ పాలనలో చోటు చేసుకొంటున్నాయి. ఇప్పుడుకూడా మంచి నాయకత్వం ఉంది.

కానీ, కారణాలు తెలియదు. ఇవాళ ఆనాయకులు గళం ఎత్తి దళితుల తరపున పోరాడటం లేదు. పోతుల బాలకోటయ్య, జడ శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస రావు లాంటి అభ్యుదయవాదులు కొంతమంది పోరాడినా దళిత నాయకత్వం ఒకటి కాలేక పోవటం గమనార్హం. డొక్కా మాణిక్య ప్రసాద్ , జూపూడి వంటివారు పదవులకు అమ్ముడు పోయి మౌనాన్ని ఆశ్రయించటంతో దళిత పోరాటం గతంలో ఉన్నంత పకడ్బందీగా ఇప్పుడు కనిపించటంలేదని వాపోతున్నాయి దళిత సంఘాలు.

దళితులు ఇంతటి దారుణ హింసలకు అవమానాలకు గురవుతున్నా జగన్ మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలోనే ఉన్న మేరుగ నాగార్జున, తానేటి వనిత, పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ బాబు లాంటి వారు పార్టీలకతీతంగా గళం విప్పిన దాఖలాలు లేవు. ఇక అవమానం భరించలేము అనుకొన్న వారు కొంతమంది (ఉదా హరణకు ఉండవల్లి శ్రీదేవి) ఆ పార్టీనుంచి బయటికి వచ్చి ప్రతిపక్షాన్ని (టీడీపి) ఆశ్రయించారు. అందువల్ల దళితులకు ఒనగూడిన ప్రయోజనం ఇప్పటికి ఏమీ లేదు.

ఈ కారణంగా ప్రతి విషయానికి దళితులు కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోంది. కుల వివక్ష, తప్పుడు కేసులు, శారీరక, మానసిక హింస వంటి సమస్యలతో ప్రతి ఒక్కరూ కోర్టుతలుపులు తట్టడంతో హైకోర్ట్ లో గత ఐదేళ్లలో ఈ ప్రభుత్వానికి , దాని జులుం కు వ్యతిరేకంగా దాదాపు 30,000 ల కేసులు దాఖలు అయినాయి అని ప్రసిద్ధి చెందిన అడ్వొకేట్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కులమును లక్ష్యంగా పెట్టుకొని కొందరు మంత్రులు చేసే జులుం, ఆ ఆడియోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దళిత మంత్రులు కూడా జగన్ మెప్పుకోసం, పదవులకోసం దిగజారి ఆయన పాదాలవద్ద కూర్చోవడం

చూసాము. కొందరు రెడ్డి మంత్రులు, సాటి దళిత మంత్రులు, దళిత ఉప ముఖ్య మంత్రులకు వేదిక పైన కుర్చీలు కూడా వేయకుండా వాళ్ళని తమ వెనుక నిల్చోబెట్టడం కూడా చూసాము ఈ ఐదేళ్లలో. బహుశ గత 70 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో వారు, వీరు అని తేడాలేకుండా అన్నిస్థాయిలలో దళిత వర్గాలు ఇంత హీన స్థితిలో ఉండటం ఇదే ప్రథమం. చివరికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక లోనూ ఈ వివక్ష కొనసాగుతోంది. ఇప్పటిదాకా తిరిగి సీటు పొందని వారుగానీ, లేక స్థాన చలనం పొందిన అసెంబ్లీ అభ్యర్థులలో ఎక్కువ శాతం ఎస్సి, ఎస్టీ కులస్తులే అవటం గమనార్హం.

''లోకమందున ఎంచి చూడగ మంచి చెడ్డలు రెండు కులములు, మంచి అన్నది మాల అయితే, మాల నేనవుతాను' అన్న గురజాడ పలుకులు 'ఏ జాడలోనూ లేవు' అన్నది నిజం. ఇది ఇలా ఉంటే ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిగారు మాత్రం ప్రతి ఎలక్షన్ మీటింగ్ లో 'నా ఎస్సి, నా ఎస్టీ' అంటూ నోరూరించే కబుర్లు చెబుతూండటం, అక్క చెల్లెల్లు వింటూండటం 'షరా మామూలు' గా మారిపోయింది . ఇదంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగ సాక్షిగా జరగటం ఎంతో శోచనీయం.

(అక్షరాంజలి మాసపత్రిక ఏప్రిల్ , 2024)

మన దేశం ఉత్తర, దక్షిణంగా విడిపోక తప్పదా? ఎలక్షన్స్ తరువాతైనా దక్షిణాది వారికి న్యాయం జరుగనుందా?

ఇటీవల లోక్ సభలో కర్ణాటక ఎం.పి. డి కె సురేష్ చేసిన ప్రకటన ఎంత సంచలనాత్మకమో, అంత ఆలోచనాత్మకం. ఎందుకంటే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వమే కాదు, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా దక్షిణాది పై సవతి తల్లి ప్రేమ చుపిస్తున్నాయన్న ఫిర్యాదు ఉన్నాయి.

ఈ సవతి తల్లి చూపు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా రావలసిన నిధులకు కూడా దేబిరించవలసిన పరిస్థితి. దేబిరించినా ఎంగిలి మెతుకులు కూడా రాల్చని స్థితి కేంద్రానిది. అప్పట్లో తమిళనాడులో అన్నాడీఎంకే బీజేపీతో అంట కాగిన పుణ్యాన , నాడు పార్లమెంటులో ఎం.తంబిదొరై డిప్యూటీ స్పీకర్ గాను, పార్లమెంట్ లో అన్నాడీఎంకే లీడర్ గాను ఉన్న కారణాన తమిళనాడుకు కొంత విదిలింపులు జరిగినా, కర్ణాటక, కేరళ, ఆంధ్ర రాష్ట్రాల విషయంలో మొండి చేయే చూపింది కేంద్ర ప్రభుత్వం. అంతెందుకు 2014-2019 మధ్య కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండగా, కొత్తగా ఏర్పడ్డ ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ సంఘటన ప్రభుత్వం ఉండేది. పైపెచ్చు కేంద్రంలో రెండు మంత్రి పదవులలో టీడీపీ వారు ఉంటే, రాష్ట్రంలో రెండుమంత్రి పదవులలో బీజేపీవారు ఉండే వారు అయినా కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి కావలసినవి రాబట్టుకోవటంలో ఎంతో ఇబ్బంది పడేవారు. కొంతకాలం కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కు చెందినవాడైన ముప్పవరపు వెంకయ్యానాయుడు కేంద్ర మంత్రిగా ఉండటం వలన రాష్ట్రానికి కొన్ని విద్యా సంస్థలు, కొత్త రాజధానికి 1000 కోట్ల నిధులు వచ్చాయి. కొన్ని చిన్నపాటి కేంద్ర సంస్థలు రాయలసీమలో ఏర్పడ్డాయి. అయితే వెంకయ్య నాయుడు ఇలా

రాష్ట్రానికి అన్నీ ఇచ్చుకుంటూ పోతే , మళ్ళీ టీడీపీ ప్రభుత్వమే అధికారం లోకి వస్తుందన్న అభిప్రాయంతో బీజేపీలోని ఒక కుత్సిత వర్గం ఢిల్లీలోని పెద్దలకు విషం నూరిపోశారు. ఫలితంగా వెంకయ్య నాయుడు కేంద్రమంత్రి పదవినుంచీ దిగి ఉపరాష్ట్రపతై ఆంధ్రకు ఏమీ కాకుండా పోయారు.

అదే వర్గం మాట విని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని సమయం ఇవ్వటానికి కూడా నిరాకరించారు . ఆ సమయంలోనే దాదాపు 32 కేసుల్లో ముద్దాయిగా కోర్టుకు హాజరవుతున్న జగన్మోహన్ రెడ్డిని చేరదీశారు. జగన్ తో సహా నిందితుడైన రాజ్యసభ సభ్యుడైన విజయ సాయిరెడ్డికి , జగన్ కు సమయం ఇవ్వటం ప్రారంభించారు. జగన్ పై ఉన్న కేసులన్నీ కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సి బి ఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈ డి) పెట్టినవే. ఆ విషయం ప్రధాని మోడీకి తెలియనిది కాదు. ఎందుకంటే ఈ సంస్థల్లో ఒకటైన సి బి ఐ నేరుగా ప్రధాని పర్యవేక్షణలో పనిచేస్తుంది. హోంమంత్రి అమిత్ షా కేవలం పాలనాధికారి మాత్రమే. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈ .డి) ఫైనాన్స్ మినిస్టర్ కింద ఉంటుంది. అంటే గతంలో అరుణ్ జైట్లీ , ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కిందనున్న మాట. ఎప్పుడైతే ప్రధాని మోడీ జగన్ ను , ఆయన అనుయాయులను చేరదీశాడో, అప్పుడే వీరు చేష్టలుడిగిన వారైనారు.

తాను సత్యశీలుడినని చెప్పుకొనేప్రధాని మోడీ ఎప్పుడైతే జగన్ లాంటి వ్యక్తులను చేరదీసి, వారికి వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం సంస్థలు పెట్టిన కేసులను ముందుకు సాగనీయలేదో అప్పుడే దక్షణాది ప్రజలకు, రాష్ట్రపాలకులకు మోడీ స్వభావం అర్ధమైంది. చంద్రబాబును గద్దె దింపి, జగన్ ను ముఖ్యమంత్రిగా చేయాలన్న మోడీ ఆకాంక్ష నెరవేరే రీతిలో పావులు కదిలాయి. చంద్రబాబు పై విమర్శల నెక్కుపెట్టి 'ఆయన్ను అరెస్ట్

చేస్తాం' , 'జైలుకు పంపుతాము' అంటూ బీజేపీ అధికార ప్రతినిధి, అప్పటి పార్లమెంట్ సభ్యుడు జీ వి ఎల్ నరసింహ రావు ప్రతిచోటా, ప్రతివేదికపైనుంచీ, ఆఖరుకి మీడియా ద్వారా రంకెలు వేయటం ప్రారంభించారు. చివరికి పరిస్థితి ఎలా వచ్చిందంటే చంద్రబాబు, ఆయన పార్టీ ఎం.పీలు ఎంతమాత్రం గౌరవంగా కేంద్రంలో ఉండలేరన్నంతగా. ఆ పరిస్థితిల్లో చంద్రబాబు ప్రభుత్వం కేంద్రంనుంచీ వైదొలగింది.

అప్పటినుంచీ ఎన్నికలవరకూ చంద్రబాబు కేంద్రంలోని బీజేపీ నిరంకుశ, కుత్సిత రాజకీయాలకు వ్యతిరేకంగా 'ధర్మపోరాటం' సాగించారు. ఆఖరుకు ఎన్నికల ప్రకటన రాగానే , ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆంధ్ర రాష్ట్ర డిజిపిని, చీఫ్ సెక్రటరీని, పలు జిల్లాలలో ఐ ఏ ఎస్ లను, ఐ పీ ఏస్ లను మార్చేశారు. కావాలనే టీడీపీకి ప్రచార సమయం ఇవ్వరాదనే రాష్ట్రం మొత్తం ఎలక్షన్లను ఒకే సారి నిర్వహించి, పెద్ద ఎత్తున ఎన్నికల మోసాలకు తెరదీశారు. చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో పోలీస్ , ఎన్నికల యంత్రాంగం కుమ్మక్కు అయి అర్ధరాత్రి వరకు ఓట్లు వేయించే సంస్కృతికి తెర లేపారు. ఈ అరాచక పరిస్థితులు ఇప్పటివరకూ కొనసాగాయంటే కొద్ది ఓట్ల తేడా వచ్చిన చోట ఓట్ల లెక్కింపు మళ్ళీ జరిపి నిర్ధారణ చేయవలసిన చోటుకూడా ఏకపక్షంగా టీ డీ పీ వ్యతిరేకపార్టీగా పోటీచేసిన జగన్ వై ఎస్ ఆర్ సి పి అభ్యర్థులు గెలిచినట్టు ప్రకటించారు. ఆంధ్ర రాష్ట్రం గతంలో ఎన్నడూ చూడని ఎన్నికల అరాచకం రాజ్యం ఏలింది.

ఫలితంగా టీడీపీ ఓడి, జగన్ అధికారంలోకి వచ్చాడు. అప్పటినుంచీ జగన్ కేసులలో విచారణ ఆగిపోయింది. ఒక్కకేసులో కూడా విచారణ జరగకుండా మోడీ కాపాడాడు జగన్ ను. దాధాపు

3000లకు పైగా వాయిదాలు పడ్డాయి. జగన్ కోర్టుకు హాజరవ్వకుండా, హాజరవ్వవలసిన పని లేకుండా కోర్టుల తీర్పులను మేనేజ్ చేశారు. ఈ లోగా మోడీకి అత్యంత ప్రియ పారిశ్రామిక వేత్తయిన ఆదానికి రాష్ట్రం ఉడ్చిపెట్టారు. జగన్, ఆయన అనుయాయులు రాష్ట్రాన్ని దొరికింది దొరికినట్టు దోచేశారు. కోర్టులు అడ్డుపడితే ఆ జడ్జిలనే మార్చేశారు. జడ్జీలను సోషల్ మీడియా ద్వారా బెదిరించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే అన్నిచట్టాలను సమర్ధవంతంగా అమలు జరిపారు. జర్నలిస్టులను, టిడిపి సోషల్ మీడియా వర్కర్లను, స్వతంత్ర సోషల్ మీడియా వ్యవహర్తలను జైళ్లలో వేసి, లేక దాడి చేసి భయ భ్రాంతులకు గురిచేశారు రాష్టం గగ్గోలు పెట్టినా కేంద్రంగానీ , మోడీ గానీ పట్టించుకోలేదు. ఇవాళ్టి రాష్ట్ర దుస్థితికి మోడీనే కారణం అని తెలుగు ప్రజలు విశ్వసిస్తున్నారు. మోడీ అవినీతి వ్యతిరేక పోరాటంలోని డొల్లతనం జగన్ ద్వారా బట్ట బయలు అయింది.

ఇది నాణానికి ఒకవైపు. ఇక దక్షిణాదిన ఇతర రాష్ట్రాల విషయానికి వస్తే తమిళనాడు డి ఎం కె పాలనలోకి వచ్చాక, అక్కడ మంత్రులపై కేంద్ర సంస్థలైన సి బి ఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈ డి) దాడులు ఎక్కువైనాయి. తమిళనాడు గవర్నర్ జోక్యం స్టాలిన్ పరిపాలనలో ఎక్కువైపోయింది. ప్రభుత్వం ఏ బిల్లు ఆమోదించినా గవర్నర్ ఒకపట్టాన ఆమోద ముద్ర వేయటం లేదు. ప్రతిదానికి స్టాలిన్ ప్రభుత్వం సుప్రీమ్ కోర్ట్ తలుపు తడితే తప్ప బిల్లులు గవర్నర్ ఆమోదం పొందని పరిస్థితి. ఇక నిధులు సంగతి చెప్పనక్కరలేదు. సాక్షాత్తు ప్రధాని కూర్చుని ఉన్న వేదికనుంచే స్టాలిన్ తమిళనాడుకు రావలసిన కోట్ల నిధులను త్వరగా విడుదల చేయమని ప్రార్థించడం ప్రతిపక్షాలు పాలిస్తున్న అన్ని రాష్ట్రాల

ముఖ్యమంత్రులను ఆలోచింపచేసింది. తమిళనాడు తరుచు వరదలకు, తుపానులకు గురి అవుతుంటుంది. వాటి విషయమై డిసాస్టర్ మానేజ్మెంట్ కింద రావలసిన నిధులు అందడంలేదని స్టాలిన్ తెలిపాడు అదే వేదిక పైన. ఏ నూతన పరిశ్రమ తమిళనాడులో నెలకొల్పలేదు ఈ కాలంలో. ఈ వేధింపులకు రెచ్చిపోయి స్టాలిన్ కుమారుడు 'సంప్రదాయ, సనాతన ధర్మాన్ని' నాశనం చేస్తే గానీ సమాజం అభివృద్ధి చెందదు అని అనటంతో సనాతన ధర్మానికి రక్షకులుగా తమను తాము నియమిచుకొన్న బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ కూటమి తీవ్రంగా స్పందించింది. ఇలా బీజేపీ, డి ఎం కే పరస్పర సిద్ధాంత వైరుధ్యాల కొలిమిలో చలి కాచుకోవటంతో తమిళనాడు అభివృద్ధిలో వెనుకబడటం ప్రారంభమైంది.

కర్ణాటక విషయానికి వస్తే 2013 లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వచ్చింది. అప్పుడు బీజేపీ కేవలం ప్రతిపక్షానికి పరిమితమైంది. కానీ 2018లో కాంగ్రెస్ ఆ బలాన్ని నిలబెట్టుకోలేక కుమారస్వామి జె డి ఎస్ తో చేయి కలిపింది. ఇందులో భాగంగా కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యాడు తక్కువ సీట్లు గెలిచికూడా . కానీ , మే 2018లో ముఖ్యమంత్రి అయినాక సంవత్సరం దాటకుండానే, తన పార్టీ ఎం ఎల్ ఏ లు 13మంది బీజేపీకి మద్దత్తు తెలుపడంతో, ముఖ్యమంత్రి పదవికి జూన్ 2019న రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ తరువాత ఎదియూరప్ప 2023 ఎలెక్షన్ల వరకూ పదవిలో కొనసాగాడు. ఇలా 2018లో అధికారంలో రాలేకపోయినా గవర్నర్ ద్వారా వెనుక జరిపిన తంత్రంతో బీజేపీ అధికారం చేజిక్కించుకొంది . ఈవిధంగా కేంద్రంలోని బీజేపీ తన పాలన విస్తరణలో భాగంగా గవర్నర్ వ్యవస్థలను, కేంద్ర సి బి ఐ ఏజెన్సీలను, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్లను విచ్చలవిడిగా వాడుతూ ఉత్తర, దక్షిణ తేడాల్లేకుండా ఎన్నికైన

ప్రభుత్వాలను పడదోయటం, ముఖ్యమంత్రులపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపించటం పరిపాటైపోయింది. ఒక రకంగా భారతదేశ చిత్రపటంలో రాష్ట్రాలు ఏవీ మోడీ పాలనలో సురక్ష్యంగా ఉన్న అనుభూతి పొందటంలేదు. అందునా దక్షిణాది రాష్ట్రాలలో నూతనంగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం ముఖ్యంగా ఈ అస్థిరతకు ఎదురొకొంటున్నది. మోడీ ఈ రకం పాలనా చేస్తుండటంతో అసలు ఎవరు నిజాయితీ పరుడో, ఎవరు దొంగో తెలియకుండా పేడా, బెల్లం కలిసిపోయినట్టనిపిస్తున్నది. దేశం ఒక అయోమయ స్థితి ఎదుర్కొంటున్నది.

ఇది మోడీ సమర్ధవంత పాలనకు ఎంతమాత్రం నిదర్శనం కాదు. కాకపోగా ప్రజాతంత్రం, ప్రజాస్వామ్యం, ప్రజల భావజాలానికి భిన్నమైన మోడీ నియంతృత్వ పాలనకు ఒక ప్రతీకగా నిలుస్తున్నది. ఇప్పుడు ఎలక్షన్స్ సమయం. ఉత్తరాదిన బీజేపీ బలమైన ఇండియా (INDIA) కూటమిని ఎదుర్కొంటున్నది. మోడీ పాలనలో విషాన్ని, హాలాహలాన్ని కలగలిపి మింగిన ఉత్తరాది రాష్ట్రాలు (హిమాచల్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ జార్ఖండ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రల, కొలకత్తాలు) మోడీ బీజేపీని అంతగా ఆదరించకపోవచ్చు. 'మోడీ ఛరిష్మా' అంటూ బీజేపీ అనుయాయులు ఎంత ఉదరకొట్టినా, సామాన్యుడు నడ్డి విరిచిన మోడీ విధానాలు, పెరిగిన నిరుద్యోగం, ఆకాశాన్నంటే ధరలు, కరోనా సమయంలో ముక్కిన బియ్యం, పురుగులు పడ్డ కందిపప్పు సరఫరా చేసిన మోడీ 'ఆహార గ్యారంటీ', ఇలా చెప్పుకొంటూ పోతే లెక్కకు మించిన మోడీ వైఫల్యాలు ప్రజల మనస్సులో ఇంకా సజీవంగానే ఉన్నాయి.

అందువల్ల మోడీ ఆశిస్తున్న మూడవసారి ప్రధాని పదవి అంత సులువుగాదు. దాదాపు 370 సీట్లు ఉత్తరభారతం ఒక్కటే కట్టబెట్టకపోవచ్చు.

అంతగా ప్రాధాన్యం లేని బీజేపీకి దక్షిణాది రాష్ట్రాలలో వందల సంఖ్యలో సీట్లు దక్కకపోవచ్చు. కనీసం కొంతలో నైనా రాబట్టుకోడానికి ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రం , టీడీపీ , జనసేన పై హఠాత్తుగా ప్రేమ పుట్టుకోచ్చింది. ఎవరినైతే కుట్రపూరితంగా ఓడించారో, ఇవాళ ఆచంద్రబాబే అవసరమయ్యాడు. వయస్సులో పెద్దవాడు, మూడు సార్లు ముఖ్యమంత్రి చేశాడన్న జ్ఞానం లేకుండా చర్చలపేరున ఢిల్లీకి పిలిపించి సీట్లు అడగటం ఉత్తరాది బీజేపీ అహంభావమే . తెలుగు రాష్ట్రానికి సేవచేయాలనే ఏకైక లక్ష్యం , చిత్తశుద్ధి ఉన్న వ్యక్తిగా చంద్రబాబు అన్ని అవమానాలు భరించి ఢిల్లీ వెళ్లి వాళ్ళతో పొత్తు పెట్టుకొని కొన్ని పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు ఇవ్వటానికి అంగీకరించటం చంద్రబాబు రాజనీతిజ్ఞతకు, ప్రజాస్వామ్య విలువలకు మరొక నిదర్శనం. బహుశ ఎన్నికాలానన్తరం బీజేపీ తిరిగి అధికారంలోకి రానూ రావచ్చు, రాకపోనూ పోవచ్చు. ఏది జరిగినా మోడీ గత పాలన తిరిగి పునరావృతమైతే దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేక దేశంగా విడిపోవటానికి సన్నద్ధం కాక తప్పదు. ఉత్తరాది అవమానాలు ఇక సాగనివ్వకూడదు. ఆ దిశగా దక్షిణాది ప్రజలు తమ దిశా నిర్దేశం చేసుకోవలసి ఉంటుంది.

(అక్షరాంజలి మాసపత్రిక మే , 2024)

అధికారం పోయినా మారని కే సి ఆర్ ఫ్యూడల్ మనస్తత్వం - పతనం అంచున బీ ఆర్ ఎస్

తెలంగాణాలో కొత్త ప్రభుత్వం వచ్చి మూడునెలలు పైనే అయింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి 'వాడు మగాడురా బుజ్జి' అని అనిపించుకున్నాడు. ఎక్కడో కథలలో, సినిమాలలో నాయకులు, నాయికలు చేసిన ప్రతిజ్ఞలను నిలబెట్టుకోవటం చూస్తుంటాం. చూసి బయటికి వచ్చి 'అది సినిమా కాబట్టి సాధ్యమైంది. నిజజీవితంలో అలా ప్రతిజ్ఞ చేసి నిలబెట్టుకోవటం మాటలా?' అని అనుకొంటూ ప్రేక్షకులు వెళ్లి పోవటం కూడా చూస్తుంటాం. కొన్నేళ్ల క్రితం (మే 31, 2015 న) ఎల్విస్ స్టీవెన్సన్ అనే ఒక నామినేటెడ్ ఎం ఎల్ ఏ ఓటు కొనుగోలు చేసేందుకు రేవంత్ రెడ్డి 50 లక్షలు తీసుకెళ్లి అతనికి ఇస్తున్న సమయంలో తెలంగాణా ఏ సీ బి ఆయనను అరెస్ట్ చేశారు. అవి కొత్తగా ఏర్పడిన తెలంగాణాలో కొత్త ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తొలి రోజులు. ఇక టీ డీ పి కి తెలంగాణా లో భవిష్యత్తు లేదని, ఆ పార్టీ జెండాపై గెలిచిన ఎం ఎల్ ఏ లను ఒక్కొక్కరిగా తన ఫార్మ్ హౌస్ కు పిలిపించుకొని గులాబీ కండువాలు కప్పారు కే సీ ఆర్. అయితే అందుకు ప్రతిగా టీ డీ పి కూడా ఎం ఎల్ ఏ లను కొని దెబ్బకు దెబ్బ కొట్టాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టడంతో రేవంత్ రెడ్డి రాజకీయ బలి పశువు అయినది వాస్తవం. నాడు టీ డీ పి లో రేవంత్ రెడ్డి ఒక సాధారణ ఎం ఎల్ ఏ మాత్రమే. కానీ, రేవంత్ ను అలా ఆరెస్ట్ చేయటం వెనుక కే సీ ఆర్ చాలా కుతంత్రమే నడిపాడని నాడే అందరికీ అనుమానం కలిగింది. నాటి టీ ఆర్ ఎస్ టీ టెలివిజన్, మరో చంద్రబాబు వ్యతిరేక ఛానల్ ఎన్ టీ వి సంయుక్తంగా ఒకే సారి ప్రసారం చేసిన ఆ దృశ్యాలు చాలా మందిని

సంశయంలో పడేసిన మాట నిజం. ఆ ప్రసారం జరిగిన తేదీనాడు తెలుగు రాష్ట్రాన్ని పాలిస్తున్న చంద్రబాబు ఒక ముఖ్య కార్యక్రమంలో ఉండగా హైద్రాబాదు నుంచి ప్రసారం ప్రారంభమైంది.

నాడు ఆంధ్రా పట్ల వ్యతిరేకతతో అవతరించిన తెలంగాణా రాష్ట్రం కావటం మూలానా, చంద్రబాబుకు వ్యతిరేకంగా తీవ్రమైన వ్యాఖ్యలు కే సి ఆర్ తరుచూ చేస్తుండటంవలన అందరి దృష్టిలో చంద్రబాబే చేయరాని నేరం చేసినట్లయింది. అందుకు ఆయన పై ఏ సీ బి తో కేసు లు పెట్టించాలని చాలా పెద్ద ఉద్యమమే జరిగింది. ఆశ్చర్యమేమంటే టి డి పి ఎం ఎల్ ఏ లను ఫార్మ్ హౌసులో కొనుగోలు చేసి, గులాబీ కండువా కప్పి, వారిలో కొందరిని మంత్రులు చేయటం వంటి కే సీ ఆర్ రాజ్యాంగ వ్యతిరేక చర్యలు అనైతికమని ఎవ్వరూ వాదించలేదు. అంటే హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రం మీద, చంద్రబాబుకు వ్యతిరేకంగా ఒక వర్గం కూడ కట్టటం ప్రారంభించిన కే సీ ఆర్ ఆ పరంపర ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇటీవల సమయం సందర్భం లేకుండా చంద్రబాబును ఇష్టం వచ్చినట్టు మళ్ళీ మాట్టాడటం చూస్తే కే సీ ఆర్ ఫ్యూడల్ భావజాలంలోనే ఇంకా మునిగి తేలుతున్నాడనిపిస్తుంది.

అయితే, నాడు అరెస్టయిన రేవంత్ ఎదో ఒకనాడు తానూ ముఖ్యమంత్రై 'దెబ్బకు దెబ్బ'తీసి తీరుతానని జైలు బయట బహిరంగంగానే ప్రతిజ్ఞ చేశాడు. చివరికి భగవంతుడు ఆ అవకాశం ఇదే జీవితంలో ఇవ్వటం, రేవంత్ ముఖ్యమంత్రై తన ప్రతిన నిలబెట్టుకునే సమయం రావటం, కే సీ ఆర్ టీ.వి. ఛానెల్స్ ముందు అనాగరికమైన భాషలో రేవంత్ పై విషం గక్కటం ఆయన పతనావస్థను చెప్పకనే చెబుతోంది. నాడు, రేవంత్ అరెస్ట్ అవడానికి కీలకమైన టెలిఫోన్ టాపింగ్ ఎవరు

చేశారో వాళ్ళు ఇప్పుడు పట్టుబడ్డారు. వారిపై పోలీస్ సిట్ పరిశోధనా టీం విచారణ జరుపుతోంది. టూకీగా అనేక విషయాలు బయటికి రావటం చూస్తే, అన్ని వేళ్ళు కే సీ ఆర్ వైపే చూపిస్తున్నాయి. నిజానికి నాడు చంద్రబాబు ఇదే మాటన్నాడు. 'ముఖ్యమంత్రిగా తన సంభాషణలను ఎవరో టాప్ చేసారు. అలా టాప్ చేసేందుకు ముందు వారు కేంద్రం నుంచీ అనుమతి తీసుకోలేదు. అందువల్ల అది నేరం. ఆ నేరం కింద కే సీ ఆర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలి ' అని. ఆలస్యం అయినా 2023 నాటికి తెలంగాణా ప్రజలే కే సీ ఆర్ ను డిస్మిస్ చేసారు.

ఇక 2023 ఎన్నికల్లో ఓటమి తరువాత టీ ఆర్ ఎస్ (బి ఆర్ ఎస్) నాయకులకు మెదడులో గుజ్జు చితికిపోయినట్టైంది. ఒకరు రేవంత్ ప్రభుత్వాన్ని కూలదోస్తామని, మరొకరైతే మరో అడుగు ముందుకేసి ఆరునెలల్లో మళ్ళీ కే సీ ఆర్ ఏ ముఖ్యమంత్రి అవుతారని సంధి ప్రేలాపనలు మొదలు పెట్టారు. రేవంత్ ను పాలనా పరంగా ఇరుకున పెట్టటానికి బి ఆర్ ఎస్ వాళ్ళు చేయని ప్రయత్నం లేదు. ఇచ్చిన హామీలన్నీ నెల రోజుల్లోనే అమలు చేయాలని, రైతుబంధును 'అధికారంలోకి వచ్చిన రోజునే అమలుచేస్తానని రేవంత్ అన్నాడు కాబట్టి వెంటనే నిధులను విడుదల చేసి రైతుల అకౌంట్లలో వేయాలని', ఇలా గంట కొక, రోజుకొక దాడి ఆయనపై, ఆయన ప్రభుత్వంపై. ఇలా కే టీ ఆర్ , హరీష్ రావు చెలరేగిపోవటం వెనుక ఒక పెద్ద వ్యూహమే వుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందునుంచి ప్రతిపక్ష నాయకుడిగా కాళేశ్వరం ప్రాజెక్ట్ అంతా అవినీతిమయం అని, తమ ప్రభుత్వం వస్తే దానిపై సమగ్ర విచారణ జరిపిస్తామని చెప్పేవాడు.

సరిగ్గా అదే పని చేసాడు. కుంగిపోయిన మేడిగడ్డ బేరేజి వద్దకు ఎం ఎల్ ఏ లను తీసుకెళ్లటం ద్వారా, జాతీయ సంస్థలను డాం పరిరక్షణ సంస్థలతో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని శోధించటం మొదలైనవి ఆరంభించాడు. అంతే గాక ఒక సుప్రీమ్ కోర్టు న్యాయ మూర్తి ద్వారా నెల రోజుల్లో విచారణ జరిపించి కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బాధ్యులను నిర్ధారించటానికి శ్రీకారం చుట్టాడు. రేవంత్ రెడ్డి ఈ జోరుకు కళ్లెం వేయడం కే టీ ఆర్ , హరీష్ ల వల్లకాలేదు. దీనితో కే సీ ఆర్ యే నేరుగా రంగప్రవేశం చేసి పొలాలు ఎండిపోతున్నాయని గగ్గోలు పెట్టె యాత్రలు ఆరంభించాడు. అందులో భాగంగానే తాజా రౌండ్ తిట్లు , శాపనార్థాలు రేవంత్ పైన, చంద్రబాబు పైనా ప్రయోగించాడు.

నిజానికి చంద్రబాబును తిట్టడంలో ఆంతర్యం ఏమిటి? అని విశ్లేషిస్తే రేవంత్ చంద్రబాబు ప్రియ శిష్యుడే గాదు, ఆయన రేవంత్ ను కష్టకాలంలో ధైర్యం చెప్పి ఆదుకున్న వాడు. ఇలాంటి సంబంధమే చంద్రబాబు , కే సీ ఆర్ ల మధ్యనున్నది. అయితే రేవంత్ విశ్వాసం ఉన్నవాడు, కే సీ ఆర్ అదేమిటో తెలియని వాడు. చంద్రబాబులా రాజకీయాల్లో ఎలా మనగలగాలో నేర్చిన వ్యక్తి కాబట్టే ఒకే జీవిత కాలంలో ముఖ్యమంత్రి అవుతానని సవాలు విసిరి ముఖ్య మంత్రి అయ్యాడు. ఇలా చంద్రబాబుకు, రేవంత్ కు కాల గమనంలో ఉన్న సంబంధాన్ని మనస్సులో పెట్టుకొని, కడుపు మంటతో తిట్టిన తిట్లు అవి. ఇవి అర్ధంగాని ప్రజలు ఎవ్వరూ తెలంగాణలో లేరు ఈనాడు. అంతే గాదు, గతంలో లాగా ప్రజలు ఈ సారి కే సీ ఆర్ తిట్లను హర్షించలేదు. ఎందుకంటే 10ఏళ్ళు పాలించిన ఒక ముఖ్యమంత్రి, కొత్తగా అధికారం చేపట్టిన ముఖ్యమంత్రిని ఆరు నెలలు కూడా తిరగ కుండానే 'రండలు', 'ముండలు' అంటూ తన

స్థాయి మరచి ఎవరి మెప్పు కోసం తిడుతున్నాడని ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక మాజీ ముఖ్యమంత్రి , అందునా కొన్ని నిర్దుష్ట నేరారోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రికి తగనిదన్నది ప్రజల భావన .

కే సీ ఆర్ ఇలా గంగ వెర్రులెత్తిపోవటం వెనుక మరో విషయం ప్రజలు గమనిస్తున్నారు . ఏమిటంటే కే సీ ఆర్ ఏకైక ముద్దుల కూతురు కవితమ్మ ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఊచలు లెక్క పెడుతున్నారు. ఆమె తాను అమాయకురాలను అంటుంది. కానీ జిల్లాస్థాయి రౌస్ కోర్టు, హైకోర్టు నిర్దిష్టమైన ఆరోపణలు, వాటికి ప్రాధమిక ఆధారాలున్నాయని అంటూ బెయిల్ నిరాకరిస్తున్నాయి. ఇదంతా మోడీ మాయగా విశ్వసిద్దాం కాసేపు. మరి స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఏ ఆధారం లేకపోయినా చంద్రబాబును జగన్ అరెస్ట్ చేస్తే కే సి ఆర్, కే టీ ఆర్ లు ఎంత మాత్రం ఖండించ లేకపోయారు. అందుకేనేమో కవిత అరెస్ట్ విషయంలో కే సి ఆర్, కే టీ ఆర్ లు ఇవాళ ఏవిధమైన రాజకీయ సానుభూతి పొందలేకపోయారు తెలుగు రాష్ట్రాలనుంచి. చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఉవ్వెత్తున జనం రోడ్ల పైకి వచ్చారు, తెలంగాణా, ఆంధ్రాలలో. కానీ , ఇవ్వాళ కవితకు, కే సీ ఆర్ కు తెలంగాణాలో ఆ సానుభూతి కరువైంది. ఇదే సమయంలో బీ ఆర్ ఎస్ నుంచీ వరుసగా వలసల పర్వం ఆరంభం కావటం, తన నాయకత్వానికి మొన్నటిదాకా జైకొట్టిన కేశవ రావు, కడియం శ్రీ హరి వంటి రాజకీయ యోధులు కాంగ్రెస్ కండువా కప్పుకోవటం, అనేక మునిసిపల్ కౌన్సిల్స్ లో బీ ఆర్ ఎస్ చైర్మన్లు దిగిపోయి, కాంగ్రెస్ వాళ్లు చైర్మన్లు అవటం,సాక్షాత్తు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లోని బీ ఆర్ ఎస్ కౌన్సిల్లర్లు కాంగ్రెస్ లోకి ఫిరాయించటం కే సీ ఆర్ కు మింగుడు పడని విషయాలు.

అంతే గాదు , సరిగ్గా పార్లమెంట్ ఎన్నికలు జరగబోయే ముందు ఇలాంటి తీవ్ర ఓదు దుదుకులు పార్టీకి ఎదురుకావడం, ఆఖరికి ఎలేక్షన్లలో నిలబడేందుకు సొంత క్యాడర్ నుంచి అభ్యర్థులు లేకపోవటం వంటివి బీ ఆర్ ఎస్ ఏటికి ఎదురు ఈదుతున్న సంగతి ప్రజలకు సుస్పష్టం అవుతున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల తరువాత బీ ఆర్ ఎస్ పతనం అంచున మిగుల్తుందేమోనని అందరికీ సందేహంగా ఉంది. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా, ఏక వ్యక్తి వ్యవస్థలుగా ప్రవర్తిల్లితే ఎదో ఒక నాడు ఈ పరిస్థితి దాపురిస్తుందని నియంతలైన నాయకులు గుర్తెరగాలి. ముఖ్యంగా కే సీ ఆర్, కే టీ ఆర్ లాంటి వ్యక్తులు తమ ఫ్యూడల్ భావాలు, హోవ భావాలు వదిలించుకొని ప్రజాస్వామ్య బద్ధంగా మెలగటం నేర్చుకోవాలి.

(అక్షరాంజలి మాసపత్రిక జూన్, 2024)

మోడీతో వీజీ కాదు... వీజీ కాదు ... చంద్రబాబు జాగ్రత్త !

పరిస్థితులు మనుషుల్నే కాదు , రాజకీయ పార్టీలను , నాయకులను గుడా సుడిగుండంలోకి నెడతాయని ఇప్పుడు ఆంధ్రాలో జరుగుతున్న పరిస్థితులను బట్టి అర్ధం అవుతుంది. కాకపొతే ఏమిటీ? 2019లో చంద్రబాబు ఓడిపోవటానికి తెలుగు ప్రజల వివేకసూన్యత్వం (ఒక నేరస్తుడిని ముఖ్యమంత్రిగా ఎన్నుకొంటే తప్పులేదని భావించటం), అత్యాశ (నవరత్నాలు ద్వారా అప్పణంగా ప్రజాధనం పొందాలన్న కాంక్ష) ప్రత్యక్షంగా కారణమయితే, మోడీ పరోక్షంగా అంతే కారణం. ఆంధ్రాను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లాలన్న చంద్రబాబు లక్ష్యం, మోడీకి పడదు. 2014-2019 మధ్య కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాన్ని ఒక స్థాయికి తేవాలని చంద్రబాబు పడ్డ ఆరాటం తెలుగు ప్రజలకన్నా మోడీకే బాగా తెలుసు. చంద్రబాబు అడిగినది అడిగినట్లు ఇస్తే ఐదేళ్లలో కొత్త ఆంధ్రరాష్ట్రం గుజరాత్ ను మించి పోతుంది. అది మోడీకి నచ్చని విషయం. మరోటి గుజరాత్ , మహారాష్ట్రాలకు చెందిన ఫలానా ప్రారిశ్రామిక వేత్తలకు ఆంధ్రరాష్ట్రం దోపిడి అయ్యేలా కట్టబెట్టమని చంద్రబాబును మోడీ అడగలేడు. అలా అడిగి చంద్రబాబు దృష్టిలో చిన్నవాడు కాలేడు. తను బయటికి కనిపించే రీతికి భంగం కలగకుండా, తన అంతరంగ అవినీతికి పట్టంగట్టే నాయకుడు చంద్రబాబు కాదని మోడీకి సులువుగానే అర్ధమయింది. పైగా చంద్రబాబు తనకంటే రాజకీయంగా సీనియర్. అత్యంత చిన్నవయసులో తెలుగు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తొలి భారతీయుడు.

అలాని చంద్రబాబులా అవినీతికి దూరంగానూ మోడీ ఉండలేడు. ఎందుకంటే అది మోడీ స్వభావం కూడా కాదు. మోడీ పైకి

అవినీతికి వ్యతిరేకం అంటాడు, అంతరంగంలో దానికే పెద్ద పీట వేస్తాడు. కేవలం కాంగ్రెసును దెబ్బతీయటానికి వాడుకొనే ఆయుధంగానే మోడీ 'అవినీతి వ్యతిరేక నాటకం' సాగింది, సాగుతోంది ఆశాంతం. ఈ విషయం బీజేపీ లో అందరికీ తెలుసు. కానీ, పైకి ఎవ్వరూ తెలిసినట్లుండరు. అదొక నాటకం. ఒక్కముక్కలో చెప్పాలంటే బీజేపీ ఒక 'విన్యూత్న నాటక సమాజం'. 'అరవింద సమేత వీర రాఘవ రెడ్డి' సినిమాలో అరవింద (పూజా హేగ్ డే) తో ఒక మాట పలికిస్తాడు త్రిపురనేని శ్రీనివాస్. 'మనిషి పైకి ఏమిచేబుతాడో లోపల తనదికాదు' అని. ఈ మాట అందరికీ వర్తిస్తుందో లేదో తెలియదు గానీ మోడీకి, మోడీ నాయకత్వంలోని నేటి బీజేపీకి సరిగ్గా వర్తిస్తుంది. మోడీని అర్థం చేసుకోవటం ఏమంత కష్టం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే మోడీ మనస్తత్వం చంద్రబాబుకు దూరం, జగన్ కు దగ్గర.

మోడీ 'మాగ్నానిమిటి' (ఔన్నత్యం), 'సిన్సియారిటీ' (రుజుత్వం) ఉన్న వ్యక్తి ఏమీ కాదు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ఆయన దేశవ్యాప్తంగా చేస్తున్న ఉపన్యాసాలు, తన హెూదాకన్నా కిందకు దిగజారిన మాటలూ వింటుంటే గతంలో ఏ ప్రధాని, ఆఖరుకు 'దుర్గ' , 'కాళీ మాత' వంటి మాటలు బిరుదులుగా పొందిన ఇందిరా గాంధీకూడా ఇంత దిగ జారి ఏనాడు మాట్లాడలేదు. అటు మోడీ, ఇటు జగన్ మాటలు వింటుంటే ఇది ప్రజాస్వామ్యం నిలబెట్టే ఎన్నికల్లా కనిపించటంలేదు. 'మేము నియంతలమే, రాజ్యాంగం తో పని లేదు, మా మాటే శాసనం చేయండి ' అని ప్రజలను ఈ ఎన్నికల్లో అడుగుతున్నట్టు ఉంది.

ఈ మాటలు ఎందుకు అనాల్సివస్తుందంటే మనం ఇక్కడ 2019 ఎలెక్షన్ నాటి పరిణామాలను కొంచెం జ్ఞప్తి చేసుకోవాలి. ఏ కారణంగా, ఎవరికి మేలు చేద్దామని మోడీ 2019నాటి ఎలెక్షన్స్ ముందు డీ జీ పి ని, చీఫ్ సెక్రటరీని, కడప సూపరింటెండెంట్ను మార్చారు? ఈ మాటంటే బీజేపీ వారు ఆవేశంతో ఊగిపోతారు. 'ఎలక్షన్ కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించే సంస్థ. అది మోడీ చెబితే వినే సంస్థ గాదు. అప్పటి ఎలక్షన్ కమిషన్ ఏది సరైనదని భావించిందో అలా చేసిందన్న' వాదన వినిపిస్తారు. మోడీ పాలనలో ఆంధ్రాపట్ల ఎప్పటికప్పుడు మారే వ్యూహాలు ప్రజలకు తేటతెల్లంగా తెలుస్తున్నా, మోడీ వందిమాగధులు మాత్రం రాజ్యాంగ ప్రకారమే అదంతా జరుగుతుందని, అనవసరంగా మోడీకి, బీజేపీకి ఉద్దేశాలు ఆపాదిస్తున్నారనీ వాదిస్తుంటారు. ప్రస్తుతం 2024 ఎలక్షన్స్ జరుగుతున్న తరుణంలో ఆంధ్ర రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డి జి పి లు పక్ష పాత పూరితంగా వ్యవహరిస్తున్నారని, ఆఖరుకు చీఫ్ సెక్రటరీ వై ఎస్ ఆర్ సి పి పార్టీ మీటింగులకు హాజరై ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిసీ, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ మీనా కేంద్రానికి రాసినా, కేంద్ర ఎలక్షన్ కమిషన్ ఇప్పటికీ పట్టించుకోలేదంటే మోడీకి నిష్పక్ష పాత ఎన్నికలపై ఎంత విశ్వాసం ఉన్నదీ , జగన్తో ఎంత అవినాభావ సంబంధం ఉందని ఇట్టే పసిగట్టేయ వచ్చు. మోడీ జగన్ అనుకూల, అవినీతి అనుకూల వైఖరికి ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు .

ఉదాహరణగా ఒక్కటి చాలు. మోడీ వ్యవహార శైలి 2014-2019 మధ్య కాలంలో చంద్రబాబు పట్ల ఎలా ఉండింది, 2019-2024 మధ్య జగన్ పట్ల ఎలా ఉందన్నది ఒక్కటి విశ్లేషిస్తే చాలు. కేంద్రం ఇస్తున్న నిధులకు యుటిలిటీ సర్టిఫికెట్లు సకాలంలో పంపట్లేదని,

లెక్కలేనన్ని పీడీ అకౌంట్లు ఉన్నాయని, వాటి ద్వారా చంద్రబాబు దోపిడీకి, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్రమిచ్చే డబ్బులు దారి మళ్లించారని, అందువల్లే ఏడు జిల్లాల అభివృద్ధి నిధులను వెనక్కి తీసుకున్నామని, చంద్రబాబును అవినీతి పైన , నిధుల మళ్లింపు పైన జైలుకు పంపుతామని అరిచి గగ్గోలు పెట్టిన బీజేపీ గ్రామసింహం జీ వీ ఎల్, తదితరులు, 2019-2024 మధ్య జగన్మోహన్ రెడ్డి కేంద్ర నిధుల మళ్లింపు (పంచాయతీ రాజ్ వార్షిక ప్రణాళిక నిధులు) బాహాటంగా చేసినా , రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసినా, ఆదానీలకు రాష్ట్ర ఆస్తులను, పోర్టులను, విద్యుత్కేంద్రాలను దోచిపెట్టినా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా పల్లెత్తు మాటనే సాహసం చేయలేదు. ఇప్పుడు ప్రజలు చెప్పలేరా ఆనాటి గ్రామసింహాల వెనుకున్నది మోడీనేనని?

నిజానికి రాజ్యాంగ వ్యవస్థలు అధికారపార్టీ కనుసన్నల్లో ప్రవర్తిస్తుండటం అప్పటికే ఆనవాయితీగా మారిపోయిన సమయం అది. దాన్ని మోడీ వాడుకోకుండా దాని పవిత్రతను చెక్కుచెదరకుండా కాపాడాడని విశ్వసించటం ఎలాని ప్రశ్నిస్తే మాత్రం బీజేపీ వారివద్ద సమాధానం లేదు. అంతరంగంలో చెడును ఆస్వాదిస్తూ, అవినీతి అంటే మక్కువ కలిగి, అలాంటి మనస్తత్వం ఉన్నవాళ్లనే ఆదరించే స్వభావం ఉండబట్టే, మోడీ అప్పటికే నేరస్తులైన, ముద్దాయిలుగా కోర్టుకు హాజరవుతున్న జగన్, విజయసాయి రెడ్డిలకు తరుచు అప్పోయింట్మెంట్లు ఇచ్చేవాడు. చివరకు వారిని అధికారంలోకి తెచ్చి, ఆంధ్రాను గుజరాత్‌కు తాకట్టు పెట్టించాలనే జగన్, విజయసాయిల కోరిక మీదనే, కోరిన వెంటనే నాటి పోలీస్ బాస్ డీజీపీని, చీఫ్ సెక్రటరీని, డీజీపీ ఇంటలిజెన్స్ ఏ. బి. వెంకటేశ్వర రావును, కడప ఎస్ పీ ని హడావుడిగా మార్చారు.

ఒక్క మాటలో చెప్పాలంటే నాడు మోడీకి తెలుసును – వివేకహత్య వెనుక ఉన్నది జగన్ అని. కోడికత్తి ఒక డ్రామాని. తెలిసే, ఏ సంబంధం లేని ఎన్ ఐ ఏ కు కోడి కత్తికేసు మోడీ అప్పజెప్పేలా జగన్ ప్రయత్నించాడు. నిజానికి ఎన్ ఐ ఏ విచారించవలసిన కేసుల క్రింద కోడి కత్తి కేసు రాదు. అయినా ఎవ్వరూ హైకోర్టుకు పోలేదు. ఆశ్చర్యంగా లేదు. ఏ విషయం లోతుగా తెలియకుండా, కనుక్కోకుండా కేవలం జగన్ లేక విజయ సాయి చెప్పాడని వారి మాటలకు వంత పాడే అమాయకుడేమి కాదు మోడీ. అందుకే ఇటు సిబిఐ, ఈ డి కేసుల్లోనూ, అటు వివేకా హత్య కేసుల్లోనూ జగన్ కు పూర్తి సహకారం అందించిన కీర్తి, ఘనత మోడీదే. ఆఖరికి సుప్రీమ్ కోర్టు జగన్ కేసుల్లో అన్నివేల వాయిదాలు ఎందుకు పడ్డాయని సిబిఐని ప్రశ్నిస్తే, జవాబు దారి వ్యవస్థయినా సిబిఐ తాము బాధ్యులం కాదని, తమకు కారణాలు తెలియదని బొంక చూసింది. జగన్ కేసుల విచారణ త్వరితగతిన చేబట్టాలని వైసీపీ ఎం పి రఘురామ రాజు పిటిషన్ లో కౌంటర్ వేస్తామని పలుమార్లు సమయం అడిగి, చివరకు కోర్ట్ ఏనిర్ణయం తీసుకొన్నా తమకు అభ్యంతరం లేదని సన్నాయి నొక్కులు నొక్కిన సిబిఐ ఇప్పుడు మాత్రం తమకు జగన్ కేసుల వాయిదా విషయంలో ఏ బాధ్యతా లేదని ఎలా చెప్పింది? అంతా మోడీ మాయ. మోడీ మాయల మరాఠీ కాదు, మాయల గుజరాతీ. సహజ నటుడు – అటు విలన్ గాను, ఇటు హీరోగానూ రెండు పాత్రలను ఏకకాలంలో అద్వితీయంగా పోషిస్తూ, తను మాత్రం 'మిస్టర్ క్లీన్' అని ప్రచారం చేసుకొనే దుస్సాహసి.

ఇదంతా చంద్రబాబుకు, టీడీపీ వారికీ తెలిసి ఒకేసారి ఇద్దరూ నేరస్తులను, నియంతలనూ (జగన్, మోడీలను) ఎదుర్కొనటం ఇష్టం

లేక తనదైన శైలిలో 'నొప్పించక, తానొవ్వక' అన్నట్టు తప్పించుకు తిరుగుతుంటే, చంద్రబాబును హఠాత్తుగా నంద్యాలలో అరెస్టు చేయటంతో ఒక్కసారిగా చంద్రబాబు, టిడిపి పార్టీ పాతాళంలో పడ్డట్టయినారు. చంద్రబాబు బలం, ప్రజా స్పందన ఎలా ఉంటుందో చూడటానికే మోడీ, జగన్ కూడా బలుక్కొనే ఈ తతంగం నడిపించారు. నేడు ఢిల్లీ లో బీజేపీతో సీట్ల సర్దుబాటనంతరం తన అరెస్ట్ వెనుక మోడీ, అమిత్ షా హాస్తంలేదని చంద్రబాబు బయటికి చెప్పినా, అది ఆయన రాబోయే ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకొని, అవి సజావుగా సాగడానికి మోడీ అవసరం జ్ఞప్తిలో ఉంచుకొని వ్యూహాత్మకంగా పలికిన పలుకులే. అవి, చంద్రబాబు మనస్ఫూర్తిగా పలికిన పలుకులని టీడీపీ క్యాడరే గాదు, మేధావి వర్గం గూడ విశ్వసించదు.

ఇందుకు ప్రమాణం (proof/evidence) ఏమిటంటే నాటి (2014-2023 మధ్య) హైకోర్టు, సుప్రీమ్ కోర్టుల పని తీరు. నిజానికి ఇందిరా గాంధీ కాలంలో కన్నా మోడీ కాలంలోనే హైకోర్టులు, సుప్రీమ్ కోర్టులు రాజకీయంగా ఎంతో ప్రభావితం అయినాయంటే అతిశయోక్తి కాదు. జయలలిత కేసు నుంచీ నిన్నమొన్నటి ఏడుగురు జడ్జిల సుప్రీమ్కోర్ట్ జడ్జిమెంట్ వరకూ ఎన్నో కేసుల్లో కేంద్రప్రభుత్వ, బీజేపీ ఐడియాలజీ కోరుకొన్నట్లే జడ్జిమెంట్స్ రావటం అనేకమంది మేధావులను ఆశ్చర్యపరిచింది. చంద్రబాబు అరెస్ట్ సక్రమమా ? అక్రమమా? తేల్చమంటే ఒక్క గంట సేపు వాదనలు విని తేల్చదగ్గ న్యాయమూర్తులు ఉండి కూడా రోజుల తరబడి, వాయిదాలు, వాదోపవాదాలు వినటం దేశం యావత్తును ఆశ్చర్యచకితుల్ని చేసింది. తెర వెనుక ఎవరో న్యాయమూర్తులను త్వరగా ఏ విషయం తేల్చవద్దని, చంద్రబాబు కొంత కాలం జైల్లో ఉండాల్సి

ఉందని చెబుతున్నట్లు తెలుస్తున్నా, ఆ చెబుతున్న దెవరో ఎవ్వరూ చెప్పలేకపోయారు సాహసించి. జగన్ తన పరిచయాల ద్వారా హైకోర్ట్, సుప్రీమ్ కోర్టులను ప్రభావితం చేయ ప్రయత్నించటం అందరూ ఎరిగినదే. తన మాట, తన చట్టాలను ఆదరించక స్టేలు ఇచ్చిన న్యాయ మూర్తులను అనతికాలంలోనే బదిలీ చేయించగల సమర్థుడు జగన్ అని కూడా అందరికీ తెలుసు. అంతెందుకు,జగన్ అవినీతి కేసుల్లో సరిగ్గా తీర్పులు ఇవ్వబోయేముందు, సి బి ఐ, ఈ డి కేసులను విచారిస్తున్న జడ్జిని మారుస్తున్న కేంద్ర అధికార పరిధి ఎవరి కింద ఉందో కూడా ప్రజలకు తెలుసు, మోడీకి తెలుసు. పైకి చంద్రబాబు గ్రూప్తో బీజేపీ ఉన్నట్టు కనిపించినా జగన్తో మోడీ, అమిత్ షాకున్న లెక్కలు (ఆంధ్రాని ఎదగనీయకుండా చేయటం, గుజరాతీ , మరాఠీ పెద్దలకు ఆంధ్రా వనరులను దోచి పెట్టి రాష్ట్రాన్ని నాశనం చేయటం) వేరు. కానీ, మోడీ అవినీతి ప్రోత్సహించే కేటగిరీ నాయకుడని, అదెలా చేస్తాడో బయటపడింది తొలిసారి ఎలెక్టోరల్ బాండ్ల విషయంలోనే.

ఎలెక్టోరల్ బాండ్ల వివరాలు బయట పెట్టవలసిందే అనే ఒక్క జడ్జిమెంట్ మోడీకి, బీజేపీకి వ్యతిరేకంగా వచ్చేప్పటికి, ఒక్కసారిగా సుప్రీమ్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరువురు, (రెండు సంఘాలకు చెందినవారు) రంగంలోకి దిగి రాష్ట్రపతి జోక్యం కోరటంతో ఇంతకాలం సుప్రీమ్ కోర్టులలో, హైకోర్టులల్లో జడ్జిలను ప్రభావితం చేసే ఆ తెర వెనుక లాబీస్థులు బయట పడ్డారు. ఇప్పటికీ అసోచాం, చాంబర్స్ ఫెడరేషన్ వంటివి సుప్రీంకోర్టులో అడ్డుపడే ప్రయత్నం చేస్తుంటే, మరోవైపు వాటి పూర్తి వివరాలు బయట పెట్టకుండా కాలం సాగతీస్తున్నది ఎస్బిఐ. ఇదంతా మోడీ అవినీతి కప్పి పుచ్చడానికే కదా ? ఇన్ని విషయాలు తెలిసి చంద్రబాబు

మోడీతో పొత్తు కోసం ఆరాటపడటం ఆయన కోరుకొన్న ఫలితం ఇస్తుందా, లేక మరోసారి చంద్రబాబును చిక్కుల్లోకి నెడుతుందా అన్న ప్రశ్న ఇవ్వాళ చాలామంది మనసు తొలిచేస్తున్నది.

ఒక రకంగా జైలులో ఉన్నా కూడా చంద్రబాబు భయపడలేదు. ఆయన రక్షణ విషయంలోనూ, వైద్యంలోను లోపం జరుగుతున్నా ఆయన విజయవాడ ఏసీబీ కోర్ట్ జడ్జి దృష్టికి తెచ్చారే తప్ప మరే ప్రయత్నం చేయలేదు. అదే సమయంలో ఆయన లాయర్ల ప్రయత్నాలను జడ్జిలు వమ్ము చేసినా ఆయన చెలించలేదు. అయితే హఠాత్తుగా జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ జైలుకు వచ్చి, ఆయనకు తన మద్దత్తు ఏకపక్షంగా ప్రకటించడం చంద్రబాబు సహృదయంతో స్వీకరించినా, తెలుగు దేశం పార్టీశ్రేణులు పవన్ కళ్యాణ్ ప్రకటన ఎవరికోసమనే గందరగోళంలో పడ్డాయి. పవన్ తన రాజకీయ భవిష్యత్తుకు, చంద్రబాబుపై ప్రజల్లో వెల్లుబికిన ఆదరణను పెట్టుబడిగా వాడుకొందామని అలా ప్రకటించాడని సందేహించిన వారూ లేకపోలేదు. నిజానికి చంద్రబాబు అరెస్టు అనంతరం ఆంధ్రాలో ఎవరి మద్దత్తు లేకపోయినా టీడీపీ తనంతట తానే గెలిచే స్థితికి చేరింది. అయినా ప్రతిపక్ష ఓటు చీలి పోకూడదనే పవన్ కళ్యాణ్ వాదనను కూడా చంద్రబాబు పరిగణించటంతో రాజకీయాల్లో అనివార్య మార్పులు చోటు చేసుకోసాగాయి. ఆ మార్పులలో భాగమే బీజేపీని కలుపుకు పోవాలనే జనసేనాని పవన్ కళ్యాణ్ లక్ష్యం. అలా కలవక పోతే జగన్ దుర్మార్గం తట్టుకోవటం కష్టం అనే భావనలో ఉన్న పవన్ కళ్యాణ్ టీడీపీని ఆ ఉచ్చులోకి లాగాడు. ఫలితంగా టీడీపీ తన బలంతో తాను గెలవటం నుంచీ భాగస్వాములుగా మారిన జనసేన, బీజేపీని గూడా గెలిపించే బాధ్యత పైనేసుకోంది. ఇది ఇక్కడ స్థానిక బీజేపీలోని

ఒక వర్గముకు స్తుతాము ఇష్టం లేదు. ఆంధ్రాలోని ఒక వర్గం కాపులకు, కమ్మలకు, బ్రాహ్మనులకు టీడీపీ అన్నా, చంద్రబాబన్నా పాము, ముంగీస కున్న వైరం ఉంది. అది జనసేన, బీజేపీ పార్టీలలో ప్రస్ఫూటంగా కనిపిస్తుంది.

పోనీ, ఇంత త్యాగం చేసినా టీడీపీకి మోడీనుంచి, బీజేపీనుంచి సంపూర్ణ సహకారం రేపు అందుతుందాన్న సందేహం లేకపోలేదు. నిజంగా బీజేపీ ఓట్లు రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు, టీడీపీకి బదిలీ అవుతాయా అన్న సందేహం టీడీపీ శ్రేణులను పీడిస్తోంది. మాహాయితే బీజేపీకి సీట్లు కేటాయించిన చోటు మినహాయించి మిగతా చోట్ల బీజేపీ ఓట్లు వైస్సార్ పార్టీకి వెళ్లే అవకాశం లేకపోలేదు. అలాగే పవన్ సి ఎం కావాలని కోరుకొనే కాపు వర్గం వారు జనసేన పోటీచేసిన చోట మినహా ఇతర చోట్ల టిడిపికి అనుకూలంగా ఓటు వేయక పోవచ్చు. ఇలాంటి పరిణామాల పైనే వైఎస్సార్ పార్టీ గెలుపు ఆశలను పెట్టుకున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీకి పది అసెంబ్లీ సీట్లు, ఆరు ఎం పీ సీట్లు ఇచ్చి గెలిపించినా, అధికారంలోకి వచ్చాక గతంలోలా మోడీ మొండి చేయి చూపించడని గ్యారంటీ లేదు. నిజానికి బీజేపీ ఉత్తరాదిన ఏకపక్షంగా 370 సీట్లు గెలిచే అవకాశమే లేదు. ఇండియా (INDIA) కూటమి గాను, ఆయా రాష్ట్రాలలో గట్టి పోటీనే ఇవ్వగలదు. పెరిగిన ధరలు, నిరుద్యోగం, ఆదాని దోపిడీ, కరోనా సమయంలో హఠాత్తుగా కర్ఫ్యూ లా లాక్ డౌన్ పెట్టి, వేల కిలోమీటర్లు కూలీలను నడిపించిన మోడీ పట్ల ఉత్తరాది ప్రజల్లో అంత సానుభూతి లేదు. పుచ్చిపోయిన కందులు, ముక్కిపోయిన బియ్యం సరఫరా చేసిన ఘనుడు మోడీ. రైళ్ల టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచి సామాన్యులకు రైలు ప్రయాణం అంటే చుక్కలు చూపించిన మహానుభావుడు మోడీ. ఏ వర్గం వారికీ రైల్ కన్సెషన్స్ లేకుండా చేసిన వ్యక్తి.

అందరూ మోడీని బలమైన నాయకుడు అని ప్రచారం చేస్తారు. కానీ, ఏ బలం లేని పీవీ నరసింహ రావు, ఐ కే గుజ్రాల్, వీ పీ సింగ్, దేవెగౌడ లాంటి వారు కూడా భారత దేశాన్ని పాలించారు. వారి పాలనలో పాక్, చైనా లేవీ భారత్ ను ఆక్రమించుకోలేదన్న విషయం గ్రహించాలి. రాహుల్ గాంధీ బీజేపీ వాళ్ళ ప్రచారం లాగా అంత బలహీనమైన నాయకుడేమి కాదన్న భావన ఉత్తరాది ప్రజల్లో లేకపోలేదు. ఈ కారణంగా దక్షిణాది సీట్లు బీజేపీకి అవసరం. అయినా బీజేపీ, జనసేన, టీడీపీతో సీట్ల సర్దుబాటు సరిగ్గా తెమల్చకుండా, అంటి అంటనట్టు కాలక్షేపం చేయటం అందరూ గమనిస్తున్నదే. మొన్న ప్రజాగళంలో జగన్ పై ఈగ వాలకుండా పడికట్టు వ్యతిరేకపదాలతో ఉపన్యసించిన మోడీ, రేపు ఎన్నికలయ్యాక జగన్ని తిరిగి చేరతీసి, చంద్రబాబుకు చుక్కలు చూపించడని ఎలా విశ్వసించటం? ఈ ఎన్నికల తరువాత ఆంధ్రాభివృద్ధికి చంద్రబాబు వేసే బాటలకు మద్దత్తు తెలపటం ఒకటే కాదు. జగన్ చేసిన నేరాలకు, ఘోరాలకు ఆయనకు, ఆయన వందిమాగధులకు శిక్షలు పడేలా సీబీఐ కోర్టులను పనిచేయించ గలగాలి. అలా జరిగితే మంచిదే, లేక జనసేనానిని అడ్డు పెట్టుకొని టీడీపీని చీల్చి, చంద్రబాబును పదవినుంచి తప్పించే వికృత క్రీడకు శ్రీకారం చుడితే బాబు ప్రస్తుతం పడుతున్న శ్రమ బూడిదలోపోసిన పన్నీరు కాక తప్పదు. తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నిద్రలేని రోజులు గడిపేలా ఉండవచ్చు. ఏది ఏమైనా మోడీతో వీజీ కాదు ... వీజీ కాదు ... బాబూ జాగ్రత్త !

(అక్షరాంజలి మాసపత్రిక జులై, 2024)

ఆంధ్రాకొచ్చిన మరో రకం నూతన దీపావళి !
నూతన ప్రభుత్వానికి హార్దిక స్వాగతం!

ఎన్నికలంటే ఎన్నికలు కావవి. ఎంతో పదిలంగా నేర్పుతో, ఓర్పుతో, నిగూఢంగా తమ మనోగతాన్ని పొదిగిన ప్రజా తీర్పది. ఎవ్వరికీ అంతుచిక్కని రీతిలో, ఒక రాజకీయ పక్షాన్ని చీపురుతో చిమ్మి, చేటలోకెత్తి చెత్త కుప్పలోకి విసిరేసిన రోజది. మీరు రాజకీయాలకు పనికి రారని, మరెప్పుడు రావద్దని ముఖమ్మీద గుద్ది తీర్పు చెప్పిన రోజది. జూన్ 4, 2024న సాయంత్రం కల్లా ప్రజా తీర్పు రాష్ట్రం మొత్తానికి అర్థమయిన రోజది. భలే మంచి రోజది. పసందైన రోజది. రాజకీయ పలుకుబడి లేని దళితులూ, అగ్రవర్ణాలు, మధ్య, దిగువ తరగతి ప్రజలు, తాడితులు, పీడితులూ అయిదేళ్ల పాటు తమను పట్టి పాలార్చిన రాక్షస పాలకులకు శాశ్వత 'సెలవు' ఇచ్చిన రోజది. ఆ రాత్రికి రాష్ట్రమంతా ఏకాత్మ భావంతో దీపాలు వెలిగించి, టపాసులు పేల్చిన రోజది. ఆకాశం వర్ణమయమై నూతన ప్రభుత్వానికి హార్దిక స్వాగతం పలికిన రోజది.

జూన్ 4ననే నూతన ప్రభుత్వాధిపతిగా చంద్రబాబు నాయుడు రాగల ఐదేళ్లు రాష్ట్రాన్ని ముందుకు నడపగలరన్న విశ్వాసానికి ప్రజలు వచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నూతన ప్రభుత్వం జూన్ 9న పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నందున చంద్రబాబు నాయుడు గారు తన పదవీ ప్రమాణ స్వీకారాన్ని జూన్ 12కు మార్చారు. ఎందుకంటే ఇప్పుడు నూతనంగా ఏర్పడిన మోడీ ప్రభుత్వానికి చంద్రబాబే పెద్ద దిక్కు. ఆయన తెలుగు దేశం పార్టీ నుంచి 16 మంది పార్లమెంట్ సభ్యులు మోడీ ప్రభుత్వానికి మద్దత్తు పలుకకపోతే మోడీ ప్రభుత్వమే ఉండదు. అది నేటి మోడీ పరిస్థితి. ఈ నేపథ్యంలో బాబు గారు జూన్ 12న రాష్ట్ర మూడవ

ముఖ్య మంత్రి గా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో మరో 24 మంది మంత్రులు గా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. బాబు గారి కూర్పు పాత, కొత్తల కలబోతగా ఉందని అందరూ అనుకొన్నా కొత్తవారు దాదాపు 17 ముందున్నారు ఈ సారి మంత్రి వర్గంలో. పాతవారిలో అత్యంత సీనియర్లుగా పేరుబడ్డ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అయ్యన్న పాత్రుడు, ధూళిపాళ నరేంద్ర, గంటా శ్రీనివాస రావు, చింతమనేని ప్రభాకర్ లాంటివారు చాలా మన్దున్నారు. ఇంతమంది సీనియర్లకియ్యక పోతే ఎదో ఉపద్రవం వస్తుందని భావించిన రాజకీయ విశ్లేషకులకు నిరాశే మిగిలింది. 'ఒకప్పుడు ఎన్ టీ ఆర్ మంత్రి వర్గంలో చేరినప్పుడు తాము గూడా రాజకీయాలకు కొత్తైన యువతరమే కాబట్టి ఇవ్వాళ బాబు మంత్రి వర్గంలో నూతనంగా 17 మంది మంత్రులుండటం సబబేనని' వైవాఖ్యానించారు అయ్యన్న పాత్రుడు. అంతటి తో సీనియర్ల చప్పుడు ఏమీ లేదని ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు.

అంతేగాదు, నూతన మంత్రి వర్గంలో అన్ని ప్రాంతాలకు, అన్ని కులాలకు కోటా పద్ధతిలో అవకాశం లభించటం అందరి ప్రశంసలు కూడా అందుకొంది. ఒక మంత్రి పదవి ఖాళీ ఇంకా ఉంది. దీనిని ఎవరితో భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టత లేదు. ఇరవై నాలుగు మంది మంత్రులలో ముగ్గురు పవన్ కళ్యాణ్ గారు అధినేతగా ఉన్న జనసేన పార్టీ నుంచి, కూటమిలో భాగస్వాములైన బీజేపీ నుంచీ ఒకరికి ఒక మంత్రి పదవి ఇచ్చారు. వీలైనంత వరకు కొత్త మంత్రులుగా నియమితులైన వారితో మాట్లాడి వారి అభీష్టం మేరకే మంత్రి పదవులు, శాఖలు కేటాయించారని చంద్రబాబు గారు స్వయంగా చెప్పటం అనేక వివాదాలకు తెరపడేట్లు చేసింది. అంతే గాక మంత్రిపదవులు రాని పార్టీ సీనియర్లను

పిలిచి వారికి ఏ కారణంగా మంత్రి పదవి ఇవ్వలేకపోయింది వివరంగా చంద్రబాబు చెప్పటంతో నూతన ప్రభుత్వం బాలారిష్టాలు అధిగమించినట్టయింది. నిజానికి ఓడిపోయిన వై ఎస్ ఆర్ సి పి శకునపక్షిలా తామేంచేస్తే ప్రజలింతగా 'ఛీ' కొట్టారని విశ్లేషించుకోకుండా కూటమిలో విభేదాలు, తెలుగుదేశం పార్టీలో అంతర్గత కల్లోల్లాలేమైనా వస్తాయేమోనని చాలా అసలు పెట్టుకొన్నారు. వాటికి వేటికీ అవకాశం ఇవ్వకుండా చంద్రబాబు తన మంత్రి వర్గం ఏర్పాటు, తన పార్టీ క్రమశిక్షణకు ఏలోటూ లేకుండా చేయటం వైసీపీ ఆశలను అడియాశలు చేసింది.

ఇదిలా ఉండగా వైసీపీ మరో వ్యూహానికి ఎత్తుగడేసింది. అదేమిటంటే ప్రజలంతా వైసీపీకె ఓటు వేస్తే ఎక్కడో దూరప్రాంతం నించి ఈవీఎం లను చంద్రబాబు , లోకేష్ ల మనుషులు హాక్ చేశారని సోషల్ మీడియా ద్వారా, యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా ప్రచారం చేయించే ప్రయత్నం చేసింది. ఎలక్షన్ అభ్యర్థుల పేర్లు, బాలట్ ఈవీఎం లలో నిక్షిప్తం చేయటంనుంచి వోటింగ్ ప్రకియ పూర్తయి, కౌంటింగ్ జరిగి తుది ఫలితం ప్రకటించేవరకు ఒక్కో ఈవీఎం కు 14-16 ప్రొటొకాల్స్ ఉంటాయి. ఈ ప్రొటొకాల్స్ కూడా అంచెలంచెలుగా ఉంటాయి. వీటిలో అనేక మంది సంతకాలు, సీల్స్ ఉంటాయి. అవి వేరు వేరుగా ఉండి రహస్యంగా ఉంటాయి. అలా 175 నియోజక వర్గాలకు 175× 16 ప్రొటొకాల్స్ను ఒక్కో నియోజకవర్గంలోని ఈవీఎం ల సంఖ్య × 16 ప్రొటొకాల్స్ను ఛేదించి (హాక్చేసి) తమకు అవసరమైన వ్యక్తికే ఓట్లు అన్నీ వచ్చేలా చేయటం ఎన్ని వందలమందిని నియోగించినా అయ్యే పని కాదు. పైగా ఇటీవలే ఈ విషయమై సుప్రీమ్ కోర్టులో ప్రశాంత్

భూషణ్ వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కూలంకుష చర్చ జరిగింది. అందరి వాదనలు విని ఈవీఎంలపై టెక్నికల్ నిపుణుల అభిప్రాయాలు తెలుసుకొని, సమగ్రంగా విశ్లేషించి, ఈవీఎం లు 'దుర్భేద్యం' అని చివరకు సుప్రీంకోర్టు జడ్జిలు తేల్చిచెప్పటం జరిగింది. అయినా అరిగిపోయిన గ్రామ్ ఫోన్ రికార్డు లాగా, పాడిందే పాటలా పదే పదే అదే పల్లవి అందుకోవటం ఈ ఆధునిక యుగంలో ఆశ్చర్యం కలిగించక మానదు.

ఇప్పుడు తాజాగా ఎలాన్ మస్క్ అనే ఒక ట్విట్టెరాధిపతి ఈవీఎం లు వాడొద్దన్నాడని, అవి వాడితే ఎన్నికల తీర్పు మార్చొచ్చన్నాడని కొత్తపల్లవి అందుకొన్నారు. ఇలా ఫిట్స్ రోగంలా ఏ పార్టీ తుడుచిపెట్టుకు పోయినప్పుడల్లా ఆ పార్టీ ఈ పల్లవి అందుకోవటం 'భేతాళుడి' కథలను గుర్తుకుతెస్తున్నది. నిజంగా ఐదు లక్షల పైచిలుకు గ్రామాలున్న భారతదేశం లో, అందులోనూ కొండలు, కోనలు, వాగులు, వంకలున్న చోటగూడ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉన్న దేశంలోనూ, ఈ ఈవీఎం లు హాక్ చేసి ఎన్నికల తీర్పు మార్చను సాధ్యమైతే కేంద్రంలో బీజేపీ కూటమి (ఎన్ డీ ఏ) మైనారిటీలో ఎందుకు పడుతుంది, తెలుగు దేశం సపోర్ట్ పై ఎందుకు ఆధార పడుతుంది? అటు ఇండియా కూటమి 232 పార్లమెంట్ స్థానాలను, అంటే బీజేపీకి వచ్చిన 240 సీట్లకు ఎనిమిది సీట్ల తక్కువలో ఎందుకుంటుంది? తర్కానికి, విశ్లేషణకు ఏ మాత్రం నిలవని ఇటువంటి క్షుద్ర ప్రచారం పై తుక్కు తుక్కుగా ఓడి పోయిన వైసీపీ కాలం నెట్టేయాలని చూస్తున్నది.

కానీ చంద్రబాబు జూన్ 4నే ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణంకు తనను తాను పునరంకితం చేసుకొనే పని మొదలుపెట్టాడు. ఈ విలేఖరి

అమరావతి వెళ్లి చూసేసరికి ఏముందివందల సంఖ్యలో జేసీబీలు రంగంలో దిగి ఈ అయిదేళ్ల కాలంలో అడ్డ దిడ్డంగా మొలిచిన తుప్పలు, గుబ్బలు, చెట్లు , చేమలను నేలమట్టం చేయ సాగాయి. ఎక్కడికక్క నేలమట్టం చేసిన వాటిని లారీలకెక్కించి ఆ ప్రాంతం అంతా మళ్ళీ మిల మిలా మెరిసేలా మార్చేశారు. అమరావతి లో పాడుబెట్టిన ఇళ్ళు, రోడ్లను తిరిగి మామూలు స్థితికి తేసాగారధికారులు. ఇప్పుడు రాత్రి పూట దీప కాంతులలో అమరావతిని ఉండవల్లి వద్ద బాఅజ్ పైనుంచి చూస్తే మన ఛాతీ గర్వంతో పొంగి పోయేలా అయింది. 'అయిదేళ్ల క్రింద అద్భుతంగా ఉన్న అమరావతి ఇదే కదా' అనిపించి, చూపరులకు కళ్ళు చెమర్చాయి. ఇప్పుడు 'అమరావతీ, బాబు వచ్చాడు, ఊపిరి పీల్చుకో, నీకేమి భయంలేదు' అని గట్టిగా అరిచి చెప్పాలనిపిస్తున్నది అంటున్నారు చూపరులు.

ఇవేమి సరిపోవన్నట్టు చంద్రబాబు జూన్ 12న నే ఎలక్షన్స్ ప్రచారం లో తాను చేసిన సూపర్ సిక్స్ ప్రామిస్ లను అమలు పరిచే దిశగా అడుగులు వేశారు. అయిదింటి పై సంతకాలు చేశారు. ఒకటి పెన్షన్ అమాంతంగా 3000ల నుంచి 4000లకు పెంచడం. గడచిన ఏప్రిల్ నుంచి లెక్కేసి జులై ఒకటికి 7000లు చొప్పున అవ్వ , తాతలకు, అర్హులైన ఒంటరి స్త్రీ పురుషులకు ఈ పెన్షన్ పెంపు వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చేసింది. వికలాంగులకు, దీర్ఘకాల అనారోగ్యులకు 6000-15000 లకు తగ్గకుండా పెన్షన్ లు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మెగా డిఎస్సి కింద 16వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేయడానికి సర్వీస్ కమిషన్ కు ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే సమయంలో పోలవరం ప్రాజెక్ట్ దర్శించి, దానిని గాడిన పెట్టి, రాష్ట్ర అభివృద్ధికి ఎలా ఉపయోగించాలో నన్న విషయమై అహరహం కృషి ప్రారంభించారు.

అదేసమయంలో రవాణా శాఖా మాత్యులు రాంప్రసాద రెడ్డిగారు మహిళలకు ఉచిత బస్సు రవాణా విషయమై చర్యలకు ఉపక్రమించారు.

జూన్ 18 న జనసేనాధినేత పవన్ కళ్యాణ్, తన ఇద్దరు సహచరులతో సెక్రటేరియట్ లోని మొదటి అంతస్తులో తమ సీట్లలో ఆసీనులై కార్యోన్ముఖులయ్యారు. ఈ సరికే నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల శాఖా మాత్యులు, తెనాలి మొత్తం చుట్టబెట్టి రైతులకు నీళ్లు తీసుకెల్లే పంట కాలువల పూడికలు యుద్ధ ప్రాతిపదికన తీయించటం, పౌరసరఫరాల ఆహార గోదాములు పరిశీలించి ఒక్కో పాకెట్లో 50-100 గ్రాములు పప్పులు, బియ్యం తక్కువగా ఉండటం పై చర్యలు ప్రారంభించారు. పోలీస్ ఆఫీసర్లతో మీటింగ్ నిర్వహించి గంజాయి లేని జిల్లాగా గుంటూరు ఉండాలని ఆదేశాలిచ్చారు. త్వరలోనే పవన్ కళ్యాణ్ గారు గ్రామీణ ముఖచిత్ర మార్పుపై , స్వచ్ఛమైన నీటి సరఫరా గ్రామాలకు అందేలా, రహదారి, రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా తనదైన పథకాలతో ముందుకు రానున్నారు.

ఇది కూటమి ప్రభుత్వం. అందరూ రాష్ట్ర సుభిక్షతకు కంకణ బద్ధులై నిస్వార్ధంగా ఏకమైన వారు. విద్యావంతులు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం అందిస్తున్న వారు. ఇలానే సమధికోత్సాహంతో రాష్ట్ర భవిష్యత్తుకోసం సమైక్యంగా ముందుకు సాగుతారని ప్రజల ఆకాంక్ష. అరమరికలు లేకుండా అన్ని వర్గాలవారం ఈ నూతన ప్రభుత్వానికి శు భం జరగాలని ఆశిద్దాం.

(అక్షరాంజలి మాసపత్రిక ఆగస్టు , 2024)

కొత్త ప్రభుత్వం పెను సవాళ్లు!

ఆంధ్ర ప్రదేశ్ లో ఎన్నికల పర్వం ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలైంది. మంత్రి వర్గంలోని వారంతా మంచిరోజు చూసుకొని పదవీస్వీకారాలు చేసేప్పటికి జూన్ 18 తారీఖులు వచ్చేసింది. ఆ తరువాత కొత్తమంత్రులకు తమ తమ శాఖలను ఆకళింపు చేసుకోడానికి, పదవీ ప్రమాణం చేసేనాటికి గత ప్రభుత్వం ఆ శాఖలను ఎక్కడ వదిలిపెట్టింది తెలుసుకోడానికి శాఖాపరమైన సమావేశాలు పెట్టి , వాస్తవ పరిస్థితులు మదించటానికి కొంత సమయం పడుతుంది గదా. ఈ లోగా జూన్ నెలాఖరు వచ్చేసింది. ఎన్నికలప్పుడు అన్నమాట ప్రకారం ఉద్యోగస్తులకు మొదటి తారీఖునే జీతాలు, పెన్షన్ తీసుకొనే ఉద్యోగులకు మొదటి తారీఖునే పెన్షన్లు వాళ్ళ వాళ్ళ అకౌంటులలో వేశారు. ఇక అతిపెద్ద సామాజిక పెన్షన్లు, పెంచిన మొత్తాలతో సహా అన్నది అన్నట్లే జులై ఒకటిన తెల్లవారకముందే ఇంటింటికీ వెళ్లి మరీ పెంచారు. స్వయంగా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు, మంత్రులు , ఎమ్మెల్యేలు , అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యక్రమాన్ని 99% తొలిరోజే పూర్తి చేశారు. అక్కడి వరకు తొలడుగు సరిగానే ముందుకు వేసిన కొత్త సర్కారు ఇప్పుడు ఆగస్టు, సెప్టెంబర్లనుంచి ఇతర హామీలను నిలబెట్టుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

హామీలు నిలబెట్టుకోవటం పాలన అనే నాణానికి ఒక వైపు మాత్రమే. అదే సమస్తం కాదు. అదే సమస్తమయితే గత ముఖ్యమంత్రి జగన్ కు చంద్రబాబుకు తేడా ఉండదు. సంక్షేమం ఎప్పుడూ పాలనలో ఒక అంగంగా ఉండాలే తప్ప అదే పాలనను మింగేయకూడదు. అనుభవగ్యుడైన చంద్రబాబుకు ఈ తేడా తెలుసు కాబట్టే వచ్చి రాగానే

తన మొదటి ప్రాధామ్యం కింద అమరావతిని చక్క బెట్టేందుకు కావలసిన చర్యలను త్వరితగతిన చేబట్టేలా ఆదేశాలు జారీ చేశారు. అంతే గాదు. పాలనా శాఖామంత్రిగా నియమించిన పొంగూరు నారాయణకు అమరావతిని త్వరిత గతిని ఒక దారికి తేవాలని ఆదేశించారు. ఇంకా ఢిల్లీ వెళ్లి ప్రధానిని ఇతర మంత్రులను కలిసి అమరావతి పునరుద్ధరణకు కావలసిన నిధులేకాదు, అమరావతి తొలి ప్రణాళికలో కేంద్ర ఆమోదం పొందిన ఔటర్ రింగ్ రోడ్డుకు, సీడ్ ఆక్సిస్ రోడ్లకు కేంద్ర బడ్జెట్ ఆమోదం ముద్ర వేయించుకొని వచ్చాడు.

అదే సమయంలో అమాత్యులు నారాయణ అమరావతి పర్యటించి, మంత్రులు, ఎం ఎల్ ఏ ల కోసం కట్టించిన గృహ సముదాయాలు , న్యాయమూర్తులకోసం కట్టిన విల్లాలను, ఉద్యోగస్థుల నివాసాలు సిద్ధం చేసే పని యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. అలాగే గతంలో అమరావతిలోని వేరు వేరు జోన్ లను మాస్టర్ ప్లాన్ లో ఏర్పరచినట్లు గజెట్ లో ప్రకటించలేదు. వాటిని ఇప్పుడు గజెట్ లో ప్రకటించి సాధికారత కలిపించారు. గతంలో చంద్రబాబు హయాంలో ఎన్ ఆర్ ఐ లకు కొత్త రాజధానిలో భాగం కలిపించే ఉద్దేశ్యంతో 'హ్యాపీ నెస్ట్' గృహసముదాయా లను ప్రకటించారు. అయితే జగన్మోహన్ రెడ్డి వాటిని ముందుకు తీసుకు పోక పోవడంతో ఆ ఆలోచన అటకెక్కింది. ఇప్పుడు తిరిగి వారి కోసం యుద్ధప్రాతిపదికన 'హ్యాపీ నెస్ట్' ను కదుపుతున్నారు. ఎందుకంటే గతంలో జగన్ మోహన్ రెడ్డి హ్యాపీ నెస్ట్ పధకానికి డబ్బులు కట్టిన ఎన్ ఆర్ ఐ లకు డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఇళ్ళు కట్టించి ఇవ్వలేదు. ఈ కారణంగా వారిలో కొంతమంది అమరావతి హైకోర్టులో కేసులు వేశారు. ఇప్పుడా కేసులు వేసిన వారిని ఆ కేసులు ఉపసంహరించుకునేలా చేసి,

గతంలో ఈ విషయమై హైకోర్ట్ ఏవైనా ఆదేశాలు ఇచ్చి ఉంటే న్యాయ పరమైన అభిప్రాయాలు తీసుకోవలసి వచ్చింది. ఇలా గత ప్రభుత్వ నిర్వాకం వలన అనేక సామాన్య విషయాలు కూడా జఠిలమై ఉన్నాయి. ఈ చిక్కు ముడులు విప్పదీసి ముందుకు సాగటం అనేక విషయాలలో కూడా ఒక పెను సవాలుగా పరిణమించింది.

ఇంతేనా! జగన్ హయాంలో ఇసుక, ఖనిజాల దోపిడీకి కొండలూ, చెరువులూ మాయమయ్యాయి. భూకబ్జాలైతే లెక్కలేనన్ని. అమరావతిలో భవన నిర్మాణాలు ఆగిపోయినా ఇసుక సిండికేట్లు ఇసుకను అధికధర్లకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. దీనిని వెంటనే చక్క బెట్టడానికి చంద్రబాబు ఉచిత ఇసుక పంపిణీ విధానం తిరిగి అమలులోకి తెచ్చారు ఈ జులై 8 నుంచి. ఇసుక దోపిడీ దారులకు ఈ చంద్రబాబు ఆదేశాలు పచ్చి వెలక్కాయ గొంతులో అడ్డంపడ్డట్టుగా మారాయి. అదేసమయంలో అన్నా క్యాంటిన్లను తిరిగి యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించనున్నట్టు పురపాలక, పరిపాలనా శాఖా మంత్రి పొంగునూరు నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కూలీ నాలీ చేసుకునేవారు నుంచి చెవులు, ముక్కులు పిండి వసూలు చేస్తున్న హొటళ్లకు చెంపపెట్టుగా ఈ అన్నా క్యాంటిన్లు వీలైనంత త్వరలో అమలులోకి వస్తే అదే గొప్ప. బీదలకు, ఒంటరి వృద్ధులకు, ఆడకు, మగకు, కాలేజ్ లకు వెళ్లే బీద విద్యార్థులకు ఒక పూట టిఫిన్, ఇంకోపూట భోజనం రూ. 10-15లకే లభిస్తే అంతకంటే కావలసిందేముంది. ఆగష్టు 15 నాటికి 185-210 కాంటీన్లను పట్టణాల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి చెబుతున్నారు. ఆయన చెప్పినట్టుగానే క్షేత్రస్థాయిలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఇప్పుడు ఏ సంక్షేమం అమలు చేయాలన్నా, ఏ కార్యక్రమం చేయాలన్నా బడ్జెట్ తయారు చేయాలి. 2024 ఎలక్షన్ ముందు జగన్ ప్రభుత్వం కేవలం వోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశ పెట్టింది. ఇప్పుడు పూర్తి బడ్జెట్ పెట్టటమా లేక కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చేదాకా ప్రతి మూడు నెలలకు వోట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ తో సరి పుచ్చటమా అనే నిర్ణయం తీసుకోవాలి. ఇదే గాక మహిళలకు ఇస్తామన్న ఉచిత బస్ సౌకర్యం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ళు పై బడ్డ ప్రతి ఆడబిడ్డకు ఇస్తామన్న నెలకు రూ. 1500ల విధి విధానాలు రూపొందించి వీలైనంత త్వరగా అమలు జరపాలి. అన్నింటికన్నా ముఖ్యమైన పోలవరం నిర్మాణ కార్యక్రమం, పునరావాస కార్యక్రమానికి విధి విధానాలు, కార్యాచరణ ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా చేపట్టాలి. ఈ విషయమై ఇటీవల ఢిల్లీ వెళ్ళినప్పుడు ప్రధాని మోడీతో కూలంకుషంగా చర్చించినట్టు చంద్రబాబు మీడియాకు తెలిపారు. అందుకు అవసరమయ్యే ఆర్థిక సహాయం కేంద్రం చేస్తుందని హామీ ఇచ్చారు మోడీ.

ఒకవైపు చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టటానికి అహరహం కృషి చేస్తుంటే, మరోవైపు గతంలో వై సి పి తో అంటకాగిన కొంతమంది అధికారులు తిన్నగా రాష్ట్రస్థాయి పాలనా కార్యాలయంలో, అందునా సాక్షాత్తు చంద్రబాబు ఆఫీసులోకి చొరబడ్డారని వార్తలు వస్తున్నాయి. నిజానికి ఇది చంద్రబాబుకు పరీక్షా సమయం. గతంలో జగన్ రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ తన గుప్పింట్లో ఉండేలా, ప్రతి అధికారిని అవినీతికి అలవాటయ్యేలా చేశాడు. జగన్ ఉప్పు కోట్లలో తిన్న ఈ అధికారులు అదను చూసి చంద్రబాబును కాటేస్తారేమోనని మీడియా హెచ్చరికలు

చేస్తున్నది. గతంలో చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు ఆయనను చంపాలని చూశారు. అలాంటి వీళ్ళు చంద్రబాబు ఆఫీసులోనే చొరబడి, ఆయనపై ఏ అఘాయిత్యానికి పథకం వేస్తారో, జగన్ కు ఏవేమి చేరవేస్తారోనన్న భయం మీడియాలో అనేక మంది విశ్లేషకులు, సోషల్ మీడియా వాడే వారు వ్యక్తం చేస్తున్నారు

వీరిలో సుమారు 100-150 మంది అధికారులు ఐ ఏ ఏస్ లు, ఐపీఎస్ లు, ఇతర క్యాడర్, నాన్ క్యాడర్ సిబ్బంది ఉంటారు. వీరిని కీలక స్థానాలనుంచి తక్షణమే తొలగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేగాక గతంలో జగన్ చంద్రబాబుకు అనుకూలమైన వ్యక్తులను అయిదేళ్ల తన పాలనా కాలంలో ఏ పని ఇవ్వకుండా ఒట్టిగా కూర్చో బెట్టారు. ఇప్పుడు కూడా అదే చేయమని, తనకు గతంలో సానుకూలమైన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోని, జగన్ అనుకూల అధికార గణాన్ని ఏ పని లేకుండా కూర్చో బెట్టాలని మీడియా కోరుతోంది. ఇలా కేవలం చంద్రబాబు కార్యాలయమే కాదు. హోంమినిస్టర్ వనిత కార్యాలయంలోనూ, ఇతర మంత్రుల కార్యాలయాలలో కూడా చొరబడ్డారని వార్తలు వినవస్తున్నాయి.

అన్నింటికీ మించి చంద్రబాబు గత హయాంలో 2014-2019 మధ్య చంద్రన్న బీమా పథకం అమలు చేశారు. ప్రమాదాలలో గాయపడే వారికీ, చనిపోయిన వారికి వారం తిరక్కుండానే బీమా క్రింద 3. 50 లక్షలు, తక్షణ సహాయం క్రింద 1. 50వేలు ఇప్పించే వారు. బీమా సొమ్మును పిల్లల పేరుమీద గాని, భార్య పేరుమీద గానీ వేసేవారు. ఇప్పుడు చంద్రబాబు అయిదు కోట్లమందికి లబ్ది కలిగించే రూ. పది లక్షల ఆరోగ్య బీమా పాలిసీని అమలులోకి తేవాలని ఆలోచిస్తున్నారు.

ఇదే అమలులోకి వస్తే అవినీతికి, కార్పొరేట్ దోపిడీకి, అక్రమ ఆపరేషన్స్, దొంగ బిల్లులకు నిలయమైన ఆరోగ్యశ్రీ పథకం స్థానే మేలైన బీమా పథకం అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఇంకా వాలంటీర్ల సమస్య పరిష్కారం కాలేదు. ఉద్యోగ కల్పనకు నిపుణత పెంచే సర్వే ఇంకా ఆరంభం కాలేదు. ప్రభుత్వ రంగంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలి. ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేస్తామన్న లోకేష్ మాట నిలబడాలి. ఇలా లెక్కకు మించిన సవాళ్లు, పెను సవాళ్లు చంద్రబాబు పనితనానికి పరీక్షలుగా మారాయి. ఆయన ఈ సవాళ్ళను తన అపార అనుభవంతో సునాయాసంగా ఎదుర్కొంటారని ఆశిద్దాం. ఆల్ ది బెస్ట్ బాబుగారు !

(అక్షరాంజలి మాసపత్రిక సెప్టెంబర్ , 2024)

వెంటనే మాకు అధికారం కావాలి - అసహనంతో జగన్, కె టి ఆర్ ల వింత ప్రహసనాలు!

ఇటు ఆంధ్రాలోను, అటు తెలంగాణాలోను కొత్త ప్రభుత్వాలు వచ్చాయి. ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాబోయే ఆగస్టు 15కు రెండు నెలలు అవుతుంది. తెలంగాణా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటింది. అంతే! కానీ, ఐదేళ్లు అధికారం రుచిచూసిన జగన్ కు, పదేళ్లు పదవులలో మునిగి అంగ రంగ వైభవంగా జీవితం గడిపిన కే సి ఆర్, కే టీ ఆర్ లకు ఇప్పుడు పదవులు లేకుండా బ్రతకటం దుర్భరంగా ఉన్నట్లుంది. ఇలా ఎందుకు అనవలసి వస్తుందంటే కూటమి అధికారంలోకి వచ్చి నెల తిరగక ముందే జగన్ ఇక్కడా, ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టి ఆంధ్రాలో శాంతి భద్రతలు పూర్తిగా పోయాయని, రాష్ట్రపతి పాలన పెట్టాలని, 36 రాజకీయ హత్యలు, 1500ల హత్యా ప్రయత్నాలు, 1100ల మానభంగ సంఘటనలు జరిగాయని పేర్కొనటం అందరినీ ఆశ్చర్య పరిచింది. అన్నింటికంటే ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే జగన్ వెంబడి ఢిల్లీ వెళ్లిన ఎం ఎల్ ఏ లు, ఎం ఎల్ సి లందరూ పలు హత్యా నేరాలలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. వారిలో అవినాష్ రెడ్డి, జగన్ రెడ్డి ప్రముఖులు. అందులో తన కార్ డ్రైవర్ను చంపి హోమ్ డెలివరీ చేసి, తానే చంపానని బహిరంగంగా చెప్పిన కాకినాడ ఎం ఎల్ సి అనంతబాబు, రౌడీ షీటర్ దువ్వాడ శ్రీనివాస్ కూడా ఉన్నారు. పెద్దిరెడ్డి, రామచంద్రా రెడ్డి లాంటి ప్రొఫెషనల్ నేరగాళ్లు, ల్యాండ్ గ్రాబ్బర్స్ , ఎక్సటా ర్సినిస్ట్, రపిస్ట్స్, సాండ్ మాఫియా, గంజాయి మాఫియా రౌడీ షీటర్స్ ఉండటం.

వీరు రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయి , రాష్ట్రపతి పాలన కావాలని అడుగుతున్నారంటే తమ విచ్చల విడితనానికి చంద్రబాబు కళ్ళాలు వేశారని చెప్పకనే చెబుతున్నట్టు. అసలు అన్ని హత్యలు, హత్యాయత్నాలు, మానభంగా సంఘటనలు జరిగితే రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఏమిచేస్తున్నట్టని అన్నివర్గాల వారు విస్మయం వ్యక్తం చేశారు. తీరా అన్ని జిల్లాల పోలీస్ బాస్ లను పిలిపించి మాట్లాడితే తెలిసిన విషయాలు వేరు. జగన్ పేర్కొన్న కాలంలో (ఒకటిన్నర మాసంలో) తమకు ఓటు వేయలేదని, వేయకుండా చూసారని ముగ్గురు తెలుగుదేశం కార్యకర్తలను వైసీపీ వాళ్ళే నరికి చంపేశారు. ఒక ఆడ పిల్లపై మానభంగం కేసు నమోదైంది. నేరస్తుడిని అదుపులోకి తీసుకోని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ కు బదిలీ చేశారు. అందుకే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వివరాలను తొలి అసెంబ్లీ సెషన్ ముందుంచి, సభా ముఖంగా జగన్ను ఆ ముప్ఫయి ఆరు హత్యల వివరాలు, ఎఫ్ ఐ ఆర్ లు ప్రభుత్వానికి ఇవ్వమని డిమాండ్ చేశారు. హెూమ్ మంత్రి వంగలపూడి వనిత అసెంబ్లీలో పోలీస్ శాఖ పై జరిగిన చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వటమే గాక, బయట కూడా మీడియా సామావేశం పెట్టి ఒకటిన్నర నెల కాలంలో జరిగిన క్రైంస్ రిపోర్ట్ , ప్రభుత్వ చర్యలను వివరించారు. అంతేగాక, జగన్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను, రాజకీయ హత్యలను, దళిత స్త్రీల పై జరిగిన మాన, ప్రాణ దాడులను ఒక్కక్కటిగా ఏకరువు పెట్టి నాటి ప్రభుత్వ నిష్క్రియత్వాన్ని, దుర్మార్గత్వాన్ని ఎండగట్టారు. అప్పటికి గాని అలవోకగా అబద్ధాలు, అసత్యాలు పలికే జగన్మోహన్ రెడ్డి నోటికి తాళం పడలేదు.

ఆశ్చర్యమేమంటే జగన్ అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. మొదటిది ఆయన గెలుపు ఓటములను విశ్లేషించుకొని రాజకీయాలలో ముందుకు సాగే సీదా సాదా రాజకీయ నాయకుడు కాదు. ఎక్కడా లేని, ఎక్కడా కనపడని రాజరికపు పోకడలకు పోయే విపరీత మనస్తత్వం. గెలుపు, ఓటములను మానావమానాలతో ముడిపెట్టి వ్యక్తిగతంగా కక్షలు ఏర్పరచుకొనే వ్యక్తిత్వం అతనిది. గతంలో ఇందిరాగాంధీ, కరుణానిధి, జయలలిత లాంటి కొందరు రాజకీయాలలో ఈ విధమైన మనస్తత్వం ప్రదర్శించేవారు. దురదృష్టవశాత్తు జగన్ వీళ్ళని అన్నివిషయాలలో మించిపోయాడు. మొదట తన ఓటమికి కారణం ఈవీఎం లను చంద్రబాబు మేనేజ్ చేసాడని, తరువాత తనను అక్క చెల్లెళ్ళు, అవ్వాతాతలు మోసం చేశారని చెప్పాడు. తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ వలననే ప్రజలు ఎన్ డీ ఏ కూటమికి ఓట్లు వేశారని... ఇలా ఒక్కోసారి ఒక్కోటి చెబుతూ, తరుచూ బెంగళూరు వెళ్ళి అక్కడ కొన్ని రోజులు ఉండి తిరిగి తాడేపల్లి వస్తూ, పొంతనలేని వాదనలు వినిపించటం చేస్తున్నాడు.

తాజాగా ఆయన కొత్తపల్లవి అందుకొన్నారు. అదేమిటంటే, తనకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని, తనకు ముఖ్యమంత్రితో సమానహోదా కలిపించి, ఆమేరకు భద్రత కలిగించాలని డిమాండ్ చేయటం. ఇవన్నీ భారత దేశంలో గత 77 లలో ఎవ్వరూ ఏనాడూ కోరని వింత కోరికలు. భారతదేశ రాజకీయ చరిత్రలో విపరీత మనస్తత్వం ఉన్న కొందరు రాజకీయ నాయకులెప్పుడైనా ఉన్నా, ఇంత విపరీతమైన కోరికలున్న వారిని ఎప్పుడూ చూసి ఉండలేదు. విపరీత మనస్తత్వానికి జగన్ ప్రవర్తన ఒక పరాకాష్టని చిన్నపిల్లలకైనా అర్థమవుతుంది. అంతటితో

జగన్ రాజకీయ క్రీడ ఆగలేదు. ఇక్కడ పేర్కొన్న రెండు విషయాలపై ఆయన ఆంధ్రా హైకోర్ట్ తలుపు తట్టాడు. ఇది మరో వింత. వ్యక్తిగత మానసిక రోగాలకు, విపరీత కోరికలకు హైకోర్టును ఒక వేదికగా, పావుగా వాడుకొని, తద్వారా తాను చట్టబద్ధమైనవే అడిగానని ప్రజలకు చెప్పాలని చూడటం. ఈ విషయం తేలే వరకు ఆయన అసెంబ్లీ గడప తొక్కరు. తన పార్టీ సభ్యులను తొక్కనీయరు.

ఇంతటితో జగన్ ఆగలేదు. తనని చంపే కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే తన రక్షణను తగ్గించారని మరో దుష్ప్రచారం చేయటం మొదలు పెట్టాడు. నిజానికి చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి కంటే ఇప్పుడు జగన్ కు కలిపిస్తున్న రక్షణ ఎక్కువ. ఒకప్పుడు జగన్ ప్రభుత్వం చంద్రబాబుకు రక్షణ తగ్గిస్తే, హైకోర్టుకు వెళ్ళి తిరిగి దానిని పొందాడు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఏమీ లేదు. అంతేగాదు చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటినుంచి తన పార్టీ శ్రేణులకు ప్రతీకార చర్యలకు పాలుపడవద్దని , గతంలో టీడీపీ కార్యకర్తలను టార్గెట్ చేసి వేధించి, హింసించి చంపినా వారి బంధువులకు కూడా ప్రతీకార చర్యలు వద్దని చంద్రబాబు స్పష్టమైన సందేశాలను పంపాడు. నిజానికి ఆంధ్ర రాష్ట్రం జగన్ సృష్టించిన మారణ హోమం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నది. హింస, ప్రతీకారాలను ఏ కొద్దిమందో తప్ప మెజారిటీ ప్రజలు కోరుకోవటం లేదు. శాంతి, అభివృద్ధి, ఉద్యోగకల్పన, పోలవరం నిర్మాణం, అమరావతి పునరుద్ధానం కోరుకొంటున్నారు. ఈ శాంతిమంత్రం జగన్ కు నచ్చదు. హింస, ప్రతీకారాలతో రగిలిపోయే మనస్తత్వం ఆయనది. కొందరైతే ఆయన శవాలను చూసి నవ్వుతాడని, ఎక్కడ శవం కనపడితే అక్కడికి పరిగెత్తుకెళ్తాడని వ్యంగ్యన్గా విమర్శిస్తున్నారు. ప్రతిరోజు

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు ఎంత వేగంగా చర్యలు తీసుకొంటున్నారు, ఎంత తీవ్రంగా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు పత్రికల ద్వారా, ప్రసార మాధ్యమాల ద్వారా తెల్సుకొంటున్నారు.

ఇది ఇలా ఉంటే ఈ మధ్య జగన్ మరో కొత్త పల్లవి అందుకొన్నాడు. అదేమిటంటే తాను రెండోమారు ముఖ్యమంత్రి నై ఉంటే, ఈ పాటికి బడికి వెళ్లే పిల్లల తల్లులకు అమ్మ వొడి, రైతు సహాయం చేసి ఉండేవాడినని , చంద్రబాబు మాటలు నమ్మి తెలుగు ఆడపడుచులు మరోసారి మోస పోయారని. జగన్ , అతని కుటుంబం చంద్రబాబు విశ్వసనీయత లేనివాడిని, విశ్వసనీయతకు తానూ, తన కుటుంబమే మరో పేరని చెప్పుకొని కదా 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాడు. మరి ఆనాడు చంద్రబాబు మీద కన్నా జగన్ పై విశ్వాసం చూపి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు చంద్రబాబు ను ఎందుకు, ఎలా విశ్వసిస్తున్నట్లో అర్థం కాదు. నిజానికి ఈ సారి తెలుగుప్రజలు చంద్రబాబు ఇచ్చిన హామీలను, అవి ఇచ్చే తీరును పరిగణలోకి తీసుకోలేదు. వారు ముఖ్యంగా కోరుకొన్నది జగన్ అరాచక పాలననుంచి రాష్ట్ర విముక్తి. హింస , పోలీసు గుండాల కుమ్మక్కు వలన రాష్ట్రం ఎలా నాశనం అవుతున్నదో గుర్తించి, ఆ నాశనం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవటం కోసం చంద్రబాబుకు, కూటమికి పట్టంకట్టారు. దానర్థం చంద్రబాబు సూపర్ సిక్స్ ఇవ్వకపోయినా ఉరుకొంటారని కాదు. కానీ , కొంచెం ముందూ వెనుకగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి తీరుతాడు.

కానీ, తనపై ప్రజల్లో పెల్లుబికిన వ్యతిరేకతను తక్కువ చేసో, అసలుకే తనపై వ్యతిరేకత లేదని చెప్పటానికో జగన్ ఇలాంటి ప్రసంగాలకు, ప్రచారాలకు పాల్పడుతుంటాడు. ఈ విధమైన ఆత్మ విమర్శనా

లోపమే జగన్ను మానసిక రోగిగా రాజకీయ విశ్లేషకులు పరిగణించడానికి కారణం. ఎప్పుడైతే ఎన్నికలప్పుడు జగన్ తల్లి అమెరికా పోయి అక్కడినుంచి జగన్ను ఓడించామని ప్రజలకు చెప్పిందో, ఎప్పుడైతే ఇద్దరు సోదరీమణులు సునీతా, షర్మిలా జగన్ నాశనం కోరుతూ ఎన్నికల ప్రచారానికి దిగారో ఆ రోజే జగన్ ఓటమి నిర్ధారణయింది. ఇలాంటి సత్యాలను గ్రహించలేని జగన్ ఆత్మ వంచనకు పాలుపడుతూ, తన పార్టీ శ్రేణులను , నాయకులను ఆత్మ వంచనకు గురిచేస్తున్నాడు. కొందరిప్పటికే జగన్ చేసే ఆత్మ వంచన అర్ధం గ్రహించారు. ఇంకా చాలామంది గ్రహించ వలసి ఉంది.

ఇది ఇలా ఉంటే పక్క రాష్ట్రంలో కేటీఆర్, కే సి ఆర్ ల పరిస్థితి ఇందుకు ఏ మాత్రం భిన్నంగా లేదు. తెలంగాణా అసెంబ్లీలో కేటీఆర్ ఉపన్యాసాలు, సవాళ్లు చూస్తుంటే వీరూ జగన్ లాగానే మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కనిపిస్తుంది. తొలి అసెంబ్లీ సమావేశాల్లో మేడిగడ్డ బారాజ్ కుంగిపోవటం పైన, దాని నిర్మాణంలో జరిగిన అవినీతిపైన విచారణకు రేవంత్ ఆదేశిస్తే, రైతులకు నీళ్లు ఇవ్వక పొలాలు ఎండిపోతున్నాయని, రైతులు ఆత్మ హత్యలు చేసుకొంటున్నారని యాగి చేశారు. రేవంత్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషించటానికి వెనుకాడలేదు కేటీఆర్, హరిష్ లు. ఇద్దరికీ తమంత మేధావులు వేరే ఎవ్వరూ లేరన్న అహంభావమే ఎక్కువ కనబడింది ఆ చర్చల్లో. అలాగే రేవంత్ తన కాంగ్రెస్ మార్కు సంక్షేమ పధకాలు చెప్పిన తేదికి చెప్పినట్టు అమలు చేయాలని, ఆ విషయంలో రేవంత్ విఫలమయ్యాడని చెప్పి ఎదో లబ్ది (మైలేజ్) పొందాలని ఎంతో తపన పడ్డారు. కానీ, ట్ ఆర్ ఎస్, (బి ఆర్ ఎస్) తన పదేళ్ల కాలంలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి ముందు రాష్ట్రాన్ని ఎలా ఒడ్డుకు పడేయాలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్కు

తలకు మించిన పనైంది. ఈ విషయం తెలిసే వాళ్ళు తాము తప్ప రాష్ట్రానికి వేరే గతి లేదని నిరూపించ టానికే ఈ అతి ఆసక్తి చూపారన్నది విశ్లేషకుల అభిప్రాయం .

ఇక కే సి ఆర్ విషయం తీసుకొందాం. కేసీఆర్ కాలంలో విద్యుత్తు కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయన్న అనుమానంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక కమిషన్ వేసింది. తన విచారణలో భాగంగా కొన్ని వివరాలను రాబట్టడానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ను విచారణకు రమ్మని సమన్లు పంపారు. రెండు సార్లు ముఖ్య మంత్రిగా చేసిన ఆయన విచారణకు వెళ్ళితే సరిపోయేది. ఆయన పెద్దరికానికి హుందాగా ఉండిఉండేది. తగుదునమ్మాని లేనిపోని అహం, భేషజాలకు పోయి ఆ కమిషన్నే రద్దుచేయమని తెలంగాణా హైకోర్టు కు వెళ్లారు. కమిషన్ చైర్మన్ నరసింహ రెడ్డి తనపై బహిరంగంగా అవినీతి వ్యాఖ్యలు చేసినందున ఆయన విచారణకు ముందే ఒక నిర్ణయానికి వచ్చినట్టు కనబడుతోందని, అందువల్ల ఈ కమిషన్ రద్దుచేయమని అడిగారు. అందుకు హైకోర్టు సమ్మతించక పోవటంతో, సుప్రీమ్ కోర్టుకు వెళ్లారు. అక్కడా విచారణకు కేసీఆర్ వెళ్లాల్సిందే అని సుప్రీమ్ కోర్ట్ చెప్పింది. కాకపోతే, కమిషన్ చైర్మన్ నరసింహారెడ్డి బదులు మరొకరిని నియమించామని రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. ఇంత చేస్తే వ్రతం చెడ్డ ఫలితం దక్కలేదు. విచారణకు వెళ్లకా తప్పేట్టు లేదు.

ఇక కేటీఆర్ , కేసి ఆర్ లు కూడా తమ ప్రభుత్వం ఓటమి పాలవడానికి కారణం తమ వైఫల్యాలే అని ఒప్పుకోవటానికి సిద్ధంగా లేరు. తాము అద్భుత పాలన ఇచ్చినా ప్రజలు తమను ఓడించారని మానసికంగా తమను తాము ఆత్మ వంచన చేసుకొనే పరిస్థిలో ఉన్నారు. తాము పాలించిన పదేళ్ల కాలంలో తాము చేస్తామని చెప్పిన ఎన్నో హామీలు

తాము సవ్యంగా అమలు చేయలేదని తెలిసినా అలాంటివి తమ ఓటమికి కారణాలని గ్రహించే స్థితిలో లేరు. తాము ఓటమి పాలవడానికి కారణం రేవంత్ , కాంగ్రెస్ కలిసి చేసిన హామీలే కారణమని వాళ్ళు తమని తాము మభ్యపెట్టుకొంటున్నారు. పార్టీ క్యాడర్ ను మభ్య పెట్టె ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అయింది. అప్పటికీ కొన్ని హామీలు అమలు చేశారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, రైతు రుణ మాఫీ, అయిదు ఉచిత గాస్ సిలిండర్లు, డి ఎస్ సి జరిపించి ఉపాధ్యాయ రిక్రూట్మెంట్ జరపటానికి ప్రకటనలు, పరీక్షా తేదీలు ప్రకటించటం చేశారు. ఈ లోగానే రేవంత్ అన్న మాట నిలబెట్టుకోలేదని, కాళేశ్వరం నీళ్ల రాక అనేకమంది రైతులు ఆత్మ హత్యలు చేసుకొంటున్నారని ఇలా ఎదో ఒక అసత్య , అసంబద్ధ, ఆధారం లేని ఆరోపణలతో, రేవంత్ ను అవమానించే మాటలతో అసెంబ్లీ లోపల, బయట రెచ్చగొట్టటం పరిపాటై పోయింది. ఇది ఎంతవరకూ వెళ్లిందంటే ప్రజలెన్నుకొన్న రేవంత్ రెడ్డిని తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంబోధించలేని సిగ్గుమాలిన స్థితికి దిగజారింది. ఒక దశలో కే టి ఆర్ రేవంత్ రెడ్డిని రాష్ట్ర అసెంబ్లీలో 'రేవంత్' అని సంబోధించేంత వరకు.

ఇటువంటి సంబోధనలను రాష్ట్ర ప్రజలు ఎలా తీసుకొంటారోనన్న ఆలోచనకూడా లేని అనాలోచిత ప్రవర్తన కేటీఆర్ ది. ఇది కేవలం తనకు దక్క వలసిన ముఖ్యమంత్రి పదవి రేవంత్ రెడ్డిగారు ఎగరేసుకుపోయారన్న అక్కసుతో అనే మాటలు గానే ప్రజలు భావిస్తారు కదా. ఇంత చిన్న లాజిక్ కేటీఆర్ ఎలా మిస్ అయ్యారు. అదేవిధంగా రుణ మాఫీ అందరు రైతులకిస్తామన్నారు. ఇప్పుడు షరతులు పెట్టారని ఒక అర్థం లేని విమర్శ. ఏ ఉచిత పథకానికైనా బ్లాంకెట్ కవర్ లా అర్హులకు, అనర్హులకు మధ్య తేడా లేకుండా అమలు జరిపే పద్ధతి

ఉండదు. అలా ఉంటే దానిని పాలన అని అనరు. ఆలా అని వాటినన్నిటిని ముందే తెలిపారు. ప్రజలకామాత్రం ఇంకిత జ్ఞానం ఉంటుందని, ఎప్పటినుంచో ఉందని రాజకీయ పక్షాలన్నింటికి తెలుసు. అయినా తగులాట కోసం తగులాటలా ఇలాంటి ప్రసంగాలు చేసి ప్రజలకు విసుగు కలిగించటం బి ఆర్ ఎస్ పార్టీకి ఆనవాయితీగా మారిపోయింది. దానివలన బి ఆర్ ఎస్ ప్రతిపక్షముగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్న నమ్మకం ప్రజల్లో పోతున్నది. పదవి, అధికారం పోయిందన్న దుగ్ధ తో ఆవేశపడుతూ, మాటలు తూలి మాట్లాడుతూ బి ఆర్ ఎస్ చేస్తున్న తప్పిదం ప్రజలు సునిశితంగా గమనిస్తున్నారు. తమ సొంత పార్టీ ఎం ఎల్ ఏ లే దీనిని సహించలేక తెల్లవారేసరికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. అలాంటి వారిని పార్టీ ఫిరాయింపులకింద అనర్హులను చేస్తాం అని కేటీఆర్ ఆక్రోశించినా, కోర్టు గడపలేక్కినా చేయగలిగేది సున్నానే. ఎందుకంటే ఈ ఆక్రోశం, ఆవేదనలకు గతంలో తెలుగుదేశాన్ని, కాంగ్రెసును గురిచేసినప్పుడు ఏమైంది ఈ నైతిక విలువలు, అనర్హత వేటు సవాళ్లు. ఇవాళ తమ దాకా వచ్చాక స్పీకర్ అధికారాలు , సుప్రీమ్ కోర్ట్ జడ్జిమెంట్లు గుర్తుకొస్తున్నాయి కేటీఆర్ కు.

ఎన్నో డిక్క ముక్కీలు తిని, రాజకీయ విష సర్ప సోపాన పటం పై చాకచక్యంగా ఎదిగిన రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు ఈ కేటీఆర్ , కేసిఆర్ లకు, బి ఆర్ ఎస్ నాయకులకు ధీటుగా సమాధానం ఇస్తున్నాడు. ఏది ఏమైనా ఆంధ్రాలో జగన్, తెలంగాణలో కేటీఆర్, కేసీఆర్ ల ప్రవర్తన మానసిక రోగుల ప్రవర్తనను తలపిస్తున్నాదన్నది కాదనలేని సత్యం.

(అక్షరాంజలి మాసపత్రిక అక్టోబర్, 2024)

హడావుడిగా వచ్చిన వరదలకు, జగన్ మీడియా సృష్టిస్తున్న అసత్య తుపానులకు చంద్రబాబు ఎదురీత!

ఇటీవల (సెప్టెంబర్ 1న) బుడమేరుకు హఠాత్తుగా వచ్చిన వరదలకు విజయవాడ నగరంలోని ఒక భాగం అతలా కుతలం అయిపోయింది. అది ఎవరూ ఊహించని పెను ప్రమాదం. సుమారు 178 గ్రామ సచివాలయాలు, 42 వార్డులలో నీరు మొదటి అంతస్తు దాకా వచ్చేసింది. దాదాపు యాభై వేలమంది నిరాశ్రయుల్లయ్యారు. సుమారు 42 మంది దాకా చనిపోయారని అధికార లెక్కలు చెబుతున్నాయి. సుమారు లక్షా యాభై వేల ఇళ్ళు పూర్తిగానో, పాక్షికంగానో దెబ్బతిన్నాయి. హఠాత్తుగా అర్ధరాత్రి జరిగిన పరిణామానికి ప్రభుత్వ యంత్రాగ్గం ఒక్కక్షణం నివ్వెర పోయినా, త్వరలో తేరుకొని సహాయ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రికి రాత్రే వరదలు ముంచెత్తిన ప్రాంతానికి చేరి, సహాయకార్యక్రమాలలో యంత్రాంగాన్నిఎప్పటికప్పుడు ఏ రీతిలో అవసరమో ఆ రీతిలో సన్నద్ధం చేస్తూ, నడుము లోతు నీళ్ళల్లో కూడా బాధితులకు సాంత్వన చేకూర్చే మాటలు, ధైర్యం చెబుతూ నిద్రలేకుండా రాత్రిబవళ్ళు పర్యవేక్షించారు.

అసలు అంత హఠాత్తుగా విజయవాడలోకి వరద నీరు ఎలా వచ్చింది?ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలుగు రాష్ట్రాలు అతలాకుతలం అయ్యాయి. ముఖ్యంగా విజయవాడ, ఖమ్మం నగరాలు తీవ్రంగా వరద ముంపునకు గురయ్యాయి. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో అసాధారణ రీతిలో వర్షపాతం నమోదు కావడం, అప్పటికే కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులు నిండుకుండలా ఉండటంతో, ఉప్పొంగిన బుడమేరు నీటి వరద బయటకు వెళ్లే దారి లేక విజయవాడ నగరంలోకి ప్రవహించింది.

బుడమేరు ఉద్ధృతికి పలు ప్రాంతాల్లో కట్టలు తెగిపోవడంతో అజిత్ సింగ్ నగర్, రాజరాజేశ్వరీపేట, పైపుల్ రోడ్, రాజీవ్ నగర్, కండ్రిక, జక్కంపూడి కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. విజయవాడ నగరం ఈ స్థాయిలో వరద ముంపు బారిన పడటానికి బుడమేరు విషయంలో గత ప్రభుత్వాలు సరైన రీతిలో వ్యవహరించకపోవడం, స్థానికులు బుడమేరును ఆక్రమించడం ప్రధాన కారణాలని చెబుతున్నారు .

విజయవాడ డ్రైనేజీ బేసిన్ అనేది కృష్ణా పరివాహక ప్రాంతంతోపాటు కొల్లూరు సరస్సులోకి ప్రవహించే బుడమేరు బేసిన్‌లో భాగంగా ఉంది. విజయవాడ నగరంతోపాటు కొండలు, చెరువులతో కూడిన దాదాపు 900 చదరపు కిలోమీటర్ల ప్రాంతం బుడమేరు బేసిన్ పరిధిలోకి వస్తుంది.నిజానికి విజయవాడ నగరానికి వరదలు కొత్తేం కాదు. కృష్ణానది, బుడమేరు కారణంగా గత వందేళ్లలో 17సార్లకు పైగా విజయవాడకు వరదలొచ్చాయి. 2005లో బుడమేరు కారణంగా విజయవాడ ఉత్తర ప్రాంతంలో భారీగా వరదలొచ్చాయి. దీంతో విజయవాడ నగరం మధ్య నుంచి వెళ్లే బుడమేరు ప్రవాహాన్ని మళ్లించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. బుడమేరు నీరు విజయవాడ ప్రధాన నగరంలోకి రాకుండా చూసేందుకు పోలవరం కాలువ (పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజీకి చేర్చే కాలువ)లోకి బుడమేరును మళ్లించింది. 37 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పోలవరం కాలువలోకి బుడమేరును మళ్లించడం వల్ల విజయవాడ వాసులకు బుడమేరు బెడద తప్పుతుందని అప్పటి రాజశేఖర రెడ్డి ప్రభుత్వం భావించింది.

బుడమేరును పోలవరం కాలువతో అనుసంధానించే ప్రాంతంలో బుడమేరు విజయవాడలోకి వెళ్లడాన్ని నియంత్రించేందుకు వీలుగా

వెలగలేరు వద్ద 11 గేట్లతో ఓ బ్యారేజీని ఏర్పాటు చేసింది. దీనిని వెలగనేరు డైవెర్సన్ కాలువ అని కూడా అంటారు. ఇక్కడనుంచి నీరు కొంత కొల్లేరు వైపు, కొంత కృష్ణా నది వైపు మళ్లించే వీలుంది. ఫలితంగ విజయవాడకు బుడమేరు వరదల బెడద తగ్గింది. ఇక్కడ గమనించాల్సి విషయం ఏంటంటే బుడమేరును పోలవరం కాలువలోకి మళ్లించినప్పటికీ కృష్ణానది 19 మీటర్ల స్థాయి దాటి ప్రవహిస్తే పోలవరం కాలువ నీళ్లు నదిలోకి వెళ్లకపోగా కృష్ణానది వరదే పోలవరం కాలువలోకి రివర్స్‌లో వస్తుంది. బుడమేరును పోలవరం కాలువతో అనుసంధానించిన తర్వాత బుడమేరు రెండు భాగాలైంది. ఒకటేమో పోలవరం కాలువ వరకు కలిసే ప్రాంతం. మరొకటి దాని దిగువ భాగం. పోలవరం కాలువ దిగువ ప్రాంతంలో ప్రవాహం లేకపోవడంతో బుడమేరు నామమాత్రంగా మారింది. దీంతో స్థానికులు రివర్ బెడ్‌ను ఆక్రమించిన నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా విజయవాడలో బుడమేరు రివర్ బెడ్ 15 మీటర్ల కంటే తక్కువ వెడల్పుకు కుచించుకుపోయింది. దీంతో వరద నీటిని భరించే సామర్థ్యం బుడమేరుకు లేకపోయింది.

బుడమేరు ఎగువ ప్రాంతంలో, క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురవడం వల్ల సెప్టెంబర్ 1న వరదలొచ్చాయి. ఈ వర్షాల కారణంగా బుడమేరుకు 50 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. ఇది పోలవరం కాలువ సామర్థ్యం కంటే ఎక్కువ. మరోవైపు కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలవరం కాలువలోని నీళ్లు నదిలోకి వెళ్లే అవకాశం లేకపోయింది. బుడమేరు ఉప్పొంగడం, స్థానికంగా ఉన్న వరద వచ్చి చేరడంతో పోలవరం కాలువ పొంగిపొర్లింది. దీంతో అప్రమత్తమైన ఇంజినీర్లు వెలగలేరు వద్ద 11 గేట్లను తెరిచి నీటిని

దిగువకు వదిలారు. చాలా ఏళ్ల తర్వాత వెలగలేరు బ్యారేజీ గేట్లను తెరవగా దిగువ భాగంలో ఏరు కుచించుకుపోవడంతో భారీ వరద వెళ్లేందుకు దారి లేకపోయింది (ఆ మాటకొస్తే అంతకు ముందు కూడా బుడమేరు కెపాసిటీ 15 వేల క్యూసెక్కులే). దీంతో విజయవాడను వరద ముంచెత్తింది.

ఇది అసలు కథ. ఈ హఠాన్వరదల వలన ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. మొదటి అంతస్తు స్థాయిలో వరద నీరు ప్రవహించింది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. వాహనాలు, వస్తువుల్ని నీటిలోనే వదిలేసి డాబాలు, తెలిసిన వారి ఇళ్లపైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. అసలేం జరుగుతుందో తెలుసుకునేలోపే వరద ముంచెత్తిందని కన్నీటిపర్యంతం అయ్యారు. ఎల్బీఎస్ నగర్, శాంతినగర్, వాంబేకాలనీ, సుందరయ్యనగర్, రాజీవ్‌నగర్, కండ్రిక కాలనీల్లో ప్రజలు. విజయవాడ చరిత్రలో బుడమేరుకు ఈ స్థాయిలో వరద ఎప్పుడూ చూడలేదని సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డామని ఆందోళనలోకి వెళ్లిపోయారు.

అయితే ముఖ్యమంచంద్రబాబు తనని తానెన్నడూ ముఖ్యమంత్రిగా అలా హెలికాప్టర్ లో వచ్చి, వరద ప్రాంతాలు గాలిలోనుంచే చూసి నిర్ణయాలు చేసేవాడిగా భావించలేదు. ఆయన తనని ఎప్పుడూ ప్రజా సేవకుడిగా భావించే వాడు. కనుకనే కలెక్టరేట్ లోనే బస చేసి రాత్రి మూడింటి దాకా, పగలంతా వీధి వీధి తిరిగి అక్కడిప్రజలు ఏది కావాలంటే అది క్షణాల్లో చేకూర్చాడు. గత అయిదేళ్ల కాలంలో జడత్వంలోకి వెళ్లిన ప్రభుత్వ అధికారులను తిరిగి ఉత్తేజపరిచి, తాను తిరుగుతూ, ప్రజలకు సాంత్వననిస్తూ వృద్ధులను, చిన్నారులను రక్షించి సురక్షితమైన ప్రదేశాలకు తరలించే ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన చేపట్టాడు.

అదే సమయంలో పాలు, పెరుగు, కూరలు నిత్యావసరాలు, భోజన ప్యాకెట్లను పెద్ద ఎత్తున చేయించి బాధితులకు సమకూర్చాడు. కేంద్రప్రభుత్వం తో మాట్లాడి హెలీకాప్టర్లను, డ్రోన్లను పెద్ద సంఖ్యలో రప్పించాడు. వాటి సహాయంతో బాధితులకు మరింత మెరుగ్గా ఆహార, మందుల సరఫరా జరిపించాడు. దాదాపు ఏడు రోజులు రాత్రిమ్బవళ్ళు అలా గడిపి మూలమూలన ఉన్నవారికి కూడా సహాయం అందాక తన ఉండవల్లి నివాసం చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వందలమంది అధికారులు, వేలమంది పారిశుధ్యం పనివారు, డాక్టర్ల బృందం పనిచేసినందువల్ల ఎటువంటి అనారోగ్యాలు ఆ వారం రోజులు ప్రబల కుండా కాపాడారు. అదేసమయంలో వరద ప్రభావం తగ్గుతున్న కొద్దీ, బురద పేరుకుపోయిన ఇళ్లల్లోని బురద శుభ్రం చేసేందుకు ఫైర్ ఇంజిన్లను రప్పించి ఇళ్ళు, వాకిళ్ళు శుభ్రం చేయించారు.

అదే సమయంలో కేంద్రమంత్రి పర్యటనకు చంద్రబాబు ఆహ్వానించారు. ఆయన స్వయంగా వచ్చి చంద్రబాబుతో కలిసి ఊరు వాడా తేడా లేకుండా, ముంపు ప్రాంతాలన్నీ సందర్శించి కేంద్రానికి నివేదిక ఇస్తానని, కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ సాయం వచ్చేలా చేస్తానని పత్రికా ముఖంగా హామీ ఇచ్చి వెళ్లారు. చంద్రబాబు ప్రజలతో రాత్రిమ్బవళ్ళు పని చేయటం చూసిన పలువురు పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా విరాళాలు ప్రకటించాయి. మంత్రులు, ఎం ఎల్ ఏ లు, సీనియర్ అధికారులు, ఆఖరుకు నాల్గవ తరగతి ఉద్యోగులు కూడా హితోధికంగా తమకు తోచిన సహాయం అందించారు. తెలుగు సినీ పరిశ్రమ లో ప్రముఖ నటులు అంతా లక్షలలో విరాళాలు ప్రకటిచారు. ఈ కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి

సెప్టెంబరు 17న క్యాబినెట్ సమావేశం పెట్టి వరదలో దెబ్బతిన్న ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంగా సాయం ప్రకటించారు. అలాగే ఏలూరు, కాకినాడ, పిఠాపురంలలో ఇటీవల వచ్చిన గాలి, వానా , తుపాను , వరద బాధితులకు కూడా భారీ సహాయం ప్రకటించారు.

దాదాపు సెప్టెంబర్ మొదటి పదిహేను రోజులు వరదలతో, తుపానుతో కుతకుత లాడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నది. ఇక్కడో విషయం చెప్పాలి. ఏ బుడమేరు పొంగటంతో, దేనికి గండిపడటంతో విజయవాడ ఉత్తరం వైపు భారీ వరద తాకిడికి గురైందో, ఆ ప్రాంతానికి మళ్ళీ మళ్ళీ వరదలు రాకుండా రేయనకా పగలనకా జడి వానలో కూడా అలాగే కాళ్ళ పై నుంచొని బుడమేరు గండ్లను పుడిపించారు నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ శాఖా మంత్రి. చంద్రబాబు సేవలు ఎంత కష్టతరమో, రామానాయుడు సేవలు, ఒకటికి మూడు గండ్లను పూడ్చే పనులు అంతే కష్టమైనవని చెప్పటం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం బుడమేరు గండ్లు పూడ్చటమే గాక, వాటి ఎత్తును పెంచే ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అంతేగాక బుడమేరులో వై సి పి నాయకుల ఆక్రమణలో ఉన్న భూములను కూడా తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు హైదరాబాద్ లోని హైడ్రా వ్యవస్థ లాగ ఒక స్వయం ప్రతిపత్తి, చట్టబద్ధత ఉన్న సంస్థను ఏర్పాటు చేయమని రెవిన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఇదేసమయంలో ప్రకాశం బారేజ్ దగ్గరి కృష్ణానదిలోకి మూడు వై ఎస్ ఆర్ సి పి వారి కాంట్రాక్టర్లు ఇసుకను తీసుకెళ్ళేందుకు వాడే భారీ పడవలు వరదకు కొట్టుకొచ్చి బలంగా బారేజ్ ను ఢీ కొట్టాయి. ఫలితంగా బారేజ్ పైన కౌంటర్ వెయిట్ లు పగిలిపోయి బారాజ్ మనుగడకే

ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉత్పన్నం అయింది. ఆశ్చర్యమేమంటే వేరే పడవలేమి కొట్టుకు రాలేదు ఈ వరదల్లో. కేవలం వై ఎస్ ఆర్ పార్టీ లో పనిచేస్తూ, ఇసుక కాంట్రాక్టులు చేస్తున్న ఇద్దరి భారీ పడవలె కొట్టుకొచ్చాయి. పోనీ పొరపాటున కొట్టుకొచ్చాయి అనుకొందామంటే వాటి యజమానులు ఎవ్వరూ వచ్చి పొరపాటు జరిగింది, అవి మావే, మావి మాకు ఇప్పించండి అని ముందుకు రాలేదు. పోలీస్ విచారణ తరువాత అవి ఎవరివో తెలిసి, పోలీస్ యంత్రాంగం వారి నిర్లక్ష్యానికి, ఉద్దేశపూర్వకంగా బారేజ్ కు డామేజ్ చేసి వరదలు సృష్టిద్దామన్న వారి ఆలోచనను తెలుసుకొని వారి పై వివిధ సెక్షన్స్ కింద కేసు బుక్చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఇలా ఏకకాలంలో విజయవాడకు బుడమేరు పొంగు, వరదలు, కొల్లేరు ముంపు, ఆ వెనువెంటనే వచ్చిన తుపాను దెబ్బకు పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు కకలావికలం అవటం, భోరున కురిసే వర్షాలమధ్య బుడమేరు గండ్లు మూడు రోజుల్లో పూడ్చవలసి రావటం, మూడు ఇసుక తీసుకెళ్లే బోటులు ప్రకాశం బారేజ్ ను ఢీ కొట్టటం లాంటి సంఘటనలను ఎదుర్కొని రాష్ట్రాన్ని తిరిగి గాడిలోకి పెట్టటం వంటివి ఎంతో ధనం, శ్రమ, విధివిధానాలతో కూడుకొన్నవి. ఎంతో సహనం కావాలి. ఆ సహనమే చంద్రబాబు, ఆయన పనితనం.

ఇదంతా నాణానికి ఒక వైపు. రెండోవైపు జగన్మోహన్రెడ్డి, ఆయన సోషల్ మీడియా, సాక్షి పత్రిక, టెలివిజన్ చంద్రబాబుపై కక్కిన విషం. నిజంగా ఈ కాలంలో తమ సోషల్ మీడియా ద్వారా, మైన్ స్ట్రీమ్ మీడియా ద్వారా ఎన్నెన్ని దుష్ప్రచారాలు చేశారో చెప్పనలవి కాదు. అమరావతి మునిగి పోయిందన్నారు. నిజానికి అది పచ్చి అబద్ధం. చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందన్నారు. అదీ అబద్ధమే. ఎందుకంటే ఏ జర్నలిస్టయినా

స్వయంగా వెళ్లి చూసుకొనే వీలున్నప్రాంతాలు. చంద్రబాబు కొంప మునిగిపోతుందని బుడమేరు నది గేట్లు ఎత్తేశారని మరో ప్రచారం. చంద్రబాబు నిజంగా నీళ్లలో రాత్రి పవలు తిరగలేదు. కేవలం కెమెరాలకు ఫోటో షూట్ లకు పోస్ లిచ్చాడు. ఆయన తొత్తు మీడియా ప్రచారమే అంతా అని మరో ప్రచారం. నిజంగా బాధితులకెవ్వరికీ ఏ సహాయం అందలేదని మరో ప్రచారం. అదే తన ప్రభుత్వం ఉంటే ఈ పాటికి అమ్మ వడి లభించి ఉండేది. ఇలా లెక్కలేనన్ని అబద్ధాలు గుట్టలు గుట్టలుగా వండి వార్చారు.

అయితే ఈ ప్రచారం ఎవ్వరినీ కంగారు పెట్టలేదు. ఎందుకంటే ఫోన్లు పనిచేస్తున్నాయి. మీడియా ద్వారా నిజా నిజాలు పోల్చుకోందుకు వీలు ఉంది. సహాయం అందలేదని ఏ మీడియా ద్వారా ఎక్కడ తెలిసినా పవన్కళ్యాణ్, లోకేష్ ల మానిటరింగ్ టీం క్షణాల్లో అక్కడికి సహాయం చేర వేసింది. అయితే, అమరావతి ఇమేజ్ దెబ్బ తీయాలని వై సి పి పార్టీ గట్టి ప్రయత్నమే చేసింది. చంద్రబాబుకు ఈ క్లిష్ట సమయంలో కీర్తి రావద్దని దురుద్దేశంతో చేసిన అన్ని ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. చంద్రబాబును ఉక్కిరిబిక్కిరి చేసి, ఆయనను ఒక నిష్క్రియా పరుడిగా చూపించి ప్రజలను తిరిగి తనపట్ల తిప్పుకొందామన్న ప్రయత్నం ఫలించలేదు. చివరకు తోక ముడిచి జగన్ తన బెంగుళూరు పాలస్ చేరాడు. ఈ విషనాగుల కాట్లనుంచి ప్రతి నిముషం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. చంద్రబాబు జాగ్రత్త

(అక్షరాంజలి మాసపత్రిక నవంబర్, 2024)

జర్నలిజంలో 'బాలన్స్'గా రాయటం అంటే ఏమిటీ? జర్నలిజం విలువలు, సూత్రీకరణల్లో నిజం ఎంత?

నేడొక వింత వాదన తరచూ వినవస్తుంది. అదేమిటంటే పత్రికలు 'నిష్పాక్షికంగా రాయటం లేదని, ఏదో ఒక పక్షానికి అనుకూలంగా రాస్తున్నాయని. పత్రికలన్నీ ఏదో ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉంటూ, అవతల రాజకీయ పార్టీ, దాని ప్రభుత్వం చేసే కార్య క్రమాలన్నీ అవినీతి, ఆశ్రీత పక్షపాతంతో నిండిపోయాయని విమర్శిస్తూ ఉంటాయని. ఇంకో అడుగు ముందుకు వేసి ఒకప్పుడు పత్రికలు నిశ్పాక్షికంగా ఉండేవని, 70వ దశకంలో తెలుగునాట ఒక పత్రిక రంగ ప్రవేశం చేయటంతో, ఆ నిశ్పాక్షిక విలువలన్నీ నాశనం అయ్యాయని కూడా కొందరు విశ్లేషించటం మనం గమనించవచ్చు. అంతేగాక ఆ పత్రికా సంపాదకులు రాజకీయాల్లోకి చొచ్చుకు వచ్చి, ప్రభుత్వంలో చక్రం తిప్పారని, అలా చేయటం 'మహాపాపం' అని, అది 'జర్నలిజం'కే ద్రోహమని కూడా సాగదీసే వారున్నారు విశ్లేషకులుగా. ఇలాంటి విమర్శలు యూట్యూబుల్లోనూ, సోషల్ మీడియా ప్లాట్ఫారంల్లోనూ, పుస్తకాల్లోనూ, కొన్ని ఒక పార్టీకి అనుకూల పత్రికల్లోనూ కూడా అధికంగా కనిపిస్తాయి.

21వ శతాబ్దంలో కూడా ఈ విషయమై మనకు స్పష్టత లేకపోతే ఎలా? ఈ స్పష్టత మనకు ఎవరిస్తారు? ఎక్కడ నుంచి వస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం లభించాలంటే మనం జర్నలిజం చరిత్ర, జర్నలిజంలో ఎప్పటికప్పుడు వచ్చే నూతన పరిణామాలను, పరిశోధనలను తెలుసుకొంటే గాని, నిజమైన 'నిశ్పాక్షిక' లేక 'బాలన్స్'తో కూడిన రిపోర్టింగ్ లేక రచన చేయటం సాధ్యమా అన్నవిషయం లో స్పష్టత రాదు. నిజానికి 'జర్నలిజం' అంటూ ఒకటి పశ్చిమ దేశాల్లోనుంచి భారత ఉపఖండంలోకి

చొచ్చుకొచ్చిన ప్రసార మాధ్యమం. ఇది బ్రిటిష్ పాలనలో భారత దేశంలో తొలిసారిగా వేలూనుకోంది. ఇక్కడ అది జర్నలిజం వ్యవస్థగా రూపొందేనాటికి ఇది అనేక రూపాలుగా, భిన్న రంగులను, కోణాలను సంతరించుకొంది. ఈ గమనంలోనేటి 'జర్నలిజం' వ్యవస్థకు, స్వాతంత్ర్య పూర్వం ఉన్న వ్యవస్థకు, విదేశాల్లో ఉన్న జర్నలిజం వ్యవస్థకు ఎంత తేడా ఉన్నదని తెలుసుకొంటే పై ప్రశ్నలకు సమాధానం దొరకడం పెద్ద కష్టమేమి కాదు.

మొదటగా 1776లో విలియం బొల్ట్స్ అనే ఆంగ్లేయుడు భారతదేశంలో ఒక ఆంగ్ల పత్రిక ప్రారంభించినా, 1780లో ఆగస్టస్ హికీ ప్రారంభించిన 'బెంగాల్ గజెట్' అత్యంత ఆదరణ గల తొలిపత్రికగా ప్రాచుర్యంలోకి వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలను, వారి టెండర్ లను ప్రచురిస్తూ ఆదాయం పొందే ఆగస్టస్ హికీ అప్పుడప్పుడూ బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ సంపాదకీయాలు రాయటంతో అసహనానికి గురైన బ్రిటిష్ ప్రభుత్వం ఆయన పత్రికను నిషేధించింది . ఆ రోజుల్లో బ్రిటిష్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు చాలా ఎక్కువగా ఉండేవి. ఆగస్టస్ హికీ వాటిని ఎండగడుతూ తన పత్రికలో రాయటంతో నిషేదానికి గురైనాడని 1940లో మార్గరిటా బార్న్స్ రాసింది తన ప్రఖ్యాత రచన 'ది ఇండియన్ ప్రెస్: ఏ హిస్టరీ ఆఫ్ ది గ్రోత్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్ ఇన్ ఇండియా' అనే పుస్తకంలో. ఆశ్చర్యమేమిటంటే ఆగస్టస్ హికీ నిషేధం ఎదుర్కొనే నాటికే భారత దేశంలో బ్రిటిష్ అనుకూల , వ్యతిరేక పత్రికలు ప్రభుత్వానికి (భారత స్వాతంత్యం కోరుకొనేవి) వచ్చేశాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలుగు రాష్ట్రాల్లో ఈ నాడు ఏ పరిస్థితి నెలకొని ఉందో అదే పరిస్థితి సుమారు 240 సంవత్సరాల క్రిందే ఈ దేశంలో నెలకొని ఉందన్నమాట.

అయితే ఆగస్టస్ హికీ ఒక రకంగా ద్వంద్వ నీతి గలవాడన్న అభిప్రాయం భారతీయ పత్రికా చరిత్ర కారుల్లో ఉండేది. ఆగస్టస్ హికీ బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను, అవినీతిని, అక్రమాలను ఎండగట్టినా భారతీయ స్వాతంత్రోద్యమానికి, భారతీయులెదుర్కొంటున్న దమనకాండకు, దోపిడీకి అనుకూలంగా వ్యవహరించలేదన్నది ఆ ఆరోపణకు ప్రముఖ కారణం. అందువలన ఎన్. రామ్ (హిందూ దినపత్రిక మాజీ సంపాదకులు) జేమ్స్ సిల్క్ బకింగ్ హమ్ (1786–1855) నే తొలిసారి భారతీయ స్వాతంత్ర్య కాంక్షను బ్రిటన్ కు తెలియ చెప్పిన పత్రకారుడిగా గుర్తించారు. బకింగ్ హమ్ 1818–1823 మధ్య 'కలకత్తా జర్నల్' నడపటమే గాక ఈస్ట్ ఇండియా కంపెనీని ఎండకట్టడం, భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను బహుముఖంగా ప్రకటించటం వలన ఈయన్ని భారతదేశం నుండి బహిష్కరించారు. ఈ విషయాలను ఎన్ . రామ్ 'జర్నలిజం ఇన్ ఇండియా: ఫ్రమ్ ది ఎర్లియస్ట్ టైమ్స్ టు ది ప్రెసెంట్ డే' పుస్తకానికి రాసిన ముందు మాటలో పేర్కొన్నారు. వీటిని ఇక్కడ పేర్కొనడానికి కారణం సుమారు రెండు వందల నలభై సంవత్సరాల క్రితమే పత్రికల్లో 'నిశ్పాక్షికత' అనే విషయంపై చర్చ లేదు. బ్రిటీషువారు నడిపిన పత్రికలోనే ఒకవర్గం బ్రిటిష్ ప్రభుత్వ తప్పులను ఎండగడుతూ, భారత స్వాతంత్రోద్యమాన్ని పట్టించుకోకపోతే, మరో వర్గం బ్రిటిష్ తప్పులను, భారత స్వాతంత్రోద్యమ ఆకాంక్షలను గుర్తించటం చేసేవి. అయినా రెండు రకాల పత్రికలూ నిషేధానికి గురవటం, ఆనాడు బ్రిటిష్ వారు తెచ్చిన 'సెడిషన్'(దేశద్రోహం) చట్టం నేటికీ మన ప్రభుత్వాలు అమలులో పెట్టి అడపా దడపా పత్రికలపై, రాజకీయ నాయకులపై, ఉద్యమ కారులపై ఉపయోగించటం మనం చూస్తూనే ఉన్నాం.

ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా (రెండురోజుల క్రితం చనిపోయిన విప్లవ ఉపాధ్యాయుడు), ఆంధ్రప్రదేశ్ విప్లవ రచయిత వరవర రావుపై గత బీజేపీ ప్రభుత్వం, ఆంధ్ర జ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణన్, టివీ 5 చైర్మన్ బి. ఆర్. నాయుడుపై, నాటి ఎం పి రఘురామకృష్ణం రాజుపై జగన్ ప్రభుత్వం మూడు వందల సంవత్సరాల క్రితం 'సెడిషన్' చట్టాన్ని వినియోగించింది గత అయిదేళ్ల కాలంలో. మూడు శతాబ్దాలానంతరం కూడా మనం ఇంకా బ్రిటిష్ కాలం నాటి నియంతృత్వ భావజాలానికి ఎంత దగ్గరగా ఉన్నామో ఊహించవచ్చు. అంతేగాదు. పరువు నష్టం దావానుపయోగించి రాహుల్ గాంధీని లోక సభనుంచి పదవిచ్యుతుడిని చేయడానికి బీజేపీ, నరేంద్ర మోడీ కలిసి ఆడిన అనాగరిక నాటకం అర్థం కాని వారిని ఏమనుకోవాలి?

ఈ క్రమంలోనే తర్వాత కాలంలో భారతదేశంలోకి అడుగుపెట్టిన 'టైమ్స్ అఫ్ ఇండియా', 'స్టేట్స్ మాన్ ' దిన పత్రికలు పూర్తిగా బ్రిటిష్ వారికి అనుకూలంగా 'ప్రోరాజ్' పత్రికలుగా ఉండేవి. 'ఆనంద్ బజార్ పత్రిక', 'ది హిందూ', బ్రిటిష్ వారికి పూర్తిగా వ్యతిరేకంగా ఉండేవి. ఈ కాలంలో పత్రికల ప్రధాన లక్ష్యాలు ప్రభుత్వాలకు, పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రవర్తిల్లటమే. ఇందులో కొన్ని 'మితవాద', కొన్ని 'అతివాద' పత్రికలుండేవి. ఏదిఏమైనా నాడు పత్రికలంటే ఉన్న అవగాహనేమిటంటే 'ప్రభుత్వ వ్యతిరేక' విమర్శలను ఆదరించి, ప్రోత్సహించే పత్రికాలన్న అభిప్రాయం చదువుకొన్నా ప్రజల్లో ఉండేది. ఈ మితవాద, అతివాద పత్రికా రచనలను ఆధునీకరిస్తూ జర్నలిజం మేధావులు మధ్యేవాదముగా పత్రికల పాత్రను 'నిర్మాణాత్మక, ప్రతిపక్షం' గా వర్తిల్లాలని సూచించారు. అంటే 'విమర్శ ' విమర్శ కోసం' కాకుండా ప్రభుత్వానికి కావలసిన

ప్రజాహిత , సలహా, సూచనల రచనలుగా పత్రికా భాష , శైలి, రచనా సాగాలని ఆశించారు. కానీ , ప్రజా స్వామ్యంలో నాయక బలం, సిద్ధాంత బలం, ప్రజాదరణ పై అధికారం లోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ పత్రికల 'నిర్మాణాత్మక ప్రతిపక్ష ' పాత్రను తిరస్కరించవచ్చు. చాలాసార్లు తిరస్కరించాయి కూడా. ఇది నెహ్రూ కాలం నుంచీ నేటి మోడీ దాకా, దామోదరం సంజీవయ్య కాలం నుంచీ నిన్న మొన్నటి జగన్ పాలన దాకా సాగిన నాటకమే కదా.

ఇలాంటి పరిస్థితులు భారత దేశంలో తరుచూ నియంతృత్వ పోకడలకు దారిచూపాయి. పేరుకు ప్రజాస్వామ్యమే కానీ, ఒక సారి ప్రభుత్వంలోకి వచ్చాక 'నియంతృత్వం ', 'అణచివేయడం' (ఫాసిజం) వంటివి కరతలకమలాలుగా మారాయి. కాబట్టి పత్రికలుగూడా 'నిర్మాణాత్మక, ప్రతిపక్ష' పాత్ర పోషించడం వలన ఏమీ ఉపయోగం లేదని త్వరలోనే గ్రహించాయి. ఎందుకంటే నెహ్రూ కాలంలో కాంగ్రెస్ దేశం మొత్తాన్ని ఏకచత్రాధిపత్యంగా పాలించింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలు కావటం , నెహ్రూ ఒక 'వర్క హోలిక్' అవటం వలన ప్రతిపక్షాలనేవి లేకుండా పోయాయి. అదే సమయంలో పత్రికలు నెహ్రూని ఏకపక్షంగా పొగడటం ప్రారంభించాయి. ఫ్రాంక్ మొరెస్ (టైమ్స్ అఫ్ ఇండియా సంపాదకుడు), తొలి గవర్నర్ జనరల్ గా పనిచేసిన రాజా గోపాల చారి వంటి వారుకూడా నెహ్రూని ఏకపక్షంగా పత్రికలు శ్లాగించటాన్ని ఈసడించుకొన్నారు. ఈ విషయాలను ప్రముఖ జర్నలిజం రచయిత రంగస్వామి (2001) లో తన పుస్తకం 'జర్నలిజం ఇన్ ఇండియా ఫ్రమ్ ది ఎర్లీస్ట్ టైమ్స్ టు ది ప్రెసెంట్' అనే పుస్తకంలో గ్రంథస్తం చేశారు. నెహ్రూ కాలంలో వచ్చిన పత్రికల్లో 'ఇండియన్ ఎక్స్ప్రెస్', హిందూస్తాన్

టైమ్స్' వంటివి నెహ్రూ పాలనపై నిర్మాణాత్మక విమర్శ చేస్తే , 'టైమ్స్ ఆఫ్ ఇండియా', 'స్టేట్స్ మాన్','పయనీర్' వంటి పత్రికలు పూర్తిగా నెహ్రూ పక్షం వహించాయి.

ఇక్కడో విషయం అనివార్యంగా గ్రహించాలి. స్వాతంత్రోద్యమం నడిచే కాలంలోనే దేశ వ్యాప్తంగా అనేకమంది నాయకులు , రచయితలు, కవులు, సైద్ధాంతికులు అనేక పార్టీలు , ఆ పార్టీ సిద్ధాంతాలను వివరించే పత్రికలు స్థాపించారు. వారిలో కొందరు జైళ్ళకెళ్లారు. కొందరి పత్రికలు మూతపడ్డాయి. కొందరు కాంగ్రెస్ లాంటి పెద్ద పెద్ద పార్టీలలో తమ పార్టీలను విలీనం చేశారు. స్వాతంత్ర్య అనంతరం కూడా ఈ విధంగా పార్టీలు పత్రికలను స్థాపించాయి. అవి అధికారమే లక్ష్యంగా పత్రికలను నడిపాయి. కోకొల్లలుగా అబద్ధాలు అల్లుతూ అవతల రాజకీయ పార్టీలపై బురద చల్లుతూ, వ్యక్తిగత దూషణలకు కూడా వెనుకాడకుండా నేటికీ నడుస్తున్నాయి. దక్షిణాదిన తమిళ నాడులో ఈ విధమైన పాత్రికేయ విష సంస్కృతి (కల్చర్) తొలుత ద్రవిడ మున్నేత్ర కజగం పార్టీ ఆరంభించి నాటి ముఖ్యమంత్రి జయలలితను లైంగికంగా, శారీరకంగా వికృతంగా వర్ణిస్తూ ఒక విద్వేష ప్రచారం సాగించింది. ఇది ఎంత వరకూ వెళ్లిందంటే చివరకు జయలలిత, కరుణానిధి ఒకరినొకరు జైల్లో పెట్టుకొనే స్థితికి వెళ్ళింది. ఈ కాలంలోనే నేర సంస్కృతి రాజకీయాలకు ఆలంబన అయింది. దక్షిణాన తమిళనాడు, ఉత్తరాన బీహార్ ఈ హీనమైన రాజకీయ సంస్కృతిలో భాగం అయినాయి. ఉత్తరాదిన బీహార్ భూస్వామ్య సంస్కృతితో తమకు అడ్డువచ్చిన వారిని ప్రైవేట్ సైన్యంతో కాల్చి చంపే దుర్మార్గ సంస్కృతికి తెర లేపింది. అందుకు వేదికగా లాలుప్రసాద్ యాదవ్ పత్రిక కూడా నడిపే వాడు. అగ్ర కులాలను వేటాడే వాడు లల్లూ ప్రసాద్

యాదవ్ తన పాలనలో . చివరకు పశువుల దాణా కేసులో అవినీతికి పాల్పడి, జైలు పాలయ్యాడు. ప్రస్తుతం రైల్వేమంత్రిగా చేసిన అక్రమాలకు విచారణ ఎదుర్కొంటున్నాడు.

ఈ నేపథ్యం నుంచీ వచ్చినదే రాజ్యరంగంలోని ఆర్టికల్ 19 (1). స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన రాజ్యాంగకర్తలు పత్రికాస్వేచ్ఛని కేవలం భావప్రకటనా స్వేచ్ఛకిందనే పరిగణించారు. అమెరికా రాజ్యంగంలో మొదటి ఎమెండ్మెంట్ ద్వారా పత్రికలకు, ప్రసార మాధ్యమాలకు కలిపించిన ప్రత్యేక ప్రతిపత్తి మన రాజ్యాంగం కలిపించలేదు. దీనిని బట్టి ఒక పత్రికాధిపతి పత్రికపెట్టి ఒక స్థాయికి వచ్చిన తరువాత రాజకీయ పార్టీ స్థాపించవచ్చు. లేక ఒక రాయకీయ పార్టీతో కలిసి పాలనలో భాగస్వామి కావచ్చు. రాజకీయ పార్టీపెట్టిన తరువాత కూడా ఒక పత్రికను, టెలివిషన్ ను స్థాపించవచ్చు. ఇదంతా ఆర్టికల్ 19 (2) కు లోబడి చేసుకోవచ్చు.

జాతీయ స్థాయిలో 1970 ప్రాంతాలలో ఇండియన్ ఎక్స్ప్రెస్ అధినేత రామనాథ్ గోయెంకా ను 'కింగ్ మేకర్' అని అనేవారు. ఆయన పత్రికల్లో వచ్చిన రాతలతో ఎన్నోసార్లు రాష్ట్ర ప్రభుత్వాలు కూలిపోయాయి. ఆఖరికి ఇందిరా కూడా 'ఎమర్జెన్సీ' పెట్టి రామనాథ్ గోయెంకాను చెర బట్టి హింసించింది. చివరకు తన ప్రభుత్వాన్ని కోల్పోయి నడి రోడ్డు పై నిల్చుంది. మరి అదే 1970లో వచ్చిన ఆ పత్రికాధిపతి చేసిన నేరం ఏమిటి? ఆయన్ను అదేపనిగా వీడియోలలో, పుస్తకాలలో, యు ట్యూబ్ లలో విమర్శించే వాళ్ళు జర్నలిజం గురించి కనీసం అవగాహన ఉన్నవాళ్ళా? కేవలం పత్రికల్లో పనిచేసినంత మాత్రాన, టి వి లో ఎంకోరింగ్ చేస్తేనో జర్నలిస్టులు అయిపోరు. కానీ, ఇవ్వాళ జర్నలిజం చరిత్ర, సిద్ధాంతాలు కూడా చదవని వాళ్ళు జర్నలిజం, నిశ్పాక్షికత, బాలన్స్

అంటూ ఏవేవో వాళ్లకు కూడా స్పష్టత లేని పదజాలం, భావ జాలం గురించి మాట్లాడటం చాలా శోచనీయం.

ఇకపోతే 'నిశ్పాక్షికత', 'బాలన్స్' రాత, కోతలు 'జర్నలిజం'కు గీటురాయి గా భావించే పెద్దలు తమ వ్యాఖ్యలకు ఏ సిద్ధాంత మూలాలు ఏమైనా జర్నలిజంలో ఉన్నాయా అని ఏనాడు పరిశీలించి ఉండరు. నిజానికి ఆ నేపథ్యం పరిశీలిస్తే కూడా జర్నలిజంలో 'నిశ్పాక్షిక' రాత కోతలు చేయాలని ఏ జర్నలిజం సిద్ధాంత కర్తా ఏ నాడు సిద్ధాంతీకరించి లేదు. 'ది మీడియా అండ్ పొలిటికల్ ప్రాసెస్' అనే సైద్ధాంతిక గ్రంధాన్ని రచించిన ప్రముఖ ఆస్ట్రేలియన్ ఆచార్యుడు ఎరిక్ లౌ 'నిశ్పాక్షికత'పై తన అభిప్రాయాలను నిర్ద్వంద్వముగా ప్రకటించాడు. పత్రికలు , ప్రసార మాధ్యమాలలో వచ్చే వార్తలు గాని, విశ్లేషణలు గాని 'నిష్పాక్షికంగా' ఉండే అవకాశమే లేదని వారు తమ పరిశోధనలలో తేల్చారు. 'జర్నలిజం సమాజానికి అద్దం లాంటిది. సమాజం ఎలా ఉంటే అలానే అద్దంలో చూసి వర్ణించవచ్చు' అని చాలా మంది అంటుంటారు. 'ఉన్నది ఉన్నట్టుగా' చెప్పటం జర్నలిజం ద్వారా సాధ్యమని 'నిశ్పాక్షిక జర్నలిజం' గురించి మాట్లాడే వారు వాదిస్తారు కూడా. కానీ, ప్రతిమనిషి మనస్సు ఒక ప్రిజం (పట్టకం) లాంటిది. ఒక్కక్కరి మనస్సులోని ఈ ప్రిజం ఒక్కో 'రీతిలో' ప్రతిఫలిస్తుంది. జర్నలిజం వృత్తిలో ఉండే జర్నలిస్టులు కూడా తమ వృత్తిలో పొందే అనుభవాలు, చూసే దృశ్యాలు తమలోకి పోయినతరువాత తమ మనస్సు లోని ఆ ప్రిజంలో వక్రీకరణ చెందుతాయి. అప్పడవి తమ పూర్వానుభవాలతో సంయోగం చెంది రాతల రూపంలో, రచనల రూపంలో ప్రకటితమవుతాయి బాహ్య ప్రపంచంలోకి. దీనికి కారణం 'కంస్ట్రక్టివిజం' అనే ఒక ఎపిస్టమోలోజికాల్ ప్రక్రియ. ఇది ప్రతి

వ్యక్తిలో విద్యార్థి దశ నుంచి ప్రకటితం అవుతుంటుంది. వ్యక్తి మేధస్సు, పూర్వానుభవం, రాజకీయ ఆపేక్ష, ధనార్జనా లక్ష్యం ం ఇలా ఎన్నో ఈ నిష్పాక్షికతను ప్రభావితం చేస్తాయి.

అందుకు బదులు పశ్చిమ దేశాలలో 'ట్విస్ వెరిఫికేషన్ ' అనే ఒక రిపోర్టింగ్ ప్రిన్సిపుల్ ను జర్నలిస్టులు వృత్తిపరంగా తప్పక పాటించేలా శాసనాలు చేశారు. కానీ, మనదేశంలో ఆ నియమం ఇంతవరకూ ఎవరూ అమలు చేయటంలేదు. ఒకప్పటి ప్రముఖ హిందూ కరస్పాండెంట్ జి కే రెడ్డి ఈ విషయంలో తొలి అడుగు వేసిన వ్యక్తి. ఆయన ఒక సంఘటనకు సంబంధించి రెండు వైపుల వాదనలు సేకరించి, తను దేనితో ఏకీభవిస్తున్నాడో అది స్పష్టంగా రాసే వాడు. దురదృష్టవశాత్తు ఈ విధమైన రిపోర్టింగ్ కూడా ఆయనతోనే గతించింది. ఇటువంటి జర్నలిజం పద్ధతులను సమగ్రంగా అధ్యనం చేసిన తరువాత 'నిష్పాక్షికత', 'అబ్జెక్టివిజం' అనేవి ప్లాటో గృహలో 'బందీల' మనస్తత్వం లాంటిదని ఎరిక్ లౌ తన సైద్ధాంతిక గ్రంధంలో వివరిస్తారు. 'రిపబ్లికన్' అనే పుస్తకంలో ప్లాటో ఈ 'బందీ' ల గురించి వివరిస్తారు.

(రచయిత విశ్రాన్త జర్నలిజం ఆచార్యులు. ఈ రంగంలో పలు పరిశోధనా పత్రాలను ప్రముఖ విదేశీ జర్నల్స్ లో ప్రచురించారు)

(అక్షరాంజలి మాసపత్రిక డిసెంబర్ 2024)

యూట్యూబు నియంత్రీకరణ / క్రమబద్ధీకరణ అవసరమా? కాదా?

యూట్యూబు అనేది ఒక మల్టీమీడియా ప్లాట్‌ఫార్మ్. 2005లో వచ్చిన ఈ మల్టీమీడియా ప్లాట్‌ఫార్మ్ త్వరలోనే ఒక మీడియా శక్తిగా పరిణమించింది. దీని ప్రధాన లక్ష్యం విద్య, వినోదం పంచటం. అణగారిన ప్రజల గొంతు వినిపించటం, సమాజంలో జరుగుతున్న దుర్మార్గాలను, దుష్టత్వాలను బయటపెట్టడం. ఈ విషయంలో ఇది సామాన్యుడి మూడోకన్నులా వ్యవహరించిందనటంలో సందేహంలేదు. కానీ, రాను, రాను ఆచరణలో ఇది ఒక భయానక దృశ్య శక్తిగా మారింది.

చైనా, ఉత్తర కొరియా, కొన్ని అరబ్ దేశాలు వంటి దేశాలు మినహాయిస్తే మిగతా ప్రపంచంలో ఏవిధమైన నియమ నియంత్రణలు లేకుండా విచ్చలవిడిగా అందరూ వాడుతున్న ఈ యూట్యూబ్ సమాజంలో వ్యక్తి హుందాతనానికి, వ్యక్తి గోప్యతకు కూడా భంగం కలిగించే స్థాయికి వెళ్ళిపోయింది. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ లకు ఉన్న సకారా, నకార గుణాలు దీనికీ ఉన్నా, దృశ్య మాధ్యమం కూడా కావటం దీనికున్న అదనపు బలం.

ఇందులో ఒక వర్గం, ఒక వయస్సు వారు చూడకూడని, లేక అలాంటి వారి మనస్సుపై ప్రభావం చూపే వీడియోలు కూడా పెడుతున్నారు. అంతేగాదు, యూట్యూబులో పెట్టే వీడియోలకు ఎంతమంది చూపరులు ఉంటున్నారన్న దానిపై ఆధారపడి వాటికి వాణిజ్య ప్రకటనలు కేటాయిస్తుండటం, అలా ఒక్కొక్క వీడియోపై ఎన్ని ప్రకటనలు వస్తే అంత ఆర్థిక వనురును ఆ వీడియో పెడుతున్న వారికి అందచేయటంతో యూట్యూబు ఒక ధనార్జన ప్లాట్ఫార్మ్ గా మారిపోయింది. ఈ నేపథ్యంలో యూట్యూబ్ ప్రధాన లక్ష్యాలైన విద్య, వినోదం ఓడిపోయి,

వాటిస్థానే రాక్షత్వం, కర్కశత్వం, దుష్టత్వం, సామజిక విద్వేషం, మోసం, దగా, హింస ప్రేరేపించే వీడియోలు, అసభ్యకరమైన, జుగుప్సకలిగించే వీడియో పోస్టులు యువత పెడుతున్నారు.

అగ్నిదేవుడికి వాయుదేవుడు తోడైనట్టు రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రధాన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు గూడా యూట్యూబును తమ మార్కెటింగ్ వేదికగా మార్చుకోవటంతో ఇక తిట్లు, బూతులు బుల్లెట్స్ రూపంలో పెడుతూ వీడియోలో లేని విషయాలు ఉన్నట్లు చూపిస్తూ మానవాళి ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారు. ఈ సామజిక మానవ విలువల హననం మనిషిని మనిషిగా బ్రతకనీయటం లేదు. ప్రతిదానిని వంకరగా, వక్రీకరించి చూసేలా మనిషిని మార్చేస్తున్నది. ఈ నకారాత్మకత ఏ స్థాయికి ఎదిగిందంటే చివరకు అతి దగ్గరి మానవ సంబంధాలైన తల్లి, దండ్రి, అక్క, చెల్లెలు, వదినలు, పిన్నమ్మ (పినతల్లి), అత్తయ్య, పెద్దమ్మ వంటి పవిత్రమైన సంబంధాలనుకూడా జారులుగా, వ్యభిచారులుగా వర్ణిస్తున్నస్థాయికి దిగజారాయి. ఇటువంటి పవిత్ర సంబంధాలను దిగజార్చేలా బూతుకధలు అల్లి వాటి ఆడియోను యూట్యూబ్లో పెడుతున్నారు. ఇంత చేటు పైశాచిక నకారాత్మకత భవిష్యత్తులో 'మానవత్వానికి' అసలు మనుషులమధ్య స్థానం మిగులుస్తుందాన్న సందేహం కలిగించక మానదు.

సరిగ్గా ఈ సమస్యల్నే కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ సామాజిక ఆడిట్ విభాగం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఫలితంగా కేంద్రప్రభుత్వం యూట్యూబ్ నియంత్రణకు కొన్ని మార్గదర్శకాలు, కొత్త నియమ నిబంధనలు ఒక చట్టం రూపంలో తీసుకురావాలని నిశ్చయించింది. అయితే, దానిని పార్లమెంట్లో ప్రవేశపెట్టేందుకు పూర్వం

కేంద్రంతో సఖ్యతగా ఉన్న ఎంపికచేసిన కొంతమంది నిపుణులకు, జర్నలిస్టులకు ఈ ఏడాది ఆగస్టు/సెప్టెంబర్ మాసంలో పంపింది. ఈ విషయమై మీడియా సంఘాలు మండిపడ్డాయి. సంబంధం ఉన్న అన్ని మీడియా సంస్థలతో, జర్నలిస్టులతో, సాంకేతిక నిపుణులతో కాకుండా తమకు రాజకీయంగా అనుకూలురైన కొంతమందికే ఈ ముసాయిదా పంపటం 'భావ ప్రకటన'పై కాషాయీకరణ ముద్రవేసే ప్రయత్నంగా భావించారు కేంద్రానికి వ్యతిరేకులైన వారు.

ప్రస్తుతం కేంద్రం కమ్యూనిస్టు భావజాలం, మావోయిస్టు భావజాలం, కాంగ్రెస్ భావజాలం అన్నింటినీ ఒకే గాటన కట్టేసి చూస్తుంది. చాలామంది మావోయిస్టు భావజాలం ఉన్నవారు కాంగ్రెస్ లో చేరి, ఆ గొడుగు నీడలో 'అర్బన్' నక్సలిజంను ప్రోత్సహిస్తున్నారని, అందులో భాగంగానే 'ఆధునిక భావజాలం' పేరుతో 'విచ్చలవిడి' స్వేచ్ఛను, దేశ సమగ్రతకు, సమైక్యతకు విచ్ఛిన్నం కలిగించే వీడియోలను యూట్యూబ్ లో ఆవహానిస్తున్నారని కేంద్రం వాదిస్తున్నది.

అసలు సమస్య కేవలం ఏవో కొన్ని 'భావజాల' వీడియోలు మాత్రమే యూట్యూబ్ లో ఉండటం కాదు. భారత పౌరులకు అసలు ఏ వీడియో పబ్లిక్ వీక్షణానికి పెట్టవచ్చో, పెట్టగూడదో నన్న విచక్షణ లేకపోవటం. తమ తల్లి దండ్రులు, బంధువులు చనిపోతే వారిని దహనం చేసే వీడియోలను కూడా యూట్యూబ్ లో పెట్టటం, ఆ వీడియోలలో వారి శరీరం నల్లగా మారి దగ్ధం అవుతూ, మెలితిరిగి పోతుంటే కూడా అలానే చూపటం. ఇలాంటి వీడియోలను పెట్టటం ద్వారా ఏ సందేశాన్ని, ఏ వినోదాన్ని ప్రజలకు అందిస్తున్నారో ఆ ట్యూబర్లు సమాజానికి చెప్ప గలరా? సాధారణంగా టూరిజం వ్లాగర్స్ పవిత్ర పుణ్య క్షేత్రాలను, పురాతన

రాజ కోటలను, నదులను, తటాకాలనూ, పక్షి, వన జంతుజాలాలను, ప్రయాణాలను, విభిన్న స్థలాలను వీడియోల రూపంలో పెడతారు. కానీ, కాశీ లాంటి క్షేత్రంలో అఘోరాల వికృత చర్యలను, శవాలపై పూజలను, కాలుతున్న మానవ మాంసం తినటం, మృత శరీరాలను నదిలో ముంచి, తెచ్చి కట్టెలపై పెట్టి నిప్పంటించినప్పటినుంచి నల్లగా కాలి ముద్ద పోయేదాకా చూపటం మానవ శరీరాలను అవమానించటం కాదా? ఇలాంటి వీడియోలు యూట్యూబు లో ఉండటం, వాటిని పిల్లలు, పెద్దలూ వీక్షించటం వారి మనస్సుపై తీవ్ర ప్రభావం చూపించావా?

ఇక్కడ ఓ ప్రశ్న తెలెత్తుతోంది. అంత చూడలేని వారు యూట్యూబ్ లో ఉండే రకరాల ఇతర విషయాలు చూడవచ్చుగదా? ఇలాంటి వీడియోలనే   ఎందుకు చూడటం? ఇది అంత సరైన ప్రశ్న గాదు. కొందరు పగలు ధైర్యంగా చూస్తారు. రాత్రికి కాగానే అవి గుర్తుకొచ్చి భయపడతారు. కొందరు తమకు భయమేది లేదని బింకానికి పోతారు. కానీ, వాస్తవానికి చాలా పిరికివారై ఉంటారు లోలోన. చూడటానికి ఇవి ఇతర విషయాలతో బాటే హెూంపేజిలో అందుబాటులో ఉండటంవలన సహజ ఉత్సుకత మనిషిని ప్రేరేపించవచ్చు. మనిషి చూడవచ్చు. ఆ తరువాత మనిషిలోని అచేతన, చేతన మధ్య సంఘర్షణ తీవ్రమై మనిషి అనుకోని మానసిక ఉన్మాదానికి లోను కావచ్చు. మనిషి విషయంలో అందరూ జ్ఞప్తికి ఉంచుకోవాల్సిన సాధారణ మానసిక సూత్రం ఏమిటంటే ఏ మనిషికి తన మనస్సుపై పూర్తి అవగాహన ఉండదు. ఇది విశ్వవ్యాప్తమైన సమస్య.

అలాగే మానసిక శాస్త్రవేత్తలకు కూడా ఏ మనిషి మనస్సుపైన పూర్తి అవగాహన ఉండదు. ఇప్పటివరకూ మానవ పరిశోధనకు పూర్తిగా

అంతుచిక్కని విషయం మానవ మేధస్సు/మనస్సే. అలాంటప్పుడు వయస్సుతో నిమిత్తం లేకుండా, సాధారణ మానవాళి (నాన్ స్పెషలిస్ట్) చూడకూడని విషయాలు అన్న ఒక సార్వత్రిక వర్గంలో మనిషి శరీర దహనం, మానవ శరీర పోస్ట్ మార్టం, మానవశరీర ఆపరేషన్ వంటివి చేర్చటం చాలా అవసరం. వాటిని స్పెషలిస్ట్ అర్హత లున్న వారు మాత్రమే చూసేలా యూట్యూబ్ కొన్ని ఫైర్ వాల్స్ ఏర్పాటుచేయాలి. వాటిని సంస్థ ఐడి తోనో, లేక వృత్తి గుర్తింపు ఇచ్చే సంస్థ ఐడి తోనో అనుసంధానం చేసేలా ఆ ఫైర్ వాల్స్ ఉండాలి. ఆయా రంగాలలో వృత్తినిపుణులకు విద్యకోసం అందించే వీడియోలు విడిగా ఆయా సంస్థలు సృష్టిచుకొని ప్రత్యేక ప్లాట్ ఫార్మ్ లో పెట్టుకొని చూడాలే తప్ప సాధారణ మనుషులకు (ఆడ, మగా, పిల్లా, పెద్దలకు కాకుండా) అందుబాటులో లేకుండా చూడాలి.

ఇటీవల కొన్ని నేర వృత్తాంతాలు పత్రికల్లో చదువుతుంటే గుండె గుభేలు మంటోంది. కొందరు హత్యలు చేసేముందు, ఆత్మ హత్యలు చేసేముందు, దోపిడీ, హత్య వంటి దండుపాళ్యం నేరాలు చేసేముందు యూట్యూబ్ చూసి ఆ తరహా లోనే చేస్తున్నారని ఆ వార్తల సారాంశం. ఇంతగా దిగజారిన సమాజానికి ఇటువంటి ప్లాట్ ఫార్మ్ లు తోడైతే ఇంకేమన్నా ఉందా? ముఖ్యంగా 18 సంవత్సరాలు కూడా దాటని వారి చేతిలోకి మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాక ఈ తరహా నేరాలు, ఘోరాలు పెరిగిపోయాయి అని అనేక నివేదికలు తెలియ జేస్తున్నాయి. పెద్దా, చిన్నా అంతరం లేకుండా ఎదో ఒక సాకుతో ఇవ్వాళా ఒక్కక్కరి దగ్గర రెండేసి మొబైల్ ఫోన్లు ఉంటున్నాయి. ఈ ఫోన్ల వాడకం పై ప్రభుత్వ నిఘా సూన్యం. వాటిలో పోర్న్ సినిమాలు, నిషేధిత వెబ్ సైట్స్ అందుబాటులో ఉంటున్నాయి. పాశ్చాత్య దేశాలలోని అనేక విచ్చలవిడి

వెబ్సైట్లను ఇక్కడ చూసే అవకాశం లేకుండా చూడాలి. ఈ వెబ్ లను నడుపుతున్నవారు మెక్సికో, బ్రెజిల్, లాటిన్ అమెరికా, యూరప్ వంటి దేశాలలో గంజాయి, పెతిడిన్ వంటి మాదకద్రవ్యాలను మత్తుగా వినియోగించడానికి రకరకాల మార్గాలను చూపుతాయి. వాటిని ఇక్కడ యువత సొంతంగా తయారీ చేసి కాలేజీలకు, వ్యభిచార గృహాలకు, హాస్టళ్లకు, రిసార్టులకు సరఫరా చేస్తున్నారు.

ఇవన్నీ సమస్యకు ఒక వైపు అయితే మరో వైపు పచ్చి బూతు భాషను రాజకీయ భాషగా చెలామణి చేస్తూ పెడుతున్న యూట్యూబర్లు. విశ్లేషణల పేరిట యూట్యూబ్ చానెల్స్ తెరచి తమకు నచ్చని రాజకీయ నాయకులపైనా, మతాలపైనా, కులాలపైనా, స్త్రీలపైనా భయంకర విద్వేష విషం చిమ్ముతున్నారు. ఇందులో పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధాన మీడియాలో వచ్చే వార్తలకు, ఆ టీ వి వాటర్మార్క్ లు తొలగించి, ఆ కంటెంట్ ను తీసుకొని ఎడిటింగ్ చేసి వక్రీకరించేవారు కొందరు. ఇంకా కొన్నిసార్లు మరింత ముదుకువెళ్లి, ప్రధాన మీడియా లో వచ్చే వార్తలు, వాదోపవాదాలను, ఆయా నాయకుల ఫోటోలను మార్ఫింగ్ చేసి వాటికి బూతు బుల్లెట్లు పెట్టి ప్రజల్లోకి వదులుతున్నారు. అదేమంటే అలా చేయటం వలన 'వ్యూయర్స్', ('చూపర్లు') పెరుగుతారని, తద్వారా వారికి అడ్వేర్టైజ్మెంట్స్ పెరిగి, ఆర్థిక ఆదాయం వస్తుందని వాదిస్తున్నారు. స్వయం ఉపాధి కి దీన్నో ప్రత్యామ్నాయ మార్గంగా చూపుతున్నారు. కానీ, ఇలాంటి తప్పుడు పనులుకాకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పథకాల పై వీడియోలు పెడితే ఆ విలువైన సమాచారం ప్రజలకు చేరుతుంది. వారికి అవగాహన పెరుగుతుంది. స కారాత్మక సృజన పైన ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. వాటిమీదనే 'వ్యూస్' (చూపులు) పెంచుకొందామని చూస్తున్నారు. ఇది సమాజానికి

ఎంతమాత్రం శ్రేయోదాయకం కాదు. ప్రాంక్స్ పేరున 'భ్రష్టు' పనులను చేసి ప్రజలను నవ్వించే వీడియోలు ఇవ్వాళ చాలా దర్శనం ఇస్తున్నాయి. ఇవన్నీ మానవుడిని ఈ ఆధునిక యుగంలో ఒక ఆట వస్తువుగా అవహేళన చేసే వీడియోలు.

యూ ట్యూబ్ లో దర్శనమిచ్చే రాజకీయ వీడియోలలో దేశభక్తి పాలు సున్నాకు పడిపోయింది. జాతీయ జెండాకు బహిరంగంగానే అవమానం చేసే వీడియోలు, పాకిస్తాన్, చైనా దేశాలను మనకన్నా గొప్పగా చూపించే వీడియోలు, మన ప్రధాని, ముఖ్యమంత్రులను అనగూడని భాషలో తిట్టే వీడియోలు కూడా మన వాళ్ళే పెట్టటడం చాలా దుఃఖాన్ని కలిగిస్తుంది. గాంధీ మొదలుకొని వీరు వారు అనే తేడా లేకుండా అందరినీ తిట్టడమే లక్ష్యంగా వీడియోలు దర్శనం ఇస్థాయి. వీటిలో చాలామటుకు విదేశాల్లో తయారయి, ముఖ్యంగా అమెరికాలో తయారై అక్కడనుంచే అప్లోడ్ అవుతున్నాయి. అలాంటి వారిపై భారత దేశం లాంటి దేశాలు చర్యలు తీసుకోలేకపోతున్నాయి. అమెరికాలో ఉండి ఇక్కడ మన న్యాయ వ్యవస్థలను, న్యాయమూర్తులను, రాయకీయ నాయకులను, ముఖ్యమంత్రులను, స్త్రీలను, తిట్టినా ఏమి చేయలేక చేష్టలుడిగిన పరిస్థితి నేటి యూట్యూబ్ మనకు కలిపించింది.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చే బిల్లు ఎంతవరకూ ఈ యూట్యూబ్ మాధ్యమం ద్వారా జరిగే అక్రమ సమాచార వ్యాప్తిని అరికడుతుందో చూడాలి.

(అక్షరాంజలి మాసపత్రిక జనవరి, 2025)

తెలుగు తల్లికి పట్టిస్తున్న రాజకీయ మకిలి

'నానాటికి తీసిపెట్టు నాగంభొట్లు' అనే నానుడి చందంగా తెలంగాణా రాజకీయం రూపాంతరం చెందుతున్నట్లు కనిపిస్తోంది. ఇవ్వాళ పిల్లలు తమ తల్లిదండ్రులు తమకు భారమైనారని లబలబ లాడుతూ రోడ్డు మీద పడేసి పోతున్నారు. ఇది సామాన్య ప్రపంచంలో నేటి తల్లి దండ్రులకు పట్టిన దుర్గతి. అది అందరూ చూసి 'అవ్వ' అని నోరు నొక్కుకొని, చూసీ చూడనట్టు, మనకెందుకొచ్చిన గొడవలే అన్నట్టు పోతున్న రోజులివి. అయితే రాజ్య పట్టమహిషి అయిన తల్లికి రాజకీయ నాయకులు పట్టిస్తున్న దుర్గతి కూడా చాలా వింతగా ఉంది. కొందరు ఈ తల్లి గురించి మాట్లాడే మాటలు వింటే అసలు 'ఆ తల్లి వీటన్నిటినీ ఎలా భరిస్తున్నదా?' అని అనిపిస్తుంది.

తెలంగాణా ఉద్యమం రాకపూర్వం ఉమ్మడి రాష్ట్రంలో మనందరికీ భాషా పరంగా ఒకరే తల్లి ఉండేవారు. ఆమెను 'తెలుగు' తల్లి అని కీర్తించేవారు. తమ అస్తిత్వ ఉనికి కోసమో, రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కలిపించడం కోసమో ం దేనికోదానికని తెలంగాణా ఉద్యమాన్ని ఒకదానిని కల్వకుంట్ల చంద్రశేఖర రావు లేవదీశాడు. మొదట్లో ఇదేమంత పుంజుకోలేదు, కానీ క్రమంగా తెలంగాణా ప్రజలు ఉమ్మడి రాష్ట్రంనుంచీ విడిపోవడానికే సిద్ధపడ్డట్టు ద్యోతకమై, ఉద్రిక్తమైంది. ఈ తరుణంలో కేసీఆర్ ఉపయోగించిన భాష కీలకమైంది. ఉద్యమం ముసుకులో ఏమైనా మాట్లాడవచ్చు అనే కొత్త రాజనీతికి తెరలేపాడు కేసీఆర్. ఆ క్రమంలోనే కేసీఆర్ అన్న మాటలు ఒకసారి గుర్తు చేసుకొందాం.

'తెలుగు తల్లేమిటయ్యా. 'తెలుగు' అనేది ఒక భాష. దానికి తల్లి, నాయన ఉంటారా ఎక్కడైనా?'ంఅని ఆయన ధ్వజం ఎత్తాడు. ఈ

ఒక్కదెబ్బతో శంకరంబాడి సుందరాచార్య రాసిన 'మా తెలుగు తల్లి' గీతం /గేయం నివ్వెర పోయింది. ఎంత తెలంగాణా ఉద్యమం చేసినా, ఎంత భౌగోళికంగా ఒక ఉమ్మడి భాగం రెండు భాగాలైనా, ఆ రెండు భాగాలగుండా పూర్తిగా ప్రవహిస్తున్నది కృష్ణా, గోదావరులేగా. మా 'తెలుగు తల్లి' గీతం లో ఆయన రాసిందీ అదే గదా. 'గలగలా గోదారి కదలిపోతుంటేనూ, బీర బిరా కృష్ణమ్మా పరుగులిడుతుంటేనూ బంగారు పంటలే పండుతాయి, మురిపాల ముత్యాలు దొరులుతాయిఽఅన్నది రెండు రాష్ట్రాలకు వర్తిస్తుంది కదా? కానీ, అప్పుడు తెలుగు భాషకు 'తల్లేమిటని?' ఈసడించుకొన్న కేసీఆర్ అనే పెద్దమనిషి రాష్ట్రావతరణ (ప్రత్యేక తెలంగాణా) సాకారం కాగానే తెలుగు భాషకు ఒక తల్లి కావాలని ఎందుకనుకొన్నారో ఎవరికీ అర్థం కాలేదు. దేశానికి భారత మాత ఉండగా మళ్ళీ 'తెలంగాణా తల్లి' ఎందుకో? ఎందుకంటే 'తెలంగాణా ' సెంటిమెంట్ ను అడ్డంపెట్టుకొని 'ఎన్ని దశాబ్దాలైతే అన్ని దశాబ్దాలు ఏలడానికి' పన్నిన వ్యూహం అది అని చిన్నపిల్లాడినడిగినా చెబుతాడు.

ఒకే మనిషి అదే ఉద్యమకాలంలో ఒకమాట, ఆ ఉద్యమం సాకారం కాగానే మరో మాట మాట్లాడారు. సరే! అంతటితో ఆగారా? తెలంగాణా రాష్ట్ర సచివాలయం వద్దనున్న ఉమ్మడి రాష్ట్ర కాలంలో ప్రతిష్ఠించిన 'తెలుగు తల్లి' విగ్రహాన్ని పీకేసి, 'తెలంగాణా తల్లి' అని ఒక రూపంతో ఒక తల్లిని రూపకల్పన చేశారు. అంటే విడిపోయిన రాష్ట్రం 'ఆంధ్ర రాష్ట్రం' అయితే, వారి తల్లి 'తెలుగు తల్లి' అని, విడిపోయిన తెలంగాణా రాష్ట్రం తల్లి 'తెలంగాణా తల్లి' అని ఒక కొత్త 'అస్తిత్వ వాద తల్లి'ని సృజించారు.

అయితే ఇక్కడ 'తెలంగాణా తల్లి' 'భాషా తల్లి' కాదు. 'రాష్ట్ర తల్లి'. అంటే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఉండే 'తెలుగు తల్లి' కి తెలంగాణా రాగానే ప్రమోషన్ వచ్చి 'రాష్ట్ర తల్లి 'అయిపోయింది. అయితే ఇప్పుడు తెలంగాణాలో భాషకు తల్లి లేదు. అక్కడి తెలుగుకు, 'ఆంధ్రా తెలుగుకు' ధాతువులు, క్రియలు, సంధులు, సమాసాలు, వ్యాకరణాలు ౨ అన్నీ వేరేవేరనే వాదనను పట్టుకొచ్చారు. 'తెలంగాణా తెలుగు ఒక మాండలికం. ప్రాంతలను బట్టి మూల భాష నుంచి కొన్ని మార్పులు చేర్పులు వచ్చే భాషన్న మాండలిక వాదాన్ని' తోసిపుచ్చారు.

ఇటువంటి పరిస్థితి దేశంలో ఎక్కడా లేదు. ఉదారణకు హిందీ మాటకొస్తే దేశంలో అత్యాధిక జనాభా హిందీ మాట్లాడతారు. అనేక రాష్ట్రాలకు తమదంటూ ఒక అస్తిత్వ భాష ఉన్నా, హిందీని అధికంగా ఉపయోగిస్తారు. అలా ఉపయోగించినంత మేరకు హిందీ భాష వ్యాకరణం ఒక్కటే. కానీ, భాషా ప్రయోగాలు ప్రాంతాలను బట్టి మారతాయి. అన్ని రాష్ట్రాలు తమ తల్లి భరతమాతని, తమ భాష హిందీ అని అంగీకరిస్తాయి. హిందీలోనూ, రాష్ట్ర స్వీయ అస్తిత్వ భాషలోనూ అధికార వ్యాపారాలు కొనసాగిస్తాయి. కానీ, తెలంగాణాలో మాత్రం, 'భాషకు తల్లి లేదు, రాష్ట్రానికి తల్లి ఉంటుంది'౨అన్న వాదన ఒకటి విన వస్తుంది. అంటే తెలంగాణాకు 'తెలంగాణా తల్లి', భారత మాత' ఒక తల్లి ౨ఇద్దరు తల్లులుంటారు. ఇది విశ్లేషిస్తే విడ్డూరమైన వాదనలా తోచటం లేదు. కానీ తెలంగాణా వారికి వీటితో పని లేదు. నాయకుడు ఏమి చెబితే అదే. అందుకు తగ్గట్టుగా వాదనలు రూపొందిస్తారు. ఆఖరుకు 'బండి తెచ్చి గుర్రం ముందైనా కట్టేస్తారు' కానీ, శాస్త్ర ప్రమాణంగా వాదించరు. 'వారు ఏమి చెబితే అదే శాస్త్రం, ప్రమాణం'. ఇదీ తెలంగాణా బి ఆర్ ఎస్ మేధావుల వరస.

అయిందా? ఇక్కడ ఇప్పుడు రెండు వాదాలు వచ్చాయి. పోనీ తెలంగాణాకు 'తెలుగు తల్లి' బదులు 'తెలంగాణా రాష్ట్ర తల్లే' ఉందను కొందాము. అయితే ఆ తల్లి అస్తిత్వం, రూపం, ఉనికి ఎలా ఉండాలి? అన్నది రాజకీయ మకిలికి రెండో వైపు.

కే సి ఆర్ కుటుంబం తెలంగాణా తెచ్చింది కాబట్టి 'తెలంగాణా తల్లి ' ఎలా ఉండాలన్నది వారే నిర్ణయిస్తారు. వారు నిర్ణయించిందే 'తెలంగాణా తల్లి'. వారెన్నడూ ఓడి పోతామని, పాలనాధికారం వారికి శాశ్వతం కాదని ఉహించి ఉండకపోవటమే ఇందుకు కారణం. దురదృష్టవశాత్తు కే సి ఆర్, ఆయన కుటుంబం ఈ ఎన్నికలలో ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ పాలనకు వచ్చింది. వీరు తామే తెలంగాణా ఇచ్చామని, కాబట్టి తమకు కూడా తెలంగాణా అస్తిత్వ నిర్ణయంలో భాగం ఉందని, తమను ఎంతమాత్రం సంప్రదించకుండా ఏక పక్షంగా 'తెలంగాణా తల్లి' రూపకల్పన , 'తెలంగాణా గేయం' నిర్ణయించారు కాబట్టి, మేమొక్కటి అందరినీ సంప్రదించి ఒక తెలంగాణా తల్లి రూపాన్ని, ఒక గేయాన్ని చేస్తామని సిద్ధం చేశారు. కాంగ్రెస్ వారు ప్రస్తుతం రూపొందించి ప్రతిష్టించిన 'తెలంగాణా తల్లి' విగ్రహం ఒక అందమైన సాధారణ తెలంగాణా స్త్రీ. గ్రామీణ సౌందర్యం, గృహస్తు సౌభాగ్యం, సౌశీల్యం అన్నీ ఉట్టిపడుతుంది. దానిలో ఎంచడానికి లోపం ఏమీ కనపడదు.

కానీ, కే సి ఆర్ కుటుంబానికి పుండుమీద కారం రాసినట్లైంది. అసలే ఓటమి అవమానం తట్టుకోలేకపోతున్న నియంతృత్వ బి ఆర్ ఎస్ నేతలకు ఈ విగ్రహ మార్పు, కూర్పు, దానితోపాటు గేయం మార్పు మింగుడు పడటం లేదు. వెంటనే తెలంగాణా తల్లిని ఒక 'కడుపేద,

బీద' తల్లిగా రూపొందించి తెలంగాణాను అవమార్చారని రాగం అందుకొన్నారు. 'ఆవు, దూడ, గడ్డి' కథలో లాగా కాంగ్రెస్ చేసే వన్నీ తెలంగాణను మరింత బీద రాష్ట్రంగా మార్చేస్తున్నట్టు, అందులో భాగం గానే తెలంగాణా తల్లిని కూడా 'బీద'గా రూపొందిస్తున్నట్టూ ఊరూరా ప్రచారం మొదలుపెట్టారు. అంతటితో ఆగలేదు. ఇప్పుడు ఊరూరా తిరిగి బి ఆర్ ఎస్ వారు తాము పూర్వం రూపొందించిన ధనిక 'తెలంగాణా తల్లి'ని ప్రతిచోటా ప్రతిష్ఠిస్తామని కవిత గారు ప్రకటించారు. కే టీ ఆర్ గారు ఇంకొక అడుగు ముందుకేసి తమ బి ఆర్ ఎస్ మళ్ళీ అధికారంలోకి రాగానే 'కాంగ్రెస్' ప్రభుత్వం ప్రతిష్టించిన 'తెలంగాణా తల్లి' విగ్రహాన్ని తీసేసి తిరిగి ధనవంతురాలైన 'తెలంగాణా తల్లి' (బి ఆర్ ఎస్) విగ్రహాన్ని ప్రతిస్తిస్తారుట. అలాగే సెక్రటేరియట్ వద్ద ఏర్పరచే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తీసేసి, గాంధీ భవన్ పంపించేస్తారుట. అదేమంటే 'రాజీవ్ గాంధీకి తెలంగాణాతో ఏమిటి సంబంధం?' అని వాదిస్తున్నారు.

ఆయన ఒకప్పుడు భారత ప్రధాని కాదా? తెలంగాణా భారత దేశంలో లేదా? అంటే సమాధానం వేరుగా ఉంటుంది. బి ఆర్ ఎస్ కు సంబంధించినంతవరకు తెలంగాణాకు దేశంలోని ఇతర రాష్ట్రాలకు వర్తించేవి ఏమీ వర్తించవు. తెలంగాణా కేవలం భారత దేశంలో ఉండటం ఒక యాదృచ్ఛిక ఘటన. అంతే. ఇతర రాష్ట్రాలలో ఎక్కడా కనపడని భాషా మౌఢ్యం, అస్తిత్వ వాదం కేవలం బి ఆర్ ఎస్, కే సి ఆర్ సొంతం. 'ఒక ప్రత్యేక దేశం - తెలంగాణా' అన్నట్టు అనుక్షణం 'సెంటిమెంట్'చుట్టూ రాజకీయాలు తిప్పుతూ తిరిగి అధికారంలోకి రావాలని వారి వ్యూహంగా కనిపిస్తుంది.

ఈ క్రమంలోనే తెలంగాణా తల్లి చుట్టూ 'ధనిక, బీద' తల్లి రాజకీయ మకిలి అంటించి ఒక తెలుగు 'స్త్రీ' మూర్తిని వెకిలి మాటలతో కించపరుస్తున్నారు. ఇదంతా చూస్తున్నవారికి తెలంగాణా పోతన్నగారి 'గలుగ నేటికీ తల్లుల కడుపుచేటు' అనే పద్యం చివరి చరణం గుర్తు రాక మానదు.

(అక్షరాంజలి మాసపత్రిక ఫిబ్రవరి, 2025)

ఏది నిజం? ఏది కల్పితం? రాజకీయాలలో జరిగే వాస్తవానికి పత్రికల్లో కనిపించే దానికి మధ్య భయంకర అంతరం

దేశంలోనే తెలుగు రాష్ట్రాల రాజకీయాలు మారినంత సంక్లిష్టంగా మరే రాష్ట్ర రాజకీయాలు మారలేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 'సాక్షి' అనే దినపత్రిక అప్పటి కాంగ్రెస్ కరపత్రంగా వెలువడినప్పటినుంచి ఈ రాజకీయ జటిలత ఆరంభం అయింది. రాష్ట్రంలోని అధిక సర్క్యులేషన్ ఉన్న అప్పటి పత్రికలు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా అసత్యాలను రాస్తున్నాయని అప్పటి ముఖ్యమంత్రి (2004-2009) వై ఎస్ రాజశేఖర రెడ్డి తరుచూ అంటుండేవారు. వాటి అసత్యాలను అసత్యాలుగా నిరూపించేందుకు తమకంటూ ఒక ప్రత్యేక పత్రిక ఉండాలన్నది రాజశేఖర రెడ్డి ఆకాంక్ష. ఆ ఆకాంక్షను తీరుస్తూ రాజశేఖర రెడ్డి తనయుడు జగన్మోహన్ రెడ్డి జగతి పబ్లికేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో మార్చ్ 23, 2008న 'సాక్షి' పత్రికను ప్రారంభించాడు. ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేసింది అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డే. అలాగే కాంగ్రెస్ కంఠస్వరంగా ఆరంభమైన 'సాక్షి' దిన పత్రిక రాజశేఖర రెడ్డి హఠాన్మరణానన్తరం, జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ నుంచి విభేదించి బయటికి వచ్చి సొంత పార్టీ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ అని స్థాపించి, ఆ పార్టీకి కంఠ స్వరంగా సాక్షి పత్రిక, టెలివిజన్ ఛానెల్ ను ఏర్పరచారు. ఇది ఈ విమర్శనా వ్యాసం నేపథ్యం.

ఒక వైపు అప్పటి ప్రముఖ దినపత్రిక 'ఈనాడు' తో యుద్ధం చేస్తూనే, నాటి కాంగ్రెస్ కు విపక్షమైన అప్పటి తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పై విషం చిమ్ముతూ రాతలు రాయసాగింది. రెండెకరాల ఆసామి అయిన చంద్రబాబు పై తరువాత కాలంలో లెక్కకు

మించిన అవినీతి ఆరోపణలు వినిపించింది సాక్షి. చంద్రబాబు వందల కోట్ల ఆస్థిపరుడు ఎలా అయ్యాడని, ఆయనకు సింగపూర్ లో హోటల్ ఉందని, ఆయన అక్రమ సంపాదనంతా విదేశీ బ్యాంకుల్లో పెట్టుబడులు రూపంలో ఉందని, వాటిని చక్కబెట్టేందుకే ఆయన సంవత్సరానికొక సారి విదేశాలకు వెళ్లి వస్తాడని ఆరోపించింది. నిజానికి తన ఆస్తి పాస్తుల వివరాలను తెలియపరుస్తూ, తను రెండెకరాల ఆసామినైనా భువనేశ్వరి వివాహానంతరం ఆమె వలన కోటీశ్వరుడైనానని ఎంత మొత్తుకున్నా ఎవరూ ఆయన ఘోష పట్టించుకోలేదు. ఆయనపై ఆరోపణలన్నీ అప్పట్లో ప్రజలు నమ్మారు. అందుకే తిరిగి రాజశేఖర రెడ్డికే పట్టం కట్టారు.

పైకి కాంగ్రెస్‌కు అనుకూల పత్రిక ఒకటి ఉండాలన్నది తన ఆకాంక్షని రాజశేఖర రెడ్డి చెబుతున్నా, లోలోన ఆయన ఉద్దేశాలు వేరు. సంక్షేమ పథకాల ముసుగులో బడుగు ప్రజల ఆదరణ సంపాదించి తానే, ముఖ్యమంత్రిగా ఒక రెండు దశాబ్దాలు కొనసాగాలన్నది వారి సంకల్పం. అంతేగాదు తను అలా కొనసాగితే తప్ప రాహుల్ గాంధీ తిరిగి ప్రధాని కాడన్నది పైకి చెప్పే మరో గొప్ప లక్ష్యం. అయితే దురదృష్టవశాత్తు ఆయన సెప్టెంబర్ 2, 2009ననే ఒక హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. అలా ఆయన రెండవ సారి ముఖ్యమంత్రి అయిన కొద్ది నెలలకే పదవిలో ఉండగానే మృత్యు వాత పడ్డారు. నాడు ఈ సాక్షి 'రాజ శేఖర రెడ్డి మరణానికి రిలయన్స్ కు సంబంధం ఉందని' రోత రాతలు అనేకం రాసింది. రామోజీ ని బాధ్యుడిని చేస్తూ అనేక కథలు అల్లింది. రాజ శేఖర రెడ్డిది హత్యని, ఆ కుట్రలో చంద్రబాబు, రామోజీ, రిలయన్స్ అధినేత అంబానీ భాగస్తులని రాసుకొచ్చింది. మళ్ళీ ప్రజలు నమ్మారు.

ఈ కాలం లోనే పెద్ద ఎత్తున సోషల్ మీడియా అనేది రాజకీయ రంగ ప్రవేశం చేసింది. నిపుణులైన రాజ తంత్రం, విషప్రచారం చేయటం తెలిసిన వారు ఈ సోషల్ మీడియా ద్వారా రాజకీయ భవితవ్యాలను ఎలా మార్చవచ్చో చెప్పసాగారు. వారు వై ఆర్ సి పి వంటి రాజ్యాధికారం కోరుకొంటున్న పార్టీలకు మీడియా పెద్దలయ్యారు. ఈ సమయం లోనే సమాంతరంగా తెలంగాణా ఉద్యమం సాగింది. పత్రికా రంగం, సోషల్ మీడియా అంతా హైదరాబాద్ కేంద్రంగా సాగటంతో ఈ మీడియాలో పనిచేసే తెలంగాణా వారు మీడియాను తెలంగాణ సాధనకు అనుకూలంగా మలచగలిగారు. పైకి కే సి ఆర్ అంతా తానే అయి తప్ప ఇంకెవ్వరూ తెలంగాణా తేలేదు అని చెప్పుకొన్నా, తెలంగాణా ఏర్పాటు లో మీడియా, సోషల్ మీడియా పాత్ర ఎనలేనిది. ముఖ్యంగా 'టి' న్యూస్ అనే తెలంగాణా టెలివిజన్ ఛానెల్ టి ఆర్ ఎస్ పార్టీది. ఇది జగన్ మోహన్ రెడ్డి 'సాక్షి' పత్రికలా లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు భ్రమ కల్పించి ప్రజలను మభ్య పెట్టగల పత్రికా వ్యవస్థ. ఎదుటి ప్రతిపక్ష పార్టీల పై విషం జిమ్మటం, అబద్ధపు ఆరోపణలు చేసి, దొంగ రుజువులు సృష్టించటంలో ఈ రెండు మీడియా రంగాలు అత్యున్నత శ్రేణీ నైపుణ్యం కలిగినవి. అలా ఉద్యమ ఉధృతి ఒకవైపు, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ముగిసే కాలం దగ్గరపడుతుండటం మరో వైపు కలిసి వచ్చి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం 2013లోనే ప్రకటించడం జరిగింది. సాధికారంగా జూన్ 2, 2014 న రెండు రాష్ట్రాలు ఏర్పాడ్డాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తెలంగాణా రాష్ట్ర సమితి (టి ఆర్ ఎస్), కొత్తగా ఏర్పడ్డ పాత ఆంధ్ర రాష్ట్రం పైనా, దాని ముఖ్యమంత్రి పైనా విషం చిమ్మే కార్యక్రమానికి తెరలేపింది. ఆంధ్రాలో జగన్, తెలంగాణాలో కే సి ఆర్ లు తమ మీడియా అండతో చెలరేగి విషం చిమ్మారు.

ఈ మీడియాలలో పనిచేసే వారికి మీడియా 'ఎథిక్స్' మారిపోయాయి. కొత్త 'ఎథిక్స్'కు దారులు వేశారు. 'రాజ్యాధికారం కోసం ఏమి చేసినా తప్పుకాదు' అనే 'కొత్త జర్నలిజం' సూత్రానికి పట్టం కట్టారు. తమ రాజకీయ మీడియా అధిపతులకు, వారి కుటుంబాలకు విధేయులుగా ఉండటమే తమ తక్షణ కర్తవ్యంగా 'జర్నలిజం' నడపడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో ఎప్పటినుంచో మార్కెట్లో ఉన్న 'ఈ నాడు', 'ఆంధ్ర జ్యోతి' పత్రికలను 'ఎల్లో మీడియా ' గా అభివర్ణించడం మొదలు పెట్టారు. చిన్నా, చితకా మీడియాలకు డబ్బులిచ్చి తమవైపుకు తిప్పుకోగలిగినా ఈనాడు, ఆంధ్ర జ్యోతిలను, వాటి టెలివిజన్ ఛానెల్స్ ను ఏమీ చేయలేకపోయారు. యూట్యూబ్ ఛానెల్ను వేలలో పుట్టించి తమకు అనుకూలంగా మార్చుకొన్నారు టీ ఆర్ ఎస్, వై ఎస్ ఆర్ సి పి లు. వీటి ఏకైక లక్ష్యం శాశ్వతంగా అధికారంలో కొనసాగటం. అందుకు చంద్రబాబు, ఈనాడు, ఆంధ్ర జ్యోతిలను శాశ్వతంగా రాజేకీయాలనుంచి పారదోలటం.

ఈ ఎజెండాలో భాగంగానే చంద్రబాబు పార్టీ పై, వాళ్ళ కార్యాలయాలపై, ఈనాడు, ఆంధ్రజ్యోతిలపై దాడులు, వాటి ఆర్థిక మూలాలు దెబ్బ తీసే ప్రయత్నాలు. కే సి ఆర్ హైద్రాబాద్ కేంద్రంగా ఏ పత్రికా, టెలివిజన్ ఛానెల్ తమకు వ్యతిరేకంగా రాయకుండా కొరడా ఝుళిపించారు. అధికారంలోకి వస్తూనే టీవీ 9ను, ఆంధ్ర జ్యోతిని మూసేయించారు. వాళ్ళ పై కేసులు పెట్టారు. ఫలితంగా వాళ్లు సుప్రీమ్ కోర్టుకు వెళ్లి తిరిగి పనిచేసుకునే పరిస్థితి కలిపించారు. చివరకు టీ ఆర్ ఎస్ సన్నిహితుడైన వారితో టీవీ 9 కొనిపించేందుకు తమకున్న గోకర్ణ, గజకర్ణ శక్తులన్నీ వాడి టీవీ 9 స్వాధీనం చేసుకొన్నారు. దానిని

ఉపయోగించి చంద్రబాబును, టీడీపీని దెబ్బతీసి వై ఎస్ ఆర్ సిపి కి అనుకూలంగా వార్తా ప్రసారం చేయించారు. ఈ పోరాటంలో గత ఐదేళ్లు ఈనాడు తటస్థంగా ఉండిపోయినా, ఆంధ్రజ్యోతి లొంగలేదు. అది యథా తథంగా కే సి ఆర్ వ్యతిరేకంగా తెలంగాణాలో, వై ఎస్ ఆర్ సి పి వ్యతిరేకంగా ఆంధ్రా లో జరిగే సంఘటనలకు తమ మీడియాలో ప్రాచుర్యం కలిగించింది.

ఎనిమిది పదుల్లో లేవలేకుండా ఉన్న రామోజీని మంచం పైనే సి ఐ డి పోలీసులతో విచారించిన దృష్టాంతం జగన్ ప్రభుత్వానిది. కుల ద్వేషంతో రంగనాయకమ్మ సోషల్ మీడియా పోస్ట్ ఫార్వర్డ్ చేసిందని రాత్రికి రాత్రి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి తెల్ల వార్లు ఆవిడని స్టేషన్లో కూర్చోబెట్టిన ఘనత జగన్ది. నలందా విద్యాలయ అధిపతిని కూడా సోషల్ మీడియా పోస్ట్ ఫార్వర్డ్ చేసినందుకు కర్నూల్ తీసుకెళ్లి అక్కడ కేసు పెట్టి వేధించి. చివరకు కరోనాతో ఆయన మరణించే స్థితికి తెచ్చిన ప్రభుత్వం జగన్ ప్రభుత్వానిది. ప్రజలు భీతిల్లి పోయారు. మీడియా గడ గడ లాడింది ఆంధ్రాలో. ఈ నేపథ్యంలో తెలంగాణ , ఆంధ్రాలలో ప్రభుత్వాలు మారాయి. అయినా సాక్షి, టీ ఆర్ ఎస్ టి న్యూస్, నమస్తే తెలంగాణాల తీరు మారలేదు. ఆయా పార్టీలు తమ పాలనను ఎందుకు ప్రజలు తిప్పి కొట్టారో తెలుసుకోకుండానే, మరో మారు తప్పుడు ప్రచారానికి తెగబడుతున్నాయి. తమ సోషమీడియాలో అసత్యపు పోస్టులు పెట్టిస్తూ, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక మూడునెలల ముందు ఇదే కేటీఆర్ తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగిపోతున్నాడు. ఢిల్లీ రమ్మని పిలిచారు. వేరే ముఖ్యమంత్రి వస్తున్నాడని

చెప్పటమే గాక తమ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయించారు. అందరూ 'అవునా' అని అనుకొన్నారు. కానీ, ఏమీ జరగలేదు.

ఇక్కడ ఆంధ్రాలో జగన్ సృష్టించిన ఆర్థిక విధ్వంసం నేపథ్యంలో తనకు సూపర్ సిక్స్ అమలులో జాప్యం జరుగుతున్నదని, ప్రజలు అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలను కోరితే, 'సూపర్ సిక్స్ఇవ్వలేం' అని సాక్షి హెడింగ్ పెట్టి వార్త రాసింది. దాని అనుకూల మీడియా , యూట్యూబ్స్ 'బాబు , సూపర్ సిక్స్ ఫ్లాప్' అని తప్పుడు వార్తలు రాశారు. ఇక సాక్షి, జగన్ అనుకూల మీడియా చంద్రబాబు పైన, షర్మిల పైన, తల్లి జయలక్ష్మి పైన, పవన్కళ్యాణ్ పైన పెట్టిన అసంఖ్యాక అసత్యపు పోస్టులకు అంతే లేదు. కేవలం పోస్ట్ లయితే ఫర్వాలేదు. భయంకర బూతులు. సభ్య సమాజంలో ఎవరూ మాట్లాడ కూడని జుగుప్స పుట్టించే మాటలు. ఇవన్నీ రాజకీయ పార్టీల ముసుగులో, ప్రజా స్వామ్యం ముసుగులో. ఇటువంటి రాజకీయంతో భవిష్యత్తులో యువతకు , చిన్నారులకు , స్త్రీలకు ఎటువంటి భరోసా కలిపిస్తున్నట్టు అనే ప్రశ్న ఇవ్వాళ రెండు రాష్ట్రాలలో విజ్ఞత గల ప్రజలను వేధిస్తున్నది. ఇదంతా ఒక ఎత్తు. ఇప్పుడు జరుగుతున్న విన్యాసం మరో ఎత్తు.

కారణాలు పైన చెప్పినవైనా, మరేవైనా తెలంగాణాలో, ఆంధ్రాలో ఒక విచిత్రమైన పాలనా స్థితి కొనసాగుతున్నది. తెలంగాణలో కే సి ఆర్ ప్రభుత్వ అక్రమాలంటూ కొల్లబోయినన్ని పత్రికాకథ నాలు వచ్చాయి. నాటి కాంగ్రెస్, బీజేపీ లు 'అవును, అవి నిజమే' అని గగ్గోలు పెట్టాయి. తాము పాలనలోకి వస్తే వాటిపై తక్షణమే విచారణ జరుపుతామని , బాధ్యులను జైలులో పెడతామని వాగ్దానాలు కూడా చేశాయి ఎన్నికల్లో. తీరా అధికారంలోకి వచ్చి, సంవత్సరమైనా రేవంత్ ప్రభుత్వం ఒక్కరిని

గూడా జైలుకు పంపలేదు. ఇప్పుడా పత్రికా కథనాలపైన, ఆ పత్రికా ఎథిక్స్ పైనా సర్వత్రా సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. అదే పరిస్థితి ఇప్పుడు ఆంధ్రాలో గూడా వస్తున్నది. అన్ని చోట్ల విజిలెన్సు విచారణ లు మామిడి తాండ్రలా, జీడీ పాకంలా నెలల తరబడి సాగుతున్నాయి. ప్రధాన పాత్రధారులెవ్వరూ అరెస్ట్ కాలేదు. చిన్నా చితకా వారిని కొంతమందిని జైలులో పెట్టి చివరకు బెయిలుపై విడుదల చేస్తున్నారు. ఇప్పుడు జగన్ వ్యతిరేకంగా నాడు పత్రికలు రాసిన కథనాలు అబద్ధమా, లేక జగన్ హయంలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై ప్రభుత్వం చర్యలకు పాల్పడితే తమ పిల్లా, బిడ్డలకు ఎక్కడ జగన్ , ఆయన అనుచర గణం ప్రాణ హాని కలిగిస్తాడోనని భయ పడుతున్నారా ?

సాక్షి, దాని అనుకూల మీడియా వివేకానంద రెడ్డి హత్యతో ఆరంభించి 2019 ఎలక్షణులలో చంద్రబాబును, టీ డి పి ని దెబ్బ తీసే ప్రయత్నం చేశాయి. అమరావతి ఒకే కమ్మ కులం వారిదన్న ప్రచారంతో మొదలుపెట్టి, తిరుపతిలో పింక్ డైమండ్ చంద్రబాబు ఇంటి కిందనే ఉంది అనేంతవరకు చంద్రబాబు హననం నిరాఘాటంగా సాగింది. 'నారాసుర రక్త చరిత్ర' టైటిల్ గత దశాబ్దానికి సాక్షి సృష్టించిన ఒక సూపర్ పచ్చి అబద్ధం. 'లేని ఔటర్ రింగ్ అలైన్మెంట్ మార్పు వలన రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది , స్కిల్ డెవలప్మెంట్ కేసులో 300 కోట్లు ముడుపులు ముట్టాయి' అంటూ జగన్ ప్రభుత్వం పెట్టిన ఏ కేసులు సుప్రీమ్ కోర్ట్ దాకా నమ్మకం కలిగించలేకపోయాయి. ఇప్పుడు జగన్ ప్రభుత్వం పైన మీడియా గత అయిదేళ్లుగా రాసినవి గూడా అలాంటి కథనాలేనా ? అన్న అనుమానం అందరినీ వేధిస్తున్నది. దీనికి కారణం

చంద్రబాబు అనుసరిస్తున్న మెతక వైఖరిని కొందరి రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

ఏది ఏమైనా నేటి పత్రికలు, సోషల్ మీడియా, ఏ పక్షం వారివైనా, క్రమంగా ప్రజల్లో పూర్తి విశ్వాసం కోల్పోయే పరిస్థితి దాపురిస్తున్నది. గతంలో ప్రభుత్వాల పై వచ్చిన లెక్కలేనన్ని ఆరోపణల్లో కనీసం ప్రధానమైన వాటిపైనన్నా తక్షణం చర్యలు తీసుకోకపోతే మీడియా, ప్రభుత్వం అన్నీ ప్రజల పట్ల బాధ్యత లేనట్టే అవుతాయి.

(అక్షరాంజలి మాసపత్రిక మార్చి, 2025)

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రతిపక్షాల డొల్లతనం, వెకిలి వాగుడు!

రాజకీయాలలో గెలుపోటములు తప్పవు. ముఖ్యంగా తెలంగాణాలో 2023లో ఓటమి చవిచూసిన బి ఆర్ ఎస్ పదేళ్ల తరువాత ప్రతిపక్షమైంది. అలాగే ఆంధ్రాలో అయిదేళ్లకే వై ఎస్ ఆర్ సి పి చావుదెబ్బ తిని, నేలకతుక్కు పోయింది.

నిజానికి రాజకీయాలలో అప్పుడప్పుడు ప్రతిపక్షంగా కూర్చోవటం ప్రజాస్వామ్యంలో ఒక వరంగా భావించాలి. ఈ కాలం ప్రతిపార్టీకి వ్యవస్థాగతంగా తమ పనితీరును మదింపు చేసుకొని, అలసిపోయిన లేక ఉడిగిన జవసత్వాలను క్రింది స్థాయినుంచి తిరిగి కూడకట్టు కొనేందుకు ఎంతగానో ఉపకరించే సమయం.క్రిందిస్థాయి వరకు క్యాడర్ లో ప్రతి ఒక్కరినీ కలిసి, వారి అభిప్రాయాలు సేకరించి, తగిన శిక్షణ అందించేందుకు అనుకూలమైన కాలం. అంతేగాక పాలనలో ఉన్నప్పుడు పాలకులకు ఈ మేర సమయం కేటాయించటం సాధ్యం కాక పోవచ్చు.

పాలనలో ఉన్నప్పుడు ఆయా రాజకీయ పార్టీలు చేసేవన్నీ ప్రజలకు న్యాయమే చేయాలని లేదు. కొన్ని సార్లు ఎంత సదుద్దేశంతో చేసేవైనా తప్పుడు ఫలితాలను ఇస్తాయి. తెలంగాణలో 'ధరణి' పోర్టల్ ఒక విఫల ప్రయోగం. దళితులకు 10లక్షలు ఇచ్చి రాత్రికి రాత్రే సంపన్నులను చేసే ప్రయోగం కూడా వికటించింది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్ట్ కూడా. దానిమీద ఇప్పుడు విచారణ కొనసాగుతోంది. విచారణలో ఎన్నో కీలక విషయాలు బయటికి వస్తున్నాయి.

తమ పాలనలో ఉద్యోగులకు ఫస్టుకు జీతాలివ్వలేక పోవడం, గుడ్డిగా తాము చేసినవన్నీప్రజలకు న్యాయం చేసేవే అని మొండిగా వాదించటం ఏ ప్రతిపక్షానికి మేలు చేయదు. అన్నింటికన్నా తమ పాలనలో

కొన్నైనా వైఫల్యాలు ఉండబట్టే ప్రజలు తమను తిరస్కరించారన్నఅవగాహన, అందుకు తగిన జ్ఞానం, ఆత్మ పరిశీలనా ఉండాలి.

ప్రస్తుతానికి ఉభయరాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు ఈ దిశ లో ప్రయత్నాలేవీ చేస్తున్నట్టు లేదు. అన్నింటికీ మించి ఒక వితండ వాదన చేస్తూ, కేవలం పాలకులను చికాకుపెట్టే అబద్ధాల ప్రచారం చేస్తూ కాలం గడిపేస్తున్నాయి.

తెలంగాణాలో నూతన ముఖ్య,మంత్రి రేవంత్ రెడ్డిని ఊపిరి పీల్చుకోనీయకుండా అటు బి ఆర్ ఎస్, ఇటు బి జె పి కూడా ఒక పద్ధతిలో అసత్య ప్రచారాలు చేస్తున్నాయి. రోజూ వీరు సృష్టించిన అసత్య ప్రచారాలకు సమాధానం చెప్పుకోవటమే ముఖ్యమంత్రి ఏకైక అజెండాగా మారిపోయింది. మొట్టమొదట ఈ బీజేపీ, బీర్ఎస్ గుర్తించవల్సిందేమిటంటే గత 10ఏళ్ళు బి ఆర్ ఎస్ పాలన ఏమిటో, వాళ్ళు ఏమి చెప్పి, చివరకు ఏమిచేశారో స్పష్టమైన అవగాహన ప్రజలకు ఉంది. అలాగే గత 10 ఏళ్లలో బీజేపీ కేంద్రంలో ఉండి, రాష్ట్రంలో వాళ్ళ మంత్రులు, ఎంపీలు ఉండికూడా రాష్ట్రానికి మొండి చేయి చూపిన సంగతి కూడా ప్రజలకు తెలిసిందే. కాబట్టే, రెండు పార్టీలను కాదని, రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ కు పట్టం కట్టారు.

ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత గూడా బి ఆర్ ఎస్, బీజేపీ ల మధ్య లోపాయికారి ఒప్పందం ఉన్నదన్న అనుమానం ప్రజల్లో ఉంది. ప్రస్తుతం ముగిసిన ఎమ్ ఎల్ సి ఎలక్షన్స్ విషయం గాని, తొమ్మిది నెలల క్రితం జరిగిన పార్లమెంట్ ఎలెక్షన్స్ లో గాని, బీజేపీకి కలిసిరావటానికి బి ఆర్ ఎస్, బీజేపీల మధ్య నున్న అపవిత్ర ఒప్పందమేనని ప్రజలు బహిరంగంగానే చెబుతారు. ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కాం లో దొరికిన

కవితమ్మను తిరిగి జైలుకు పంపకుండా కాపాడుకోవటానికే బి ఆర్ ఎస్ ఈ విధమైన నాటకానికి తెర లేపిందని కూడా 'టాక్ అఫ్ ది టౌన్'. ఇవన్నీ మరిపించడానికి బి ఆర్ ఎస్, బీజేపీ యుగళంగా పాడే పాచి పాట ఒక్కటే. అదేమిటంటే, 'రేవంత్ రెడ్డి ఎన్నికలముందు ఎన్నో వరాలు అమలు చేస్తామని హామీ ఇచ్చాడు. వాటిని 100 రోజుల్లో అమలు చేస్తామని కూడా తెలిపాడు. కానీ, ఏవీ సరిగ్గా అమలు చేయలేకపోయాడు' అని.

ఆ విధంగా చూస్తే రేవంత్ రెడ్డి పాలన విఫలమైంది కావచ్చు. ప్రచారంలో చెప్పినవి చెప్పినట్టు, చెప్పిన సమయంలో, అంతే స్థాయిలో అమలు చేసిఉండకపోవచ్చు. కానీ, ఇక్కడ ఒక విషయం గుర్తు ఉంచుకోవాలి. ఉభయరాష్ట్రాలలోని ప్రజలు కేవలం హామీల కోసమే ఇప్పటి రేవంత్కు, చంద్రబాబుకు ఓటేయ్యలేదు. గత పాలకుల కుటిల బుద్ధికి రాష్ట్రమెంత విధ్వంశం అయిందో, దానినుంచి కాపాడడానికి ప్రజలు ఓటు వేశారు.

అంత మాత్రానికే ఆయన ఏమీ చేయలేదు. ఆయన పాలనలో వైఫల్యం చెందాడనటం సబబుకాదు ప్రతిపక్షాలకు. పాలన అంటే కేవలం ఎన్నికల్లో ఇచ్చిన వరాలను నెరవేర్చటమే కాదు. ఇంకా ఎన్నోఉంటాయి. అవన్నీ ప్రజలకు తెలియదనుకొని, కేవలం వరాలు ఇవ్వలేదు కాబట్టి ఆయనకు పాలన చేతకాదు, ఆయన పాలనలో ఏమీ జరుగలేదు ు వంటి మాటలను తమ న్యూస్ ఛానల్, పత్రికల్లో ప్రచారం చేస్తే సరిపోతుందా? ప్రజలకు తెలియదా రేవంత్ పాలనకు వచ్చేప్పటికి రాష్ట్ర ఆర్ధిక పరిస్థితిని బి ఆర్ ఎస్ ఎంత దిగజార్చిందో? ఆఖరికి నెలకు ఫస్టుకు జీతాలివ్వటం సంగతి అటుంచి, రెండు మూడు నెలలకోసారి జీతాలిచ్చిన పుణ్యం, సామర్థ్యం కె సి ఆర్ ది కాదా?

ఇలా ప్రతిపక్షాలు ఏక పక్షంగా రేవంత్ రెడ్డిని ఉక్కిరి బిక్కిరి చేసి ఆయనను దించే కుట్రలు ఎన్ని చేసినా చైతన్య వంతులైన తెలంగాణా ప్రజలకు, బి ఆర్ ఎస్ దోపిడీ, కుటుంబ పాలన మీద హఠాత్తుగా ప్రేమ పుట్టుకు రాదు. అలానే బీజేపీ పైన నమ్మకం కలగదు. అంటే కాంగ్రెస్, రేవంత్ పాలనలో ఏవైనా లోపాలను ప్రజలు గుర్తించినా ఆ వ్యతిరేకత బి ఆర్ ఎస్, బీజేపీ లకు అనుకూలంగా మారదన్నది గుర్తుపెట్టుకోవాలి.

కె సి ఆర్, జగన్మోహన్ రెడ్డిల నియంతృత్వ పోకడలు, హింస, ఆటవిక విధానాలు, నిర్బంధాలు, దోపిడీలు రెండు రాష్ట్రాల ప్రజలు ఈసడించుకొనటం వల్లనే వాళ్ళ వోటింగ్ శాతం, శాసన సభ్యుల సంఖ్య గణనీయంగా పడిపోయాయి. అవమానకరమైన ఓటమిని చవిచూశారు. తెలంగాణా రాష్ట్ర పాలనా శాఖలు ఉండే చోట ఇనుపగేట్లు పెట్టించి, ప్రజలను తమ సమస్యలకోసం లోపలికి రానీయకుండా చేయటం నియంతృత్వం కాదా? అలాగే ముఖ్యమంత్రిగా కే సి ఆర్ సెక్రటేరియట్ రాకుండా ఇంటినుంచే పాలన జరపటం నియంతృత్వానికి ఉదాహరణ కాదా?

తెలంగాణా లో కే సి ఆర్ ఎలా నడిచాడో, పాలన ఎలా నడిపాడో, అవే జాడల్లో నడిచాడు అప్పటి ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు. తాడేపల్లి పాలస్ నుంచి పాలన, అమరావతికి మకిలం పట్టించి, గత ప్రభుత్వం వేసిన రోడ్లను కూడా తవ్వుకు పోయేలా చేసిన జగన్, అమరావతి రైతుస్త్రీలను దారుణంగా కొట్టించిన, తిట్టించిన జగన్ ను ప్రజలు విశ్వసిస్తారా?

తెలంగాణా పాలనను కే సి ఆర్ కుటుంబం, బంధువులు, అదే కులస్థులు, మిత్రులు, ఆశావహులు ఎలా పంచుకొని విచ్చలవిడిగా సాగారో

తెలంగాణా ప్రజలు అప్పుడే మరిచిపోతారా? అలాగే జగన్ రెడ్డి పాలన ఎలా నలుగురు రెడ్లు, వారి బంధువులు మధ్య సాగిందో ప్రజలకు తెలియదా? విశాఖ ఆస్తులు విజయ సాయి రెడ్డి కుటుంబీకుల చేతికేలా వెళ్లిందో ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ తీర్పులు వింటుంటే ప్రజలకు అర్థంకాదా? ప్రజావేదిక పడగొట్టి, నీతులు బొంకిన జగన్, రుషి కొండకు గుండు కొట్టించి విశాల విలాస భవంతులు కట్టించింది నిజం కాదా? ఖజానా ఖాళీ అయిందని బొంకి విశాఖ పాలనా భవనాలను తాకట్టు పెట్టింది నిజం కాదా? వీటన్నిటికీ ప్రభుత్వం వద్ద రికార్డులు ఉన్నాయి కదా! కాకినాడ సెజ్, పోర్ట్ లను విజయ సాయి బంధువులు బెదిరించి తమ పేరుపై రాయించుకొన్న సంగతి హైకోర్టులోనే బయట పడింది కదా. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భూ స్వాహాల పర్వాలకు అంతులేదు. లక్షలలో ఫిర్యాదులు వచ్చాయి జగన్ ఓడిపోయి, దిగిపోయిన వెంటనే.

కేవలం ఎన్నికలప్పుడు ఇచ్చిన వరాలు నెరవేర్చకుంటే మళ్ళీ కే సి ఆర్, జగన్ రెడ్డిలకు ప్రజలు పట్టం కడతారనుకొంటే అంత కంటే అవివేకం లేదు. ప్రజలు శాంతియుతమైన, భయ రహితమైన, ప్రజాస్వామ్య యుతమైన పాలన కోరుకొంటున్నారు. కనీస హక్కులు నెరవేర్తు, పైన కొన్ని ఎలక్షనప్పుడు ఇచ్చిన వరాలను తీర్చినా చాలు. ప్రజలు రేవంత్, చంద్రబాబుల పాలనను ఆమోదిస్తారు. అంతేగాని, ఎలక్షన్ వరాలంటూ ఆర్భాటంగా బట్టన్ నొక్కుతూ తీర్చేశామని బొంకుతూ, రాష్ట్రాన్ని దోచుకుంటుంటే కూడా ఫర్వాలేదని బి ఆర్ ఎస్ కు, వై ఎస్ ఆర్ సి పి కి తిరిగి పట్టం కట్టరు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలలో కే సి ఆర్, జగన్ రెడ్డిలు నరకం చూపారు.

అసెంబ్లీకి పోయే ధైర్యం లేని నాయకులు ప్రతిపక్షంలో ఉన్నారన్న అపకీర్తి కే సి ఆర్ ను, జగన్ మోహన్ రెడ్డిని వెంటాడుతుంది. జగన్ అయితే మరో మెట్టు దిగజారి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని, ఇవ్వకపోతే తాను, అసెంబ్లీకి వెళ్లనని కొత్త వాదన తెచ్చాడు. ఇలాంటి తేడా ప్రవర్తన గత 77 సంవత్సరాల భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా కనీవిని ఎరగం. భయంకర నేర చరిత్ర, హత్యా రాజకీయ చరిత్ర ఉన్న జగన్ నీతులు వల్ల వేస్తూ కొత్త తరం నేరస్తుల ఫిలోసోఫీని తెర పైకి తెస్తున్నాడు. ప్రతి నేరం చేసేముందు ఆ నేరం బయటపడితే దానిని అవతల వారిపై ఎలా తోసేయాలో ముందుగానే అతని వద్ద ఒక ప్లాన్ ఉంటుంది. ఆ పథకం ప్రకారం నేరాలు, ఘోరాలు చేయిస్తాడు. తన మీడియా సాక్షి పత్రిక, టి వి ఛానెల్ ద్వారా తను ముందుగా వేసిన ప్లాన్ ను పదే పదే రాస్తూ, పలికిస్తూ జనాలను నమ్మించాలని చూస్తాడు. ఇటువంటి నేర రాజకీయ చరిత్ర గమనం ఇప్పుడు తెలంగాణాలోను, ఆంధ్రాలోనూ వారి వారి అనుకూల మీడియాల ద్వారా సాగిస్తూ బి ఆర్ ఎస్, వై సి పి కాలం గడిపేస్తూ పగటి కలలు కంటున్నది. ప్రజలను ఈ రెండు పార్టీలు ప్రతిసారి మోసం చేయలేవు.

ఒకవేళ రేవంత్, చంద్రబాబులు ప్రకటించిన అన్ని పథకాలు ప్రకటించినట్లు అమలు చేయలేకపోయినా ప్రజలు బి ఆర్ ఎస్, వై సి పి కి తిరిగి ఆహ్వానం పలుకుతారని ఎవరైనా భ్రమ పడితే అది ఇసుక ఎడారులలో ఎండమావులు చూసి నీటి మడుగులని భ్రమపడిన చందంగానే మారుతుంది. అంతవరకూ రేవంత్, చంద్రబాబులు రానీయక పోవచ్చు. మొత్తం కాకపోయినా ఎంతో కొంత అమలు చేసి తీరుతారు. ఆ మాటకొస్తే రేవంత్ సవాలు విసిరినట్టు గతంలో కె సి ఆర్, మోడీలు ఎలక్షన్ టైంలో

ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చారా? లేదే. జగన్ మధ్య పాన నిషేధం చేయకపోతే మళ్ళీ ఓటు కోసం రానన్నాడే. ఏమైంది? ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ తేవడానికి ఒక వారం చాలన్న మనిషి మాట ఎందుకు మార్చాడు? ఉద్యోగులు దాచుకొన్న ప్రోవిడెంట్ ఫండ్ ను, ఇతర నిధులను వారి అనుమతి లేకుండా జగన్ ఎలా వాడేశాడు? ఇవన్నీ ఎన్నికలప్పుడు ఇచ్చిన వరాలేనా? నూటికి నూరు శాతం ఎన్నికలప్పుడు ఇచ్చిన వరాలని అమలు చేయాలని, అదే మరోసారి వోటువేసేందుకు గీటు రాయని ప్రజలే భావించటం లేదు. ఆ విషయం గ్రహించి, ఇటు బి ఆర్ ఎస్, బీజేపీ తెలంగాణలోనూ, అటు వై సి పి ఆంధ్రలోను శాంతి యుతమైన, తర్కబద్ధమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే ప్రజలకు, రాష్ట్రాలకు మంచి జరుగుతుంది.

(అక్షరాంజలి మాసపత్రిక ఏప్రిల్, 2025)

ఆంధ్రాను పాకిస్తాన్ గా మార్చి, చంద్రబాబుపై ద్వేషం విరజిమ్ముతున్న బి ఆర్ ఎస్ నాయకులు

అయినదానికీ, కానీ దానికి ఆంధ్రాను పాకిస్తాన్ లా చూపటం బి ఆర్ ఎస్ కు పరిపాటి అయినట్టుంది. చంద్రబాబు ముఖ్యమంత్రైతే, ఆయన సారధ్యం, దార్శనికతలో ఆంద్ర రాష్ట్రం బాగుపడితే, తెలంగాణా బాగుపడదు అన్న దురాలోచనేదో కే సి ఆర్, కే టీ ఆర్ లను పీడిస్తున్నది. బి ఆర్ ఎస్ అధికారం లోకి రావాలంటే ఆంధ్రా మీద విషం చిమ్మాలి. చంద్రబాబును తెలంగాణాకు విలన్ గా చూపాలి. తెలంగాణా ప్రజల్లో ఆంధ్రా పట్ల ఏహ్య భావం రగల్చాలి. అలా అయితేనే తిరిగి అధికారం దక్కుతుందనే భావన బి ఆర్ ఎస్ రాజకీయ వ్యూహం అయి కూర్చుంది.

'అన్నదమ్ములుగా విడిపోదాం, ఇరు రాష్ట్రాలు అభివృద్ధి చేసుకొందాం' అన్న విభజన వాదం చేసే కాలంలో ఉపయోగించిన బుజ్జగింపు ప్రయోగాలు కేవలం నాలికంచుల నుంచి వచ్చిన 'తేనే పూసిన కత్తి' మాటలే అన్నది ఇప్పటి బి ఆర్ ఎస్ నాయకుల ప్రవర్తన చూస్తే స్పష్టం అవుతుంది. తమ గుండెల్లో విషం జిమ్మే పాషాణాలను, పెట్టుకొని పైకి అందరికీ ముచ్చట గొలిపే పదజాలం ఎదో నాడు వారు వ్యూహాత్మకంగా ఎంచుకొన్న విషయం గత రెండు ఎన్నికల్లో స్ఫుటంగా ద్యోతకమైంది. నిజానికి ఆ రెండు ఎన్నికల్లో కే సి ఆర్ గెలిచి, ముఖ్యమంత్రి అవటం కేవలం చంద్రబాబుపై విషం చిమ్మటం, ఆంధ్రాని ద్వేషించటంతోనే సాధ్యమైందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

కేవలం ఆంధ్రా పాలకులవల్ల తెలంగాణాకు అస్తిత్వపరంగా, వనరులపరంగా, ఉద్యోగాల పరంగా నష్టం కలిగించిందని వాదించి, రాజకీయంగా ఒక ఉద్యమం నడిపి తెలంగాణా సాధించుకోవటం ఎవ్వరూ

అభ్యంతర పెట్టరు. కానీ, చంద్రబాబు అన్నా, టి డి పి అన్నా, ఆంధ్రా అన్నా కరుడుగట్టుకుపోయిన ద్వేషం విరజిమ్మి, తెలుగు దేశం పార్టీనే తెలంగాణా నుంచి తరిమివేయాలని, 2014లో జరిగిన తొలి తెలంగాణాఎన్నికల్లో గెలిచిన సుమారు 15మంది టి డి పి ఎమ్మెల్యేలను తమ పార్టీకి ఫిరాయించుకొన్న సంస్కృతి బి ఆర్ ఎస్ ది అన్నది చరిత్ర. చరిత్రను ఎవ్వరూ మరువగూడదు.

'తొలి తెలంగాణా రాష్ట్రం ఎంతో ఆదర్శంగా ఉంటుంది. దేశానికే తలమానికంగా ఉంటుంది' అని పదవీ ప్రమాణ స్వీకారం రోజున కే సి ఆర్ పలికిన ఆదర్శాలు, వల్లే వేసిన నీతులు క్షణాల్లో మాయమయ్యాయి. కారణం తొలి ఎన్నికల్లో నాటి టీ ఆర్ ఎస్ కు వచ్చిన సీట్లు కేవలం 63. (అంటే రావలసిన 60 కన్నా మూడు సీట్లు ఎక్కువ). వోటింగ్ శాతం కేవలం 34. శాతం. కాంగ్రెస్కు 25. 2 శాతం, టీ డీ పి కి 15. 7శాతం వచ్చాయి. జన్మ వైరం వలననేమో కాంగ్రెస్, తెలుగు దేశం ఎందుకో కలవలేదు కానీ, ఒక వేళ అవి కలిస్తే వాటికి 40శాతం ఓట్లు ఉంటాయి అన్న విషయం కే సి ఆర్ కు నిద్రపట్టనీ లేదు. పైగా నాడు హైద్రాబాదు ఉమ్మడి రాజధాని కావటం వలన చంద్రబాబు అక్కడే ఉండటంతో కే సి అర్ కు పదవీ గండం దిగులు పట్టింది.

ఫలితంగానే తెలుగు దేశం తెలంగాణాలో అవసరం లేదని, అది ఆంధ్రా బీజాలున్న పార్టీ అని, బి ఆర్ ఎస్ నే తెలంగాణా అభివృద్ధి చేయగలిగి ఉండగా తెలుగుదేశం ఎందుకని వాదించి, నాటి ఎం ఎల్ ఏ లకు ప్రలోభాలు కలిపించి తనవైపు తిప్పుకున్నాడు. తిప్పుకోవటమే గాక, అలా పార్టీ మారిన తలసాని శ్రీనివాస యాదవ్ కు మంత్రి పదవి కూడా కట్టబెట్టాడు. అందుకు ప్రతిగా చంద్రబాబు ఎదో ఒకటి చేస్తాడని ఊహించి,

నాటి ఉమ్మడి ప్రభుత్వం తెప్పించిన పెగసెస్ ఇజ్రాయిల్ టెక్నాలిజీని వాడుకొని చంద్రబాబు, రేవంత్ రెడ్డిల ఫోన్లను టాప్ చేసి స్టీఫెన్ కు లంచం ఇచ్చి తమవైపు తిప్పుకో చూశారంటూ ఏంటి కరప్షన్ బ్యూరోతో కేసులు పెట్టించారు.

తరువాత ఒక ముఖ్యమంత్రి ఫోన్ ను కేంద్రం అనుమతి లేకుండా టాప్ చేయటం నేరమని గ్రహించి, కేసును కేవలం రేవంత్ రెడ్డికే పరిమితం చేశాడు కే సి ఆర్. అలా చేయకపోతే కే సి ఆర్ జైలుకు వెళ్ళేవాడు. నాటి ప్రభుత్వం ఆదిలోనే కుప్ప కూలి పోయేది. కే సి ఆర్ కుయుక్తులు, టెలిఫోన్ టాపింగ్లు అర్థమయిన చంద్రబాబు తన పాలన హైద్రాబాదులో ఉంటే సజావుగా సాగనీయడు కే సి ఆర్ అని గ్రహించాడు. ఎందుకంటే ఆంధ్రా ప్రభుత్వం నూతన రాష్ట్రంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాలి. నీటి వనరులు, తెలంగాణా వాటా పోగా కొత్తగా సర్దుబాటు చేయాలి. ఇందుకు సంబంధించి ఏ ఫ్యాక్స్, ఫోన్, మొబైల్ ఫోన్ వాడినా తక్షణం కే సి ఆర్ కు సమాచారం అందేది.

నిజం నిష్టూరంగానే ఉంటుంది. ఎందుకంటే కే సి ఆర్ ఎంత నీచమైన వ్యక్తి అంటే ఒక ప్రత్యేక పోలీస్ విభాగం సృష్టించి దాని ద్వారా ప్రతిపక్ష నాయకులందరి టెలిఫోన్లను, మొబైల్ ఫోన్లను టాప్ చేసిన విషయం రేవంత్ రెడ్డి నేడు ముఖ్యమంత్రి అయిన తర్వాత బయటపడింది. ఆ పని చేసిపెట్టిన పోలీస్ ఆఫీసర్లు విదేశాలు పారిపోయారు. కొందరిప్పటికీ జైళ్లలో మగ్గుతున్నారు.

ఇది ఇట్లుండగా ఓటుకు నోటు కేసుకు భయపడి చంద్రబాబు అమరావతి పారిపోయాడని తన తోక మీడియాతో ప్రచారం చేశాడు కె సి ఆర్. అంతేగాక రాజకీయంగా చంద్రబాబు ప్రత్యర్థి అయిన జగన్ ను

చేరదీసి, జగన్ తోక మీడియాతో కూడా ప్రచారం చేయించాడు. ఇటువంటి కుచ్ఛిత సంస్కారం ఉన్న కే సి ఆర్, ఆయన తనయుడు కే టి ఆర్, హరీష్ రావులు తమ గురువింద నలుపు తమకు తెలియని చందంగా, శుద్ధ పత్తిత్తులా తమ బి ఆర్ ఎస్ ఎం ఎల్ ఏ లు పదిమంది కాంగ్రెస్కు ఫిరాయించటంతో నీతులు వల్లెవేస్తున్నారు. ఇది బి ఆర్ ఎస్ అసలు రూపం.

ఇక ఇటువంటి నీచమైన రాజకీయ నేపథ్యం దేశంలో మరే రాష్ట్రంలోనూ ఏ పార్టీ ప్రదర్శించలేదు. 'అన్నదమ్ముల్లా కలిసుందాం' అంటూనే, ఆంధ్రాలో అమరావతి నిర్మాణం జరిగితే తెలంగాణా అభివృద్ధి చెందదు. అందువలన అమరావతిని నాశనం చేయాలని, అలాయితేనే తెలంగాణా బ్రతికి బట్టకడుతుందనే 'నీచమైన అభివృద్ధి పథకం' ఒక దానిని కే సి ఆర్, ఆయన కుటుంబ సభ్యులు రాజకీయ వ్యూహంగా వాడి జగన్ చేత మూడు రాజధానుల నాటకం ఆడించారు. ఒకరికొకరు ఎన్నికల్లో ధన సహాయం చేసుకొన్నారు. తెలంగాణా మంత్రులొచ్చి ఆంధ్రాలో జగన్ కు అనుకూలంగా ప్రచారం చేసి వెళ్లారు.

చంద్రబాబు తొలి అయిదేళ్ల పాలనలో అమరావతి అభివృద్ధికి చేసినదంతా జగన్ చేత నాశనం చేయించారు. జగన్ కు, కే సి ఆర్ కు ద్వేషించడానికి ఉమ్మడి మనిషి చంద్రబాబే కనుక వీరి స్నేహం మూడు పువ్వులు ఆరు కాయలుగా కాసింది. ఆఖరుకు ఎంత వరకూ వీరి స్నేహం వికసించిందంటే, తెలంగాణాలో ఎన్నికల కొక రోజు ముందు అంధ్రా పోలీసులు శ్రీశైలం, సాగర్ డాం ల మీదకు వచ్చారని, ఈ మూడవ ఎన్నికల్లో కే సి ఆర్ గెలవకపోతే, తెలంగాణా రాష్ట్రం ఆంధ్రా వాళ్ళ చేతుల్లో తిరిగి నాశనం అవుతుందనే ప్రచారం తన మీడియా ద్వారా చేయించాడు కే సి ఆర్. ఆంధ్రాను పాకిస్తాన్ గా చూపడానికి,

చంద్రబాబుపై మరోసారి ద్వేషం రగల్చడానికి కే సీ ఆర్ చేతిలోని చివరి తురుపు కార్డు కూడా వాడాడు ఈ విధంగా. అయినా తెలంగాణా ప్రజలు కే సి ఆర్ నీచ కుయుక్తులకు లొంగ లేదు. తొలి తెలంగాణ ఎన్నికల లో టి ఆర్ ఎస్ కు వచ్చిన సీట్ల కన్నా కాంగ్రెస్ కు 2023లో వచ్చిన సీట్లు ఎక్కువే. ఆంధ్రాలో అయితే జగన్ అనూహ్యంగా మట్టి గరిచాడు. అలా ఇద్దరు దుష్ట ముఖ్యమంత్రులకు ఉభయ రాష్ట్రాల ప్రజలు ఒకే సారి తగిన శాస్తి చేశారు.

నిజానికి ఏ విధంగా చూసినా కాంగ్రెస్ కు బి ఆర్ ఎస్ ఎం ఎల్ ఏలు పదిమంది అవసరం లేదు. కానీ, 10 ఏళ్లలో టీ ఆర్ ఎస్ ఇతర పార్టీల శాసన సభ్యులను కలుపుకొన్నప్పుడు ఆ పార్టీలు రాజకీయంగా ఎంత న్యూనతను, అవమానాన్ని ఎదుర్కొని ఉంటాయన్న సంగతి బి ఆర్ ఎస్ కు తెలియచెప్పాలనే రేవంత్ ఈ డ్రామా నడిపిస్తున్నాడు. ఈ విషయంలో ఒకప్పుడు కే సి ఆర్ పలికిన శ్రీరంగ నీతులను కే టి ఆర్ ప్రభృతులు గుర్తు చేసుకోవటం ఎంతైనా మంచిది. కే టీ ఆర్ కూడా శ్రీరంగ నీతులే మాట్లాడతాడు. తండ్రి చాలు ఎక్కడికిపోతుంది. పైగా తాను ముఖ్యమంత్రి కాలేకపోయానన్న ఉడుకుమోతుతనం. వెరసి అసెంబ్లీలో ముఖ్యమంత్రిని పట్టుకొని, బొడ్డుకోసి పేరు పెట్టినట్టు 'రేవంత్' అని ఒకసారి, 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి' అని ఒకసారి తన కసిని వెళ్లగక్కుతుంటాడు.

పైగా సుప్రీం కోర్ట్ నేరుగా పార్టీ మారిన 10మంది శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తుందని ఈ కే టి ఆర్ అత్యాశ. సుప్రీమ్ కోర్ట్ అసెంబ్లీ స్పీకర్ అధికారాలను తనకు తాను దఖలు చేసుకోలేదు. ఏదో ఒక ఆదేశం స్పీకర్ కు ఇచ్చినా స్పీకర్ ను నియంత్రించే అధికారం సుప్రీమ్ కోర్టుకు లేదు. స్పీకర్ ఆ పదిమందిని పార్టీ మారినవారిగా

కాకుండా వేరే గ్రూప్ గా పరిగణిస్తూ ఉత్తర్వులు ఇవ్వవచ్చు. ఆ నిర్ణయాన్ని మళ్ళీ సుప్రీమ్ కోర్ట్ లో సవాలు చేయాలి. అది విచారణ జరిగి సుప్రీమ్ అభిప్రాయం బయటపడే నాటికీ మళ్ళి ఎన్నికలు రావచ్చు. అందుకేనేమో, రేవంత్ నిర్భయంగా 'ఇప్పుడప్పుడే ఎన్నికలేమి రావు' అని కుండ బద్దలు కొట్టి చెప్పాడు. రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలలో రేవంత్ రెడ్డి కే సీ ఆర్ కు ధీటైన వ్యక్తిగా తెలంగాణా ప్రజలు విశ్వసించారు కాబట్టే ఆయన సారధ్యంలోని కాంగ్రెస్ కు పట్టం కట్టారు.

మొన్నటికి మొన్న కే టి ఆర్, హరీష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేస్తున్న ఆరోపణలే మేమిటంటే కేవలం 13 నెలల పాలనలో ఒక లక్ష యాభై ఎనిమిది వేల కోట్లు అప్పులు రేవంత్ రెడ్డి చేశాడని. ఇదంతా ఢిల్లీ కాంగ్రెస్ కు ముడుపులుగా రేవంత్ పంపించాడని. ఎవ్వరూ కే టి ఆర్, హరీష్ రావుల ఈ ఆరోపణలను నమ్ముకున్నా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ బిల్లు ఆమోదానికి ముందు ఇచ్చే ముగింపు ఉపన్యాసంలో ఎలా ఎలా కే సి ఆర్ అడ్డగోలుగా అప్పులు చేసి ఆర్ధిక వ్యవస్థ చిన్నా భిన్నం చేసింది, దానిని తన ప్రభుత్వం ఎలా తీర్చుతున్నదీ, ఎవరికి ఎంతెంత అప్పులు చెల్లించితే ఎంత ఇంకా బాకీ ఉన్నది సవివరంగా చెప్పాడు. రాష్ట్రం మొత్తం నిర్ఘాంత పోయింది. ఇదిలా జరిగితే అవి తప్పనో, కరెక్ట్ అనో చెప్పాల్సింది పోయి, హరీష్ రావు ఆర్థిక మంత్రి చెప్పిన లెక్కకు, ముఖ్యమంత్రి చెప్పిన లెక్కకూ మధ్య తేడా ఉందని అసెంబ్లీ లో అనటం అందరికీ నవ్వు తెప్పించింది. ఒక మంత్రి చేసిన ప్రసంగంలో ఏవైనా కొరవదరవలుంటే, ముఖ్యమంత్రి అంతకన్నా సరైన లెక్క అసెంబ్లీ ముందు పెట్టవచ్చు. ముఖ్యమంత్రి చెప్పిందే అంతిమం. ఈ విషయం శాసనసభ అధికారాలు స్పష్టం చేస్తున్నాయి. అయినా ముఖ్యమంత్రి తమ తప్పుడు ప్రచారాన్నితిప్పికొట్టటం ఓర్వలేక, హరీష్ రావు పిల్ల చేష్టలకు దిగాడు.

ఇలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభాసుపాలు చేసి, ఎలాగైనా ఆయన పాలన ఒక విఫల ప్రయోగం అని నిరూపించడానికి తమకున్న వికృత తెలివితేటలన్నీ వాడుతున్నారు కే టీ ఆర్, హరీష్ రావులు. అందులో భాగంగానే రేవంత్ ప్రభుత్వం అభివృద్ధికోసం ఏ పని తలపెట్టినా అక్కడ తమ బి ఆర్ ఎస్ వారితో ఒక కృత్రిమ ఉద్యమం జరిపించటం, కోర్టులకెక్కి స్టే ఆర్డర్లు తెచ్చే ప్రయత్నం చేయటం చేస్తున్నారు కే టి ఆర్. ఈ ప్రయత్నాలలో వాళ్ళు గతంలో చేసిన ఉపన్యాసాలు, అభివృద్ధి పేరుతో అమ్మిన ప్రభుత్వ భూముల సంగతి మరిచిపోతున్నారు.

తెలంగాణా సమాజం తెలివయినది. తప్పక అన్నీ గుర్తుపెట్టుకొంటుంది. ఆంధ్రాపట్ల ద్వేషం విరజిమ్ముతూ, ఆంధ్రా తెలంగాణా నీళ్లను తరలించుకు పోతుందని ప్రచారం చేయటం కూడా తెలంగాణా సమాజం తప్పక గురిస్తుంది. పాకిస్తాన్ లో రాజకీయ పక్షాలు భారత్ పట్ల విద్వేషంతో, సైనిక సహాయంతో పాలన సాగిస్తాయి. అలానే కే సి ఆర్ నిరంతర ఆంధ్రా ద్వేషంతో, చంద్రబాబును తెలంగాణా ద్రోహిగా చూపించి అధికారంలోకి రావాలని చూస్తాడు. కానీ, చంద్రబాబుకు తెలంగాణాకు ఎటువంటి ద్రోహం చేయాలని లేదని, అలా చేసే నైజం కాదని, ఆంధ్రులకు బాగా తెలుసు. అలాగే ఆంధ్రాతో ఇచ్చిపుచ్చుకునే సంబంధాలున్న తెలంగాణా వారికి కూడా తెలుసు. కే సి ఆర్, అయన కుటుంబం ఇదే విషప్రచారాన్ని నమ్ముకొంటే శాశ్వతంగా చరిత్ర హీనులై పోతారేమో! చూడాలి.

(అక్షరాంజలి మాసపత్రిక మే, 2025)

చంద్రబాబును దెబ్బ తీయడానికి మత వివాదాలను సృష్టిస్తున్న జగన్ ముఠా!

చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఈ జూన్ కు ఒక సంవత్సరం అవుతుంది. ఈ సంవత్సర కాలంలో ఆంధ్ర రాష్ట్రాన్ని దారిలో పెట్టడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ముఖ్యంగా తెలుగు దేశం 16 మంది ఎం పి లు కేంద్రంలోని బీజేపీకి కొమ్ముకాయటం వలన రాష్ట్రానికి ఎంతో కొంత చేయటం తప్పనిసరైంది మోడీ సర్కారుకు. ఈ కారణంగా చంద్రబాబు ఢిల్లీ నుంచి వీలైనంత సహాయం కోరటం, కొంత కాకపోతే కొంతైన రావటం సజావుగా సాగింది. ఆ సహాయంతోనే దెబ్బతినిపోయిన పోలవరం, బీడు పడిపోయిన అమరావతి తిరిగి కోలుకోవటం ఆరంభమైంది.

ఈ క్రమంలో అమరావతికి ప్రపంచ బ్యాంకు నుంచి రుణం లభ్యం కాకుండా చూసేందుకు జగన్ ముఠా చేయని ప్రయత్నం లేదు. 2014-2019 మధ్య ఆడిన చెత్త నాటకాలనే మళ్ళీ ఆడే ప్రయత్నం చేశారు. అమరావతి పైన, చంద్రబాబు కులం పైన లెక్కలేనన్ని అర్థం పర్థం లేని ఆరోపణలు ప్రపంచ బ్యాంకుకు, ఇతర రుణాలిచ్చే బ్యాంకులకు మళ్ళీ పంపారు. అందువల్ల ఒక్క సారి ఆమోదంపొంది, రాష్ట్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వం గ్యారంటీలతో ఒప్పందం చేసుకున్నాక కూడా ప్రపంచ బ్యాంకు పదే పదే తన అధికార బృందాలను పంపి అమరావతిలోని అన్ని వర్గాలను కలిసి విచారణలు చేయవలసి వచ్చింది. ఇందువల్ల ఒక నాలుగు నెలల కాలం వృథా అయిందే తప్ప అమరావతికి అయిన నష్టం ఏమీ లేకపోవటం వలన ప్రజలందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

'అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినను తిననీయదు' అన్నట్టు ఉంటుంది అంధ్ర రాష్ట్రంలో జగన్ ముఠా అరాచకాలు. తన అయిదేళ్ల పాలనాకాలంలో అమరావతి, పోలవరం పై జగన్ పన్నిన కుట్రలు అన్నీ ఇన్నీ కావు. పోలవరం, అమరావతీలలో ఏది పూర్తైనా ఆ కీర్తి చంద్రబాబుకు వెళ్తుందన్న దుష్టాలోచనతో రాష్ట్రానికి ఒక భవిష్యత్తు కలిపించే ఈ రెండు ప్రాజెక్టులను ఆ మూలంగా నాశనం చేసిన ఘనత జగన్ ది. తిరిగి ఇవి ప్రాణం పోసుకోవటం ఆయన ఎంతమాత్రం సహించలేకపోతున్నాడు. అంతే గాదు ఆర్థికంగా ఇబ్బందులున్నా చంద్రబాబు తాను ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను కొన్ని ఇంకా అమలు చేయకపోయినా ప్రజలలో రగిలిపోయేంత వ్యతిరేకత రాకపోవటం జగన్ ను దహించేస్తున్నది. జగన్ ఏమి భావించారంటే చంద్రబాబు అధికారంలోకి వచ్చింది కేవలం సూపర్ సిక్స్ పథకాలతోనే. అవి అమలు చేయటానికి చాలినంత ధనం కొత్త ప్రభుత్వానికి లేదు కనుక త్వరలోనే చంద్రబాబు ప్రజల అసంతృప్తికి గురవుతాడు. దానిని తన రాజకీయ పునరాగమనానికి వాడుకోవచ్చును కొన్నాడు. కానీ, అలా జరగలేదు. జగన్ ఆశలన్నిఅడియాసలైనాయి. ఫలితంగా ఆయనలోని అసహనం తారాస్థాయికి చేరింది.

ఈ నేపథ్యంలో చంద్రబాబు పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రాకపోవడానికి ఉన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం. మొదటిది చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'చెత్త పన్ను' తీసేశాడు. గృహస్తు స్థాయిలో నెలకు రూ. 60-100 వరకూ మిగిలితే, షాపులు, బ్యాంకులు, ఆఫిసులకు నెలకు రూ. 500-1200 వరకూ ఆదా అయింది. అన్నింటికీ మించి మునిసిపల్ సేవలు, చెత్త తీసేయటం వంటివి ఒకప్పటికన్నా ఇప్పుడు పకడ్బందీగా సాగాయి. రెండవది నెల నెలా ఉద్యోగస్తులకు జీతాలు, ప్రజలకు ఇచ్చే పెన్షన్లు మొదటి తారీఖుకే

అందటం మొదలైంది. అంతేగాక నెల నెల ఇచ్చే పెన్షన్ లు రూ. 3000 ల నుంచి ఒకే సారి నాలుగు వేలకు పెరిగింది. వికలాంగులకు ఇచ్చే రూ. మూడు వేల పెన్షన్ ఒక్కసారిగా రూ. 6000 లకు పెంచాడు. అంటే ఒక్కొక పెన్షనరుకు సంవత్సరానికి రూ. 12000 లు, వికలాంగులకు సంవత్సరానికి రూ. 36, 000లు పెరిగాయి. ఇక పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ. 15,000 లు ప్రతినెలా ముట్ట చెపుతున్నారు. అంటే సుమారు 64 లక్షలమంది పేద వారికి 2024 ఏప్రిల్ నుంచి పూర్తి బకాయిలతో సహా ఇవి లభిస్తున్నాయి. ఈ మేరకు 64 లక్షల మందికి కొంత ఉపశమనం లభించినట్లేగా.

మూడవది ఉచిత గాస్ సిలిండర్ పథకం తొలి విడత లబ్దిదారులకు ఏ ఇబ్బంది లేకుండా అమలైంది. డబ్బుకట్టి సిలిండర్ కొన్న బీపీల్ కుటుంబీకులందరికీ ఏ నెలకానెలే డబ్బులు వారి ఎకౌంటుల్లో పడిపోయాయి. నాల్గవది ధాన్యం అమ్మిన రైతులకు, పాత బకాయిలతో పాటు ఇప్పటి అమ్మకం డబ్బులు గూడా వెంటనే బ్యాంకులలో పడిపోయాయి. అన్నింటికీ మించి అన్నా కాంటీన్లు తొలి విడతలో 180, రెండవ విడతలో మరో వంద ఏర్పాటు చేసి బీదా బిక్కికి, వలస కూలీలకు, వైద్యంకోసం నగరాలకు, పట్టణాలకు వచ్చేవారికి అయిదు రూపాయలకే టిఫిన్, భోజనం అందించటం ఎంతో మందికి మేలు చేస్తున్నది.

గత అయిదేళ్ల కాలంలో గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి విడుదల కావలసిన నిధులు రాకపోవటంతో పంచాయితీ సర్పంచులు సహా అనేక మంది జీవనోపాధి, ఆదాయం కోల్పోయి ఆత్మ హత్యలు చేసుకొన్నారు. ఈ ప్రభుత్వం రాగానే పాత బకాయిలతో పాటు ఇప్పుడు కేంద్రం విడుదల చేసిన గ్రామ పంచాయతీ నిధులను కూడా విడుదల చేసింది. ముఖ్యంగా గ్రామీణ, అటవీ శాఖా మాత్యులు, ఉపముఖ్యమంత్రి

ఈ విషయంలో చాలినంత శ్రద్ధ చూపటంతో గ్రామాల స్థాయిలో అసంతృప్తి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నాలుగు నెలలలోనే రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బ తిన్న రోడ్లను ఒక మోస్తరుగా బాగు చేసేందుకు శ్రీకారం చుట్టటంతో గ్రామీణ స్థాయినుంచి పట్టణ స్థాయి వరకు రవాణా దారులు, వాహన దారులు సేద తీరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డి ఏ ఎర్రియర్స్ తో సహా జీ పి ఎఫ్ డబ్బులు సుమారు 25000 కోట్ల బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వం. వీటిలో కొంత మొత్తాలను విడతల వారీగా విడుదల చేసింది కూటమి ప్రభుత్వం.

ఆరోగ్యశ్రీకి గత ప్రభుత్వం దిగి పోయేనాటికి ఉంచిన మూడు వేలకోట్ల బాకాయిలను దశల వారీగా విడుదల చేస్తూ ఆరోగ్య శ్రీ సేవలు దెబ్బతినకుండా కాపాడుతూ వచ్చింది కూటమి ప్రభుత్వం. అయినప్పటకీ అప్పుడప్పుడు అనేక పట్టణాలలో అనేక ఆసుపత్రులు తాము ఆరోగ్యశ్రీ క్రింద సేవలందించమని రోగులను ఇబ్బందులు పెట్టిన ఘటనలు చాలానే ఉన్న సంగతి ప్రభుత్వానికి తెలియనిది కాదు. అదే సమయంలో సేవా రంగంలోని 1.20 కోట్ల కార్మికులకు ప్రమాద బీమా రాష్ట్రం , కేంద్రం చెరి ఒక వాటా భరిస్తాయని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అంతేగాక రాష్ట్రంలోని బీపీల్ కుటుంబాలకు ఆరోగ్య బీమా నేరుగా 25 లక్షలకు పెంచింది. దీని ప్రీమియం కూడా రాష్ట్రప్రభుత్వమే భరిస్తుంది. దీనికింద కూడా ఆరోగ్య శ్రీ సేవలు అందుతాయని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఆయుశ్మాన్ భారత్ కింద 70 ఏళ్ళు పైబడిన బీపీఎల్ కుటుంబీకులకు అదనంగా మరో 5 లక్షల ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నట్లు ప్రకటించింది.

ఇవన్నీ ఒక ఎత్తు. జగన్ హయాంలో ఏదో ఒక పేరున, ముఖ్యంగా 'జగన్' పేరున, విడుదలయ్యే వేలకు వేల రూపాయల రాష్ట్ర ఖజానా

డబ్బులు ఈ ఏడాది తమ అకౌంట్లలో జమ కాలేదని కొంతమందికి పెరపెరలాడటం సహజమే కదా. అలా కోట్లాది రూపాయలు అప్పణంగా పంచడంతోనే కదా రాష్ట్రం ఏ అభివృద్ధి నోచుకోకుండా వెనక్కి పోయింది. అది అర్థం చేసుకొన్న ప్రజలు అలాంటి పెరపెరలను పట్టించుకోవడంలేదు. చంద్రబాబు చెప్పింది చెప్పినట్లు అమరావతిని, పోలవరాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని గట్టిగా విశ్వసిస్తున్నారు కాబట్టే గ్రామీణ స్థాయినుంచి పట్టణాల వరకూ తీవ్ర వ్యతిరేకత చూపటం లేదు. ఇవన్నీ అర్థమైన జగన్, రాష్ట్రాన్ని అస్థిర పాలు, గొడవల పాలు చేయాలని వేరే కుటిల ప్రయత్నాలకు శ్రీ కారం చుట్టారు. అందులో భాగం గానే మత ఘర్షణలను రేపేందుకు కుయుక్తులు పన్నుతున్నారు.

ఇటీవల జరిగిన పాస్టర్ రోడ్ ఏక్సిడెంట్ ను హత్య గా చూపి, క్రైస్తవులలో అలజడి, ప్రభుత్వ వ్యతిరేకత రగల్చాలని ప్రయత్నించటం ప్రజలు చాలా జాగ్రత్తగా గమనిస్తున్నారు. కొన్ని జిల్లాలలో మాత్రమే కేంద్రీకృతమైన ఈ అలజడిని ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం చాలా వ్యూహాత్మకంగా ఎదుర్కొంటూ, ఈ కుటిల ప్రయత్నాలను నమ్మవద్దని ప్రజలను శాయశక్తులా ఎడ్యుకేట్ చేస్తున్నది. ముఖ్యంగా ప్రాభవం కోల్పోయి, టీడీపీలో సీటు రాక భంగపడిన ఒక ఎం పి జగన్ పంచన చేరి ఈ రకమైన మత యాగీ చేస్తున్నాడు. ఒక వర్గం దళిత వర్గానికి చెందిన ఇతను, అదే వర్గానికి చెందికూడా క్రైస్తవాన్ని తన మతంగా స్వీకరించిన వారిని జతకట్టి ఈ యాగీ చేయటం ప్రభుత్వం శ్రద్ధగా గమనిస్తున్నది. గత నెల రోజులుగా సాగుతున్న ఈ గొడవ ఇంతకీ తారా స్థాయికి చేరకపోవడంతో, తిరుపతి కేంద్రంగా అక్కడ గోశాలలో ఆవులు చనిపోతున్నాయని మరో మత ఘర్షణకు శ్రీకారం చుట్టాలని ప్రయత్నించి భంగ పడింది వైసిపి. అక్కడా ప్రభుత్వం ఎంతో సహనంతో ప్రవర్తించి ఎటువంటి మత ఉద్రిక్తలకు తావు ఇవ్వకుండా తిరుమల పవిత్రతను కాపాడు తున్నది.

జగన్ ప్రభుత్వ హయాంలో మంత్రులు శ్రీవారి దర్శనానికి టిక్కెట్లు ఎలా అమ్ముకొని వ్యాపారం చేసింది, ఆ అయిదేళ్ల కాలంలో శ్రీ వారి ఆలయానికి వైసీపీ రంగులతో లైటింగ్ పెట్టడం, కొండపైన బాహాటంగానే క్రైస్తవ మత ప్రచారం చేయటం, చౌక బారు భోజనం పెట్టటం వంటివి చూసిన ఆంధ్రా ప్రజలు ఇప్పుడు వైసీపీ చౌకబారు ఎత్తుగడలను నమ్మడానికి సిద్ధంగా లేరు. ముఖ విలువలు ఎంతమాత్రం లేని రోజా, శ్యామల, అంబటి, పేర్ని నాని, భూమన వంటి వారు రాసుకొచ్చిన స్క్రిప్టులు చదివితే ప్రజలు నమ్ముతారా? వీరు ప్రధానంగా అవినీతిపరులు, ప్రజల చేతిలో ఘోరంగా ఓడిపోయిన వారు. వారి మాటలకు విలువ ఎవరిస్తారు? అందువల్లే వారికి వ్యతిరేకంగా విపరీతమైన ట్రోల్స్ చలామణి అవుతున్నాయి. అయినా గ్రహించరు. ప్రజలు అనుగ్రహించి వీరి మాటలు చెవికెక్కించుకోరు. అలా తమ రాజకీయ సమాధి తామే కట్టుకొంటున్నారు వీళ్ళు.

ప్రజలు ఐదేళ్లు పాలించమని కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని, ఉద్యోగాలు, పరిశ్రమలు తెస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇంచింది. ఆ మేరకు ఆ ప్రభుత్వాన్ని పనిచేయనీయాలి. అలా చేయటంలో వైఫల్యం అయినప్పుడు ఎలా సాగనంపాలో ప్రజలకు తెలుసు. ఆ ఐదేళ్లు ఉండబట్టలేక, అసహనంతో కూటమి ప్రభుత్వానికి ఎదో మచ్చ తేవాలని, దాని ప్రగతి శీల చర్యలకు అడ్డంకులు కలిపించి విఫలం చేయాలని చూస్తే ప్రతిపక్షంగా ఉండే అర్హత కూడా కోల్పోతారు. జాగ్రత్త!

(అక్షరాంజలి మాసపత్రిక జూన్, 2025)

కరోనా మళ్ళీ పలకరింపుకు వచ్చింది! జాగ్రత్త, జాగ్రత్త!

కోవిడ్ -19 అని అందరూ వినుంటారు. అప్పుడే ఆరేళ్ళు అయిపోయిందిగా! కొందరు మరచిపోయింటారులే. కోవిడ్ అంటే 'కరోనా వైరస్ డిసీస్ -2019' అని అర్థం. ఇది ఒక రకమైన వైరస్. 'శార్స్ -కొవ్ -2' అనేది ఈ వైరస్ అసలు శాస్త్రీయ పేరు. ఇప్పుడు కరోనా మళ్ళీ పలకరింపుకు వచ్చింది! సుమారు 4000 పైచిలుకు దీని బారిన పడ్డట్టు తాజా వార్తలు చెబుతున్నాయి. అయితే మరణించిన వారి సంఖ్య గతంలోలా వేలలో లేదు. సుమారు 30-40 మంది దాకా ఇప్పటి వరకూ చనిపోయారని వార్తలను బట్టి తెలుస్తున్నాయి.

ఈ వైరస్ తొలిసారి 2019లో కనిపించింది కాబట్టి దీనిని 'కోవిడ్ -19' అనికూడా పిలుస్తారు. ఇది తొలిసారి 2019 డిసెంబర్ లో కనిపించినా, ప్రపంచమంతా బాగా వ్యాపించింది మాత్రం 2020లోనే. అప్పుడు భారత దేశంలో కన్నా పాశ్చాత్య దేశాలలో ఇది తీవ్రంగా విజృంభించింది. మనుషులు పిట్టల్లా పడి చనిపోతున్నట్టు ఫోటోలు సోషల్ మీడియాలో గిరికీలు కొట్టాయి. మానవ సంబంధాలను తిరగ రాసిన ఈ వైరస్ మానవ జాతికి మిగిల్చిన దుఃఖం అంతా ఇంతా కాదు.

పొడి దగ్గు, జ్వరంతో తొలుత కనిపించే ఈ వైరస్ లక్షణాలు క్రమంగా ముదిరే క్రమంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలిగించటం మొదలు పెడుతుంది. ముక్కుకు వాసన గ్రహించే లక్షణాన్ని దెబ్బతీస్తుంది. ఒక రకంగా ఇది జలుబు, జ్వరంలా ఏమంత ప్రమాద కారి కానట్టు కనిపిస్తూ, క్రమంగా రోగి శరీర రక్షణ వ్యవస్థను పూర్తిగా తన అదుపులోకి తీసుకోవటంతో రోగి మరణం అనివార్యం అవుతుంది. మామూలు జలుబు, జ్వరంలో ఇది జరగదు. వ్యక్తి రోగ నిరోధక వ్యవస్థను

తన చేతిలోకి తీసుకొని, నిర్వీర్యం చేయటం కారణంగానే మనుషులు క్షణాల్లో పిట్టలు రాలినట్టు రాలారు. కుటుంబాలు కుటుంబాలే మాయమై పోయాయి. ఈ రోగం కుటుంబం లో ఎవరికి వచ్చినా మిగతా అందరికి వస్తుంది. అందువల్ల కుటుంసభ్యులు రోగిని ఆసుపత్రిలో చేర్చి తిరిగి అటువైపు చూడటం మానేశారు. చనిపోయిన వారిని ఆసుపత్రి వారే స్మశాననానికి పంపి దహనం చేయటం ఈ కరోనా విషాదంలో మరపురాని పతాక స్థాయి.

ఈ వైరస్ కు గురైన మనిషి అది సోకిన లక్షణాలు ప్రదర్శించడానికి పక్షం రోజులు పడుతుంది. కొందరిలో వైరస్ సోకినా ఎటువంటి లక్షణాలు కనబడవు. కొందరిలో వైరస్ లక్షణాలు ఒక మోస్తరుగా కనిపిస్తాయి. కేవలం 14%శాతం మందిలోనే ఈ వైరస్ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. అందులోనూ ఒక 5%మందికి మరీ తీవ్ర లక్షణాలు ఏర్పడి ప్రాణ ప్రమాదంగా మారతాయి. కొందరిలో ఈ వైరస్ లక్షణాలు తీవ్రంగా లేకపోయినా నెలల తరబడి ఉండి, శరీరంలో ఇతర అవయవాలను దెబ్బ తీస్తాయి.

కోవిడ్ వైరస్ తొలుత చైనాలోని వుహాన్ లో కనిపించింది. చైనాలోని ఒక జీవ రసాయనాల ప్రయోగ శాల నుంచి విడుదలైనట్టు మొదట్లో వార్తలు వచ్చాయి. అమెరికా సహా అనేక పాశ్చాత్య దేశాలు ఇదే వాదనను బలంగా నమ్మాయి. ఫలితంగా చైనా వస్తువుల దిగుమతులను, ఉత్పత్తులను నిషేధించాయి. మొదట్లో మామూలు మలేరియాకి ఇచ్చే మందులే దీనికి ఇచ్చే వారు. ఈ కారణంగా క్లోరోక్విన్ మందును మనదేశం సహా అనేక ఆసియా దేశాలనుంచి పాశ్చాత్య దేశాల వారు దిగుమతి చేసుకొన్నారు. మనదేశం మనకు కావాలంటే అప్పుడున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

భారత దేశాన్ని బెదిరించి మరీ ప్రత్యేక విమానాలలో క్లోరోక్విన్ ను దిగుమతి చేసికొన్నాడు. దురదృష్టం ఏమిటంటే ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడే ఈ వైరస్ ప్రపంచ వ్యాప్తంగా ప్రబలటం.

ముఖ్యంగా రెండవసారి 2021లో వచ్చిన ఈ వైరస్ దెబ్బకు ప్రపంచంలోనే అధిక జనాభా ఉన్న మనదేశం నుంచి అధిక శాతం రోగులు చనిపోయారు. సుమారు మూడుకోట్ల మంది ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. మందులు, రసాయనాల ఉత్పత్తులలో ప్రథమ స్థానం ఉన్న భారత్ దేశం, చైనా, రష్యాలతో పోటీపడి దీనిని నిరోధించే వాక్సిన్ ల ఉత్పత్తి ప్రారంభించి కొంతవరకూ విజయం సాధించింది. రష్యా ఉత్పత్తి చేసిన వాక్సిన్ కు మొదట ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం లభించినా, క్రమంగా భారత దేశం ఉత్పత్తి చేసిన వాక్సిన్ లకు మంచి ఆదరణనే లభించింది. మన దేశంలో ఉత్పత్తైన కొవాక్సిన్, కోవిషీల్డ్ లను భారత ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా ఇచ్చింది. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు కూడా తమ ఉద్యోగులకు ఉచితంగా ఇచ్చారు. కొంతమంది ప్రైవేటుగా వాక్సిన్ వేయించుకున్న వారు మాత్రం నామ మాత్రం ధర చెల్లించి వేయించుకున్నారు.

ఏది ఏమైనా ప్రస్తుతం కరోనా తిరిగి తలెత్తిన వేళ మన గతానుభవాలను, నాటి లోపాలను ఒకసారి పునర్మూల్యాంకనం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. కరోనా విజృంభించిన వేళ భారత దేశమే కాదు, అమెరికా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి దేశాలు కూడా అయోమయానికి గురై చాలా మూర?ంగా ప్రవర్తించాయి. వేలల్లో ప్రజలు చనిపోవటంతో, ప్రభుత్వాలు ఒక్కసారిగా 'బిక్క' ముఖం వేసి, 'పానిక్ బటన్ ' నొక్కినట్లు కంగారు, కంగారుగా నిర్ణయాలు తీసుకున్నాయి.

ప్రజలను తీవ్ర బాధలకు గురిచేశారు. ఏవిధమైన శాస్త్రీయ ఆధారం లేకుండానే, కరోనా వైరస్ ప్రవర్తన పైన స్పష్టమైన అవగాహన లేకుండానే ప్రజలను మూర?పు ఆలోచనలతో, అనాలోచిత నిబంధనలతో నానా పాట్లకు గురిచేశారు. ముఖానికి మాస్క్ తగిలించుకోకపోతే వేయి రూపాయలు జరిమానా, కట్టమన్న వారిని కొట్టడం, జైల్లో పెట్టడం, చంపేయటం వంటి మూర?పు అనాలోచిత చర్యలకు ప్రభుత్వాలు దిగాయి. పోనీ మాస్క్ వేసుకొన్నంత మాత్రాన 'కరోనా ' రాదని ఏ వైద్యాధికారైనా హామీ ఇచ్చాడా అంటే ఇవ్వలేదు.

ముఖ్యంగా టెలివిజన్ డిబేట్లు వందల్లో, వేలల్లో పెరిగిపోయి 'మాస్క్' లొక్కటే కరోనా సమస్యకు పరిష్కారం అన్నట్లు ప్రచారం చేశాయి. అదే సమయంలో స్టెరిలైజ్డ్ సూట్ లు ధరించి, మాస్క్ ధరించి రోగులకు చికిత్స చేస్తున్న నర్సులు, డాక్టర్లు, అటెండర్లు కూడా కరోనా బారిన పడి అసువులు బాసారు. అందుకు సమాధానం ఏమిటంటే ఎవరూ పెదవి విప్పరు. తర్కానికి, విజ్ఞ్యానానికి నిలవని సూచనలు, సలహాలు రాజ్యమేలాయి. వాస్తవ సమాచారం పూర్తిగా తొక్కిపెట్టారు. 'కరోనా నివారణకు మాస్క్ ధరించటమే మొదటి మెట్టు' అన్న చందాన డాక్టర్లు, టీవీ ఏంకర్లు ప్రజలను హిప్నోటైజ్ చేశారు. బీదా బిక్కి తడవకు పది రూపాయలు పెట్టి ఇంటిల్లిపాదికి మాస్కు కొనలేక నానా పాట్ల బారిన పడ్డారు. అదేసమయంలో గుడ్డ మాస్కు కాదు, ఎన్ 95 మాస్కు అయితే అసలు కరోనా వచ్చే అవకాశం రాదని మరో కొత్త వ్యాపారానికి తెర దీశారు.

ఇదంతా ఎంత మూర్ఖపు ప్రచారమో కొంచెం లోతుగా ఆలోచిస్తే అర్థం అవుతుంది. వైరస్ అనేది ఒక రసాయన కణం. ఇందులో ఒక

ఆర్ ఎన్ ఏ అనే ఒకే జన్యువు పోగు, దాని చుట్టూ ఒక ప్రోటీన్ కవచం ఉంటుంది. ఇది ఏదైనా జీవ పదార్థం స్పర్శ లోకి వచ్చినప్పుడు. ఆ పదార్థం ఉపరితలంలో తన ప్రోటీన్ కవచాన్ని రసాయన చర్య జరిపించి, తద్వారా జీవి శరీరంలోకి చొచ్చుకు పోతుంది. ఇది ఈ సృష్టి లోని అన్ని వైరస్లకు వర్తించే ప్రాధమిక సూత్రం. కొన్ని వైరస్లకు డి ఎన్ ఏ అనే జన్యువులు రెండు పోగుల్లో ఉంటాయి. మిగతా అంతా మామూలే. అయితే వైరస్ చుట్టూ ఉండే ప్రోటీన్ కవచం, వైరస్ రకాన్ని బట్టి రూపు రేఖలలో వేరుగా ఉంటుంది. కొన్ని ప్రోటీన్ కవచాలు రసాయనికంగా ఎలా ఉంటాయంటే మానవ శరీరంలో ఉండే రక్షణ కణాల గుర్తింపును తప్పించుకోగలిగి ఉంటాయి. ఈ కారణంగా మన శరీరంలో ఉన్న రక్షణ కణాలు (తెల్ల రక్త కణాలు, టి 4 కణాలు) దీనిని ఏమీ చేయలేక పోతాయి. ఇవి ఒక సారి జీవ పదార్థంలోకి పోయాక, లక్షలలో విభజన పొంది ఊహించలేనంత సంఖ్యగా అభివృద్ధి చెందుతాయి. అంతేగాక, మనిషి కణాలలోని ఆర్ ఎన్ ఏ తో కానీ, డి ఎన్ ఏ తో కాని సమ్మిళితమై మనిషి శరీర నిరోధక వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి, మానవ శరీరాన్ని తమ అదుపులోకి తీసుకొంటాయి.

ఇది ప్రాధమిక శాస్త్రీయ అవగాహన. మనిషి శరీరం తల నుంచి పాదాల దాకా మొత్తం రోమ సంబంధమైన రంధ్రాలున్నాయి. కాబట్టి కేవలం శ్వాస, జలుబు, తుమ్ము ద్వారానో, చేతులు కలపడం, దగ్గరగా నుంచొని మాట్లాడటం వల్లనో కరోనా వైరస్ సోకుతుందని టి వి చర్చలలో, డాక్టర్ల వాదనలలో వినిపించటం ఎంత అశాస్త్రీయం? డాక్టర్లు ఎంత మూర?ంగా తయారయ్యారంటే వేరే కారణంతో ఒక రోగి తన వద్దకు వస్తే, ఆరు అడుగుల దూరంలో రోగిని కూర్చోబెట్టి, మధ్యలో ఒక

మందమైన తెర కట్టి, రోగి చెప్పింది విని మందులు రాయటం, వైద్యం చేయటం ఆరంభించారు.

ఇంత మూర్ఖం ప్రబలిన వేళ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచానికి మార్గ దర్శకత్వం వహించకుండా నాటకాలు మొదలు పెట్టింది. కరోనా వ్యాధి గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన తొలి ప్రకటన రోజు నుంచి దశల వారిగా ఆ సంస్థ వెబ్సైటు చూస్తే రోజుకొక కొత్త వ్యూహం, కొత్త పద్ధతి, కొత్త మందు కరోనా నివారణకు ప్రకటించటం ఆరంభించింది. సిగ్గు చేటు. ఎందుకంటే దాని అభిప్రాయాలు ఇదమిద్ధంగా, శాస్త్రీయ వివరణలతో లేవు. ఎట్లా పరిశోధనలు చెబుతుంటే అలా అభిప్రాయాలు మార్చుడం తప్ప, 'ఇది ఇలా కాదు' అని చెప్పే స్థితిలో లేదు. ఆనాడు ఈ చిర్రెత్తుకొచ్చే పరిస్థితి చూసి అమెరికా అధ్యక్షుడు తమ దేశం ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి తప్పుకొంటుందని ప్రకటించాడు. అలానే ఈ సారి అమెరికా అధ్యక్షుడు కాగానే ఆ సంస్థనుంచి తప్పుకున్నాడు.

ఇంకో మూర్ఖాతి మూర్ఖ నిర్ణయం ఏమిటంటే 'లాక్ డౌన్ ' అనే దానిని ఒకటి ప్రకటించి, కార్మికులు, కూలి వారికి జీవనోపాధి లేకుండా చేయటం. భారత దేశంలో ఎక్కడెక్కడో పనిచేస్తున్న శ్రామిక వర్గం వందల మైళ్ళు నడిచి తమ సొంత ఊళ్లకు చేరారు. జీవనోపాధి లేక, డబ్బులు లేక, పసి పిల్లలతో వాళ్ళు అలా వేల మైళ్ళు నడుస్తుంటే కంటి తడి పెట్టని వాడు మనిషి కాదనిపించింది. ముక్కిపోయిన బియ్యం, కందిపప్పు, ఒకసారి పది హేను వందలు డబ్బులు వారి ఎకౌంట్లలో వేసి కేంద్ర ప్రభుత్వం తమ బాధ్యత అయిపోయినట్టు చేతులు దులుపుకొంది. మార్గమధ్యంలో ఎందరో చనిపోయారు. కరోనాతో ఎంతోమంది

చనిపోయారు. బంధువులు, ఆఖరుకు భార్యా, భర్తలు కూడా ఒకరి శవాన్ని మరొకరు చూడటానికి సాహసించలేదు. అందరూ ఉండి అనాధలుగా చనిపోయారు. కరోనా ఇంత క్రూరమైందా అంటే నిజానికి కాదు. మూర?పు ప్రచారం, శాస్త్రవేత్తల, డాక్టర్ల మూర్ఖపు వైద్య తీరు, అశాస్త్రీయ పద్ధతులు, మాస్క్ ల పేరునా, మందుల పేరున సాగిన మార్కెట్ దోపిడి వెరసి మానవ జీవితం కకలావికలం చేశారు.

వేయి రూపాయలతో పోయే వైద్యాన్ని లక్షలు చేశారు. ఇంజెక్షన్లు మందుల పేరున, ఆసుపత్రి ఫీజుల పేరునా లక్షలు మింగేసాయి కార్పొరేట్ ఆసుపత్రులు. అయినా ఆయుష్షు ఉన్నవారే బ్రతికారు. కార్పొరేట్ వైద్యం చేసినా కుటుంబాలు, కుటుంబాలు ఊడ్చుకుపోయాయి. 'డబ్బు పోయి, మనుషులు పోయి మరి వారిని పట్టిన శని కూడా పోయాడా' అన్నట్లు మానవజీవితం అతలా కుతలం అయింది. కళ్ళం ముందు మానవ అశాస్త్రీయ మూర్ఖత్వం, అంతే ధీటుగా పోటీపడ్డ ప్రభుత్వ మూర్ఖత్వం కలిసి మృత్యు హేల చూపించారు.

ఇప్పుడు మళ్ళీ కరోనా మనల్ని పలకరించడానికి, ఇప్పుడైనా బుద్ధిగా, విజ్ఞతతో తనను జాగ్రత్తగా ఎదుర్కొంటావో లేదో చూడడానికన్నట్టు మళ్ళీ వచ్చింది. ముఖ్యంగా ఎండలు విపరీతంగా ఉన్నప్పుడు, దుమ్ము ధూళి కాలుష్యం పెరిగినప్పుడు, వాతావరణంలో ఆక్సిజన్ శాతం తగ్గినప్పుడు మనుషులలో కలిగే రసాయన మార్పులనుంచి కూడా కరోనా రసాయన అణువు క్రియాత్మకం కావచ్చు. కొద్దిమాత్రం వైద్యం, కొంత నీడపట్టున విశ్రాన్తి తీసుకొంటే సరిపోతుంది. వివేకం పోగొట్టుకొని, వాడు చెప్పాడు, వీడు చెప్పాడని భయానికి లోనై, మనం భయపడి, ఊళ్ళో అందరినీ భయపెట్టి జీవితం నరకం చేసికోకండి.

కరోనాకు చాలా సాధారణ వైద్యం చాలు. లక్షలు ఖర్చు పెట్టి దివాలా తీయకండి. భయం వీడి బంధువులు, మిత్రులు, ఆత్మీయులు కరోనా బారిన పడ్డ వ్యక్తిని సంతోషంగా ఉంచండి. ఇవాళో, రేపో చచ్చిపోతాడన్నట్టు చూడకండి. ప్రేమ, ఆప్యాయత చనిపోయే మనిషిని కూడా బ్రతికిస్తుంది. దయచేసి మానవత్వం మరవకండి. జాగ్రత్త!

(అక్షరాంజలి మాస పత్రిక జులై 2025)

మోడీకనామిక్స్.... మసిపూసి మారేడుకాయ!

ఇటీవల భారత ప్రభుత్వ ఆర్థికశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం భారత్ ఈ ముగిసే మార్చ్ నాటికి 6. 4 శాతం జిడిపి సాధించిందిట. అయితే, ఆ ప్రకటనపై వెంటనే స్పందించిన ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త అరవింద సుబ్రహ్మణ్యం 'ఆ లెక్కలు చాలా అయోమయంగా ఉన్నాయని, ఇంకా చాలా స్పష్టత ఉంటే కానీ అవి సరైనవా, కాదా చెప్పటం కష్టం' అని వ్యాఖ్యానించటం గమనార్హం. అరవింద సుబ్రహ్మణ్యం 2014-2018 మధ్యలో ఇదే బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేసిన విషయం మనం ఇక్కడ మరిచిపోకూడదు. ఈ ఏడాది ఫిబ్రవరి 7, 2024 న పార్లమెంట్ లో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి పై చర్చ సందర్భంగా ఎన్నో ముఖ్యమైన విషయాలు బయట పడ్డాయి. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి, అంటే 2014లో , భారతదేశం 2.05 ట్రిలియన్ డాల్లర్ల విలువైన మార్కెట్ పరిమాణం కలిగిఉంది. అప్పటి మన దేశం మొత్తం అప్పు యాభై అయిదు లక్షల, ఎనభై ఏడు వేల నూట నలభై తొమ్మిది పాయింట్ ముప్పయి మూడు కోట్ల రూపాయలు. నాటి జీడీపీ 7. 41 శాతం. అంటే ఏటా 1. 2% శాతం జిడీపిలో మార్పు వచ్చేది. ప్రస్తుతం భారత దేశ మార్కెట్ పరిమాణం 3. 75 ట్రిలియన్ డాలర్లు. అయితే 2024 లో మన మొత్తం అప్పు 2014 నాటి అప్పుకు మూడు రెట్లు పెరిగింది.

2014-2024 మధ్యకాలంలో ఒక్క 2020లో తప్ప మన జీడీపీ ఎప్పుడూ యూపీఏ ప్రభుత్వం పాలన మోడీకి అప్పగించేనాటికన్నా తక్కువగానే ఉండిందన్నది ఆర్థిక శాఖ చెప్పే గణాంకాలు. 21-22లో 7. 0%, 20-21లో 9. 5% (కోవిడ్ సమయంలో), 19-20లో -5.

83%, 18–19లో 3. 87% అని గణాంకాలు చెబుతున్నాయి. 2019–20లో మన ఆర్థిక లోటు ఏడు లక్షల అరవైఆరు వేల ఎనిమిదివందల ఎనభై ఆరు కోట్ల రూపాయలుంటే, 20–21నాటికి మన ఆర్థిక లోటు పదిహేనిమిది లక్షల నలభయి ఎనిమిదివేల ఆరువందల యాభై కోట్లు. అంటే మన జిడిపి ప్రగతి 6.4 శాతం అప్పులనుంచీ వచ్చిందన్నమాట, ఆదాయం నుంచి కాదు. ఆర్థిక శాఖ గణాంకాలిట్లుంటే, మన మోడీ భారత దేశాన్ని తనే ప్రపంచంలోని మూడవ ఆర్థిక శక్తిగా మారుస్తున్నట్టు ఊదర కొడుతూ ఉపన్యాసాలు దంచుతుంటాడు.

నిజానికి మోడీ ప్రభుత్వం పాలించిన ఈ దశాబ్ద కాలంలో దేశంలో ఉత్పత్తి రంగంలో ఒక్క కొత్త పరిశ్రమా రాలేదు. కొత్త ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. కొత్త ఉపాధి అవకాశాలు పెరగలేదు. యూపీఏ గవర్నమెంట్ గద్దె దిగేనాటికి ఎన్ని సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయో తరువాత కాలంలోనూ అన్నే ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఆంధ్రా , తెలంగాణాలలో విభజన చట్టం ప్రకారం ఏర్పరచిన విద్యా సంస్థలకు సమగ్ర రూపం ఇవ్వటంలోనే పుణ్య కాలమంతా గడిచిపోయింది. ఇంకా వాటిల్లో అన్ని విభాగాలు ఏర్పడలేదు. అధ్యాపకుల నియామకాలు జరగలేదు. తెలంగాణాలో పెడతామన్న ఎయిమ్స్ , ఆంధ్రాలో పెట్టిన ఎయిమ్స్ ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయటం ఆరంభం కాలేదు. ఈలోపలే వాటిని జాతికి అంకితం ఇచ్చేసాడు మోడీ . ఇక ప్రభుత్వరంగ పరిశ్రమల నుంచి ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఉధృతిగా ఆరంభం అయింది. అందులో భాగంగానే ఆంధ్రాలో (నాడు ఉమ్మడి రాష్ట్రంలో) ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటుకు మంగళం పాడే కార్యక్రమం ప్రారంభించారు. ఆయన ఎంతగానో అభిమానించే ఆదానికి దాన్ని కట్టబెట్టేందుకు కావలసిన

అన్ని లాంఛనాలను క్రమంగా చాపక్రింద నీరులా పూర్తిచేసుకొచ్చారు. విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఖాజీ పేట కోచ్ ఫ్యాక్టరీ, మణుగూరు స్పాంజ్ ఐరన్ , విశాఖ రైల్వే జోన్ అన్ని నీటిమీద రాతలు లాగానే అలలపై ఉగిసలాడుతూ, ఎక్కడికో కొట్టుకుపోతున్నాయి.

వాస్తవంలో మోడీకి ఉద్యోగ పరికల్పన చేసే ఉద్దేశం ఏదీ లేదు. కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇవ్వవలసిన జీతభత్యాల విషయంలో, పెన్షన్ వసతి కలిపించే అంశంలోనూ మోడీ వైఖరి 'ఎంత తక్కువ భారంలో పనిజరిగితే అంత మంచిదనే' టట్టు గానే ఉంది. సి పి ఎస్ విధానంలో కూడా ప్రభుత్వం ఎన్ పి ఎస్ కు తన వాటా చెల్లించాల్సి ఉంటుంది. అదిగూడ ఇష్టం లేదు. అందువల్లనే కేంద్రప్రభుత్వ ఉద్యోగానియామకాలు పూర్తిగా నిలిపివేశారు మోడీ. ఆఖరుకు సైన్యం నియామకాలలో కూడా (అగ్నిపథ్/అగ్ని వీర్' పథకం) కేవలం నాలుగు సంవత్సరాలకే పరిమితమయ్యే సేవా నియమాలు రూపొందించారు. దేశ ఆర్ధిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, పైకి మాత్రం ప్రపంచంలోనే మూడవ పెద్ద మార్కెట్ పరిమాణం అని డప్పులు కొడుతుంటారు మోడీ. నిజానికి పి వి నరసింహారావు తెచ్చిన ఆర్ధిక సంస్కరణల వల్లనే భారత దేశం నేడు మూడవ అతిపెద్ద మార్కెట్ గా అవతరించబోతున్నదే తప్ప మోడీ ఏదో చేసినందువల్ల కాదు. ఈ విషయం మోడీకి బాగా తెలుసు. అందుకే పి వి కి భారత రత్న ఇచ్చారు.

మోడీ ఆర్ధిక మాయాజాలం ఎలా ఉంటుందంటే 'ప్రజల డబ్బులను ఒకరి జేబునుంచి మరొకరికి మారుస్తూ' తనేదో గొప్ప నూతన ఆవిష్కరణ/ ఒరవడి సృష్టించినట్టు చేస్తాడు. ఇక్కడో ఉదాహరణ చేబితే సామాన్యులకు బాగా అర్ధం అవుతుంది. కోవిడ్ సమయంలో భారత దేశం అంతా

లాక్డౌన్ విధించి ప్రజలను కదలకుండా చేశారు. అదేసమయంలో అత్యవసర ప్రయాణాలకు ప్రత్యేక రైళ్లను నడిపారు. వాటిని 'స్పెషల్స్' అని పిలిచి వాటి ధరలను రెండు రెట్లు పెంచేశారు. పాసింజర్ రైళ్లను రద్దుచేసి వాటి బదులు అన్ని రైళ్లు ఎక్స్ప్రెస్ రైళ్ళే అని మర్చి కనీస చార్జీలు పది రూపాయల నుంచి ముప్ఫయి రూపాయలకు పెంచి సామాన్యుడి నడ్డి అమాంతంగా విరిచేసాడు. అన్ని వర్గాల రైలు కన్సెషన్స్ రద్దుచేశాడు. లాక్ డౌన్ రెండేళ్ల పాటు కొనసాగింది . ఈ కాలంలో జమ కూడిన డబ్బుతో కొత్తగా వందేభారత్ రైళ్లను పట్టుకొచ్చాడు. ఇంతవరకూ (అంటే డిసెంబర్ 30, 2023) 37 వన్డే భారత్ రైళ్లు పట్టాలపైకి వస్తే, అన్నిటినీ మోడీనే ప్రారంభిస్తాడు ఎంతో హంగామా చేస్తూ. పోనీ ఈ రైళ్లు మామూలు మెయిల్, రాజధాని ఎక్స్ప్రెస్ ల కన్నా గొప్పవా అంటే ఏ విషయం లోనూ కాదనే జవాబు వస్తుంది. మొదట్లో వన్డే భారత్ స్పీడు 150-160 %ిఎజూష్ట్ర% ఉంటుందని ఊదరగొట్టి ఇప్పుడు మన రైల్వే ట్రాక్ మీద 120 కంటే ఎక్కువ స్పీడులో పోలేకున్నాయి. కానీ, టికెట్ డబ్బులు మాత్రం చుక్కలు చూపిస్తాయి.

ఇక 2014 నాటి గ్యాస్ సిలిండర్ (గృహ వినియోగ సిలిండర్) ధర రూ. 500-550 మధ్య ఉంటే గత ఏడాదికి (2023కు) అది రూ.1170 కి పెరిగింది. సామాన్యులు, మధ్య తరగతి వారికిది భరించలేని భారంగా మారింది. ఇది మోడీ పాలన మార్క్. ఏ ప్రభుత్వమైనా ధరలు అదుపులో ఉంచి, క్రింది,మధ్య తరగతుల జీవన గతులు మెరుగుపడాలని చూస్తాయి. కానీ , మోడీకి ధరల నియంత్రణ సోయే ఉండదు. అయితే పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో గత ఏడాది అయిదు రాష్ట్రాల ఎన్నికల ముందు పెట్రోల్ పై రూ. 10, డీజిల్ పై రూ. 5

తగ్గించటమే గాక వంట సిలిండర్ మీద రూ. 200 లు తగ్గించారు. అంతేగాక సంవత్సరానికి 3-5 సీలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. ఇలాంటి గిమ్మిక్కులు కన్నా ఏకంగా వంట సిలిండర్ ధర ఏ 600-700 ల మధ్య ఉంచితే సామాన్యులకు, మధ్య తరగతికి మేలు చేసే ఆర్థిక విధానం అయ్యేదికదా! అంటే ఒక వైపు ధరలు పెంచే మార్గం అలాగే ఉంచి, మరో వైపు ఎంగిలి చేతి చిలకరింపు కొనసాగించటం మోడీ ఆర్థికవిధానం అన్న మాట.

ఇక ధరల పై మోడీకి నియంత్రణ ఆలోచనే ఉన్నట్టు కనిపించదు. బియ్యం నుంచీ పప్పులు, నూనెలు అన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయి. వీటి భారం భరించలేక మధ్య తరగతి నలిగిపోతున్నారు. అయినా మోడీకి ఇవేమీ కనిపించవు. ఇక తగిన మద్దత్తు ధర లేక రైతులు తమ ఉత్పత్తులను ఎలా విపణివీధిలో అమ్మాలో తెలియక గిజగిజలాడి పోతున్నారు. అయినా మోడీ వీటిని సమస్యలుగా పట్టించుకోడు. ధరల స్థిరీకరణ, మద్దత్తు ధర, మార్కెటింగ్ సౌకర్యం వంటివి విశ్వవ్యాపితంగా అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ ఉన్నాయి. కానీ, మోడీకి అవి మన దేశ ఆర్థికవిధానంలో ముఖ్యమైనవన్న స్పృహనే లేదు. మరి భారత దేశం ఏ విషయంలో 'విశ్వగురూ' అవబోతుందో ఎవరికీ అర్థం కాదు. భారత దేశంలో మూడవ అతిపెద్ద స్టార్ట్ అప్ ఎకోసిస్టం ఉందని తరుచూ ఊదర కొడుతుంటాడు. భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఈ స్టార్ట్ అప్ ల ఆర్థిక పరిమాణం ఎంత, అవి ఎంత ఆర్థిక ప్రగతి సాధించాయి, వాటివల్ల సామాన్యుడికి, మధ్య తరగతి వారికి ఒనగూడిన ప్రయోజనాలు ఏమిటీ చెప్పాడు. పోనీ వాటి సమాచారం ఏ ప్రభుత్వశాఖల వెబ్సైట్లలో అందుబాటులో ఉండదు.

ఇప్పుడు మళ్ళీ ఎన్నికలు రాబోతున్నాయి. కొన్ని రాష్ట్రాలకు, పార్లమెంటుకు దేశవ్యాప్తంగా ఎన్నికల భేరి మోగింది. ఆ విషయం జ్ఞప్తిలో ఉంచుకొనే తెలివిగా అంతర్జాతీయ మహిళా సందర్భంగా వంట గ్యాస్ సిలిండర్ పై మరో వంద రూపాయలు తగ్గించాడు. ఇదే మోడీకి తెలిసిన ఆర్థిక శాస్త్ర సూత్రం . రేపు ఎన్నికలై మోడీనే మూడవ సారి ప్రధాని అయితే ఒక్క సారి ఈ తగ్గింపులన్నీ మాయమైన ఆశ్చర్య పోనక్కరలేదు. అంతేగాదు, ఎన్నికాలానన్తరం వంట గ్యాస్ సిలిండర్ ధర అమాంతం రూ. 1400-1500 లో అయినా ఆశ్చర్య పోనక్కరలేదు.

మోడీ పెద్ద మాయల గుజరాతి. లాక్ డౌన్ అప్పుడు హఠాత్తుగా రైళ్లు నిలిపేసి వలస కూలీలను వందల మైళ్ళు నిర్దాక్షిణ్యంగా నడిపిన ఘనత మోడీది. ముక్కిన బియ్యం, పురుగుల కందిపప్పు ఇచ్చి బీద వారిని ఆదు కొన్నట్టు ఉదర గొట్టే ఘనాపాటి ఆయన. వేయి రూపాయలు జనధన కాతాలలో వేసి బీద ప్రజలను ఆమాంతంగా ఉద్ధరించినట్లు చెప్పుకొనే సాహసి కూడా మోడీనే . ఇక బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ఊదరయితే అంతా ఇంతా కాదు. మోడీ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత అభిమానం చూరగొన్న నాయకుడని, దృఢమైన నాయకుడని, ఆయనకు సాటి నాయకుడు భారత దేశంలో లేరనీ, ఇలా పొగడ్తల వర్షంతో మీడియాను,పత్రికలను,డిబేట్లను కొట్టుకుపోయేలా చేస్తారు. ఇదే మోడీ అత్యంత బలహీనుడైనా దేశానికి దశా దిశా నిర్దేశం చేసిన పి వి నరసింహారావు గురించి మాట్లాడే సంగతి ఆ క్షణంలో బీజేపీ వారికి గుర్తు రాదు. ఐకే గుజ్రాల్, వీపీ సింగ్ , దేవెగౌడ లాంటి వారు కూడా భారత ప్రధానులయ్యారు . ఎప్పుడేమి భారతదేశం పై చైనా, పాక్ లు దండెత్తి రాలేదు. కాబట్టి, మోడీ అత్యంత బలమైన నాయకుడు, బలమైన

నాయకత్వం ఇస్తాడని ప్రచారం చేసికోవటం కేవలం ఆర్భాటమే అవుతుంది. వాస్తవం కాదు. మోడీ ఈ పదేళ్లలో ఆర్థికంగా దేశ ప్రజలను ఏ అధోగతికి తీసుకెళ్లాడో అదే రేపు ఎన్నికల్లో ఉత్తరాదిన కొలబద్ద అవుతుంది. ఈ విషయాలపై ప్రముఖంగా ఇండియా కూటమి తన ప్రచారం కేంద్రీకరించ కలిగితే, మోడీ మూడవ సారి ప్రధాని కాకపోవచ్చు. అందుకే దక్షిణాదిన అప్పణంగా కొన్ని సీట్లు సంపాదించాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడు మోడీ.

(విశాలాంధ్ర దినపత్రిక, మార్చి 31, 2024)

ఒకే దేశం ....కానీ ఒకే ఎలక్షన్ కమిషన్ కాదా ?

గత పదేళ్లుగా ఒకే దేశం...ఒకే గవర్నెన్స్ , ఒకే దేశం ... ఒకే భాషా అంటూ ఉదర కొదుతున్న మోడీ ప్రభుత్వములో ఒకే దేశం ...ఒకే ఎలక్షన్ కమిషన్ మాత్రం ఉండదు. దేశం మొత్తానికి ఒక ఎలక్షన్ కమిషన్, ఆంధ్ర రాష్ట్రానికి, ఢిల్లీ లాంటి రాష్ట్రాలకు వేరే ఎలక్షన్ కమిషన్ ఉంటుంది. అంటే తన, పరాయిని బట్టి ఎలక్షన్ కమిషన్ వేరు వేరుగా ఉంటుందన్న మాట. ఇలా ఎందుకు అనాల్సి వస్తుందంటే మే 13న తెలుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్లో అసెంబ్లీకి, పార్లమెంట్ కి ఒకేసారి, ఒకే విడతలో ఎన్నికలు జరిగాయి. అదేరోజు మాచర్లలో పాల్వాయి గేట్ బూత్లో ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ను ఎం ఎల్ ఏ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి బూత్లోకి వెళ్లి మరీ నేలకేసి విరగొట్టాడు. అందరూ చూస్తుండగానే చేసిన పని అది. రాష్ట్రంలో అన్ని పొలింగ్బూత్లు వెబ్ కాస్టింగ్ కు లింక్ అయి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అంటే, ఆ రోజే ఎలక్షన్ కమిషన్ వెబ్ కాస్టింగ్ అధికారికి ఈ విషయం తెలుసు. అయినా కిక్కురు మానకుండా ఎలక్షన్ కమిషన్ మే 20దాకా వేడుక చూసింది.

ఆ వీడియో వెలుగులోకి రావటంతో హఠాత్తుగా ఆ ఎం ఎల్ ఏ పై విచారణ జరిపి అతనిని అరెస్ట్ చేయమని ఆదేశాలు జారీ చేసింది. ఆ వెనువెంటనే రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఒక ప్రెస్ మీట్ పెట్టి నీళ్లు నములుతూ ఆకుకు అందని, పోకుకందని కబుర్లేవో చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసాడు. ఆ ప్రెస్ మీట్ కు హాజరైన పత్రికా విలేఖర్లు నవ్వాలో, ఏడవాలో తెలియక ఆ ప్రెస్ మీట్ నుంచి ఎలాగోలా బయట పడ్డారు. తాను నిష్పక్ష పాతంగా అన్నీ చేశానని చెప్పడానికి ఆయన తన కధనాన్ని హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఎన్ని

మెలికలు తిరిగిందో అన్ని మెలికలు తిప్పాడు. ఇది ఆంధ్రాలో ఎన్నికల కమిషన్ ప్రస్తుత పరిస్థితి. ఈ నేపథ్యంలో అసలు ఈ ఎలక్షన్ కమిషన్ మొదటినుంచి ఇలాగే ఏడ్చిందా? ఎప్పుడైనా బాగా పనిచేసి ఏడ్చిందా అన్నది తెలుసుకోవాలంటే కొంచెం దీని పూర్వ రంగం నేటి తరానికి తెలియాలి. అపార మైన రాజకీయ శక్తులు రాజకీయాల్లోకి చొచ్చుకు వచ్చాక, దేశ జనాభా అంతులేకుండా పెరిగాక, మజ్జిగ పలచనైనట్టు ఈ ఎలక్షన్ కమిషన్ ఎలా పలచబడి ఈ స్థితికి దిగంజారిందో తెలుసుకోవాలంటే ఆ నేపధ్యం చర్చకు రావాలి.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 క్రింద ఏర్పడిన భారత ఎలక్షన్ కమిషన్ సంపూర్ణంగా స్వతంత్ర సంస్థ. నిర్దేశిత సమయములో ఎలక్షన్ ప్రక్రియ నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఎలక్షన్ కమిషన్ పరిధిలోకి రావటం ఈ వ్యవస్థ గొప్పతనం. ఎన్నికలకెళ్ళే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎన్నికల సమయంలో పూర్తిగా ఎలక్షన్ కమిషన్ అదుపు, ఆజ్ఞలలో పనిచేయాలి. ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కేవలం ఆపద్ధర్మ ప్రభుత్వాలై ఉంటాయి. విధాన సంబంధమైన ఏ నిర్ణయాలను, ప్రజలను, ఎలక్షన్ కమిషన్ విధుల నిర్వాహణలో భాగస్వామ్యమైన యంత్రాంగంలోని అధికార గణాన్ని ప్రభావితం చేసే ఏ అంశాలను ఆపద్ధర్మ ప్రభుత్వం చేపట్ట రాదు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 329 కింద రాష్ట్ర హై కోర్టులు, సుప్రీమ్ కోర్టు ఎలక్షన్ కమిషన్ కోడ్ అమలులోకి వచ్చాక ఎన్నికల విధానంలో జోక్యం చేసుకోరాదు. ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతను, గొప్పతనాన్ని హుందాతనాన్ని రక్షించేందుకు రాజ్యాంగ వ్యవహర్తలు నాడు తీర్చి దిద్దిన అందమైన నియమాలవి. అందునా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ఈ విధమైన

ఎలక్షన్ కమిషన్ రూపకల్పన మన ప్రజాస్వామ్యానికి ఎంతో వన్నె సమకూర్చింది.

దురదృష్టం ఏమిటంటే ఒక్క జవహర్లాల్ నెహ్రూ, ఇందిర హయాంలో మినహా మరెప్పుడూ ఈ ఎలక్షన్ కమిషన్ తనకు ఆపాదించిన హుందా తనానికి సరి తూగేలా వర్తిల్లలేదు. 1990–1996 మధ్య కాలంలో భారత దేశం ఎన్నో కుదుపులకు లోనైంది. ఊహించని పరిణామాల మధ్య నాలుగు ప్రభుత్వాలు వరుసగా కుప్పకూలి 1991లో పి. వి. నరసింహ రావు ప్రభుత్వం అధికారాల్లోకి వచ్చింది. సరిగ్గా ఈ కాలం లోనే టి.ఎన్.శేషన్ భారత ఎలక్షన్ కమిషన్ కు 10వ చీఫ్ ఎలక్షన్ కమీషనర్ గా నియమితులైనారు. ఆయన అతి క్లిష్ట సమయంలో ఈ పదవి నలంకరించినా, రాజీ పడని విలువలున్న అధికారిగా ఎంతో హుందాగా పదవినిర్వహించాడు. 1993లో పి వి ప్రభుత్వం టి ఎన్ శేషన్ అపరిమిత అధికారాలతో రాజకీయ పార్టీలను, ఎలక్షన్ సమయంలో అధికారంలో ఉండే ప్రభుత్వాలను కేవలం ఆపద్ధర్మ ప్రభుత్వాలుగా పరిమితం చేయడంతో దిమ్మ తిరిగి వారి అధికారాలను తగ్గించేందుకు ముగ్గురు ఎలక్షన్ కమిషనర్లను నియమించింది. ఇక్కడినుంచి ఎలక్షన్ కమిషన్ నిష్పాక్షిక వ్యవస్థ స్థాయిని క్రమంగా కోల్పోవటం ప్రారంభించింది. ఎలక్షన్ కమిషనర్లుగా వచ్చే వారు తాము రాజ్యాంగ నిర్వచనం మేరకు నిష్పక్షపాతంగా వ్యవహరిన్చవలసిన బాధ్యతలకు తిలోదకాలు ఇచ్చి, తమను నియమించిన వారికి అనుగుణంగా వ్యవహరించటం మొదలు పెట్టారు. 2019 నుంచి ఈ పతనం ఇంకా వేగం అందుకుంది.

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలప్పుడు మన్మోహన్సింగ్ అప్పటి ప్రధానిగా ఉన్నారు. వికృత రాజకీయ క్రీడల గురించి తెలియనివాడు

మన్మోహన్. అందువల్ల ఎలక్షన్ కమిషన్ ను ప్రభావితం చేసి , ప్రత్యర్థులను భయపెట్టి, ఈ డి., సి బి ఐ లను రంగంలోకి దించి, ఎన్నికలముందు ప్రతిపక్ష పార్టీల నిధులను వారిని వాడుకోకుండా చేసి బీజేపీ, ఎన్ డి ఏ కూటమిని ఇబ్బంది పాలు చేయలేదు. అంటే నాటి ఎన్నికలు ఒకరకంగా సవ్యంగానే జరిగాయని చెప్పుకోవచ్చు. కానీ , 2019నాటికి పరిస్థితులు పూర్తిగా రాజకీయం అయినాయి . ఎన్నికల కమిషన్ పూర్తిగా రాజాకీయమై పోయింది. చంద్రబాబంటే పడని మోడీ జగన్ను, అతని అవినీతిని రెంటినీ చేరదీసి జగన్కు పట్టం వచ్చేలా ఎన్నికల కమిషన్ కు సూచనలివ్వటం, ఆ వెంటనే ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీని మార్చటం, డి జి పి ని మార్చటం జరిగిపోయాయి. ఓట్లలో తక్కువలో తక్కువ తేడా ఉన్నకేంద్రాలలో రీకౌంటింగ్ చేసేందుకు వెసులుబాటు ఉన్నా రిటర్నింగ్ ఆఫీసర్లు ఏకపక్షం గా ఎన్నికల్లో వై సి పి అభ్యర్థులు గెలిచినట్టు ప్రకటించేశారు. ఎక్కడ ఎన్ని అరాచకాలు జరిగినా అన్నీ చూసీ చూడనట్టు ఎలక్షన్ కమిషన్ వ్యవహరించింది. ఈ నేపథ్యంలో వై సి పి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రం సర్వ నాశనానికి హేతువయింది.

ఇప్పుడు మోడీ కొత్త వ్యూహానికి తెర లేపాడు. అటు జగన్తో అంట కాగుతూనే, ఇటు చంద్రబాబు, పవన్ ల కూటమితో జతకట్టి ఉభయత్రా లాభం పొందాలని చూస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీలన్నీ, ఇండియా కూటమి సహా, చీఫ్ సెక్రటరీని, డి జి పి ని మార్చమని ఎలక్షన్ కమిషన్కు పలు మార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోయింది. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషన్ చీఫ్ సెక్రటరి క్రింద పనిచేస్తున్నట్టయింది. నిజానికి చీఫ్ సెక్రటరీ ఎలక్షన్ కమిషన్ కింద పనిచేయాలి. అలా జరగటం లేదు. అంటే, మోడీ జగన్

కొమ్ము కాస్తూనే ఉన్నాడు. అందువల్ల రాష్ట్రంలో నిష్పక్ష పాతంగా ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు ఉండలేకపోతున్నారు.

రేపు ఏమి జరుగుతుందో నని భయం భయంగా గడుపుతున్నారు. కొందరు రిటర్నింగ్ ఆఫిసర్లు కౌంటింగ్ దాకా ఉండలేమని, తమను మార్చేయమని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు విజ్ఞప్తులు పంపుతున్నారు. ఎలక్షన్ అయిన తరువాత కూడా కడప, తిరుపతి, మాచెర్ల , నరసారావు పేట, అనంతపురం, నెల్లూరు వంటి ప్రాంతాలలో విచ్చలవిడిగా హింస చెలరేగింది. కింది స్థాయి పోలీస్ అధికారులు అధికార పార్టీ నుంచి భారీగా ముడుపులు పొందుతున్న కారణంగా పై ఆఫిసర్లు నిజాయితీగా పనిచేసినా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. అమాయకులైన, నిజాయితిగల కొందరు పోలీస్ ఆఫీసర్లు ఈ వికృత క్రీడలో బలై పోయారు. ఎన్నికల కమిషన్ అసమర్ధ నిర్వాకం జిల్లాల వారీగా, బూత్ ల వారీగా బయట పడుతున్నా, కుప్పలు తెప్పలుగా ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తులు అందుతున్నా ఎలక్షన్ కమిషన్ చర్యలు 'ఎక్కడవేసావే గొంగళి' అన్న ఛందంలో నత్త నడక నడుస్తున్నాయి. దీనికంతటికి కారణం రాష్ట్ర చీఫ్ సెక్రటరీని అన్ని రాజకీయ పక్షాలు కోరినట్టు మార్చక పోవటమే. ఈ రాజకీయ వికృత క్రీడలో రేపు కౌంటింగ్ రోజున రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు రావణ కాష్టం కాబోతున్నాయన్న భయంతో పల్నాడు, మాచెర్ల గ్రామాలలో ప్రజలు ఊళ్లు ఊళ్ళు ఖాళీ చేసి తెలంగాణాకు, ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు.

అన్నింటికీ మించి ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లు గతంలో కన్నా అత్యధికంగా పోలైనాయి. లక్షల్లో తేలిన ఈ పోస్టల్ బ్యాలెట్లు ప్రభుత్వ వ్యతిరేకం కావచ్చన్న భయంతో, ప్రభుత్వంతో కుమ్మక్కు అయిన

కొందరు రిటర్నింగ్ ఆఫిసర్లు సరిగ్గా నడుచుకోక పోవటం వల్ల కొన్ని వేల ఓట్లు పనికి రాకుండా పోయే భయం ప్రతిపక్ష పార్టీలలో నెలకొంది. కొందరు రిటర్నింగ్ ఆఫీసర్లు పోస్టల్ బ్యాలెట్స్ పై సొంతకం చేయక పొతే, మరికొందరు ఇంకొక అడుగు ముందుకు వేసి ఈ పోస్టల్ బ్యాలెట్స్ ని నిక్షిప్తం చేసిన పెట్టెలకు తాళాలు, సీల్స్ వేయకుండా అలానే వదిలేశారు. ఇవన్నీ ఆ రిటర్నింగ్ ఆఫిసర్లు ప్రస్తుత ఆపద్ధర్మ ప్రభుత్వానికి కష్ట కాలంలో హితోధిక సహాయం కోసమే చేశారని ప్రజా వాక్కు. వీటిపై ఆందోళన చెందిన అన్ని ప్రతిపక్షాలు, ఇండియా కూటమి సహా, ఎలక్షన్ కమిషనర్ ముఖేష్ మీనా గారికి వినతిపత్రాన్ని సమర్పించాయి. అధికారుల నిర్లిప్తత, పక్ష పాత వైఖరి వల్ల పవిత్రమైన ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లు చెల్లకుండా చేయవద్దని, ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని ఆ విజ్ఞప్తిలో వారు కోరారు. ఇంత వరకూ ఎన్నో అరాచకాలను చూసి కూడా చూడనట్టు ఉండిపోయిన రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఇప్పుడన్నా మేల్కొని పోస్టల్ బాలెట్స్ విషయంలో అవి మురిగిపోకుండా తగిన ఉత్తర్వులు ఇస్తుందా వేచి చూడాలి. రాజ్యాంగ వ్యవస్థలు పక్షపాత వైఖరి అవలంభిస్తే అది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయటమే నని రాష్ట్ర ,కేంద్ర ఎలక్షన్ కమిషన్ అధికారులు గుర్తించాలి. చీఫ్ సెక్రటరీని తక్షణమే మార్చి, కౌంటింగ్ అనంతర మారణ కాండనాపాలి.

(విశాలాంధ్ర దినపత్రిక, మే 29, 2024)

చంద్రబాబు అరెస్ట్ వెనుక ఎవరూ గుర్తించని కోణాలు
' ఇనాక్యులమ్ ఎఫెక్ట్' అంటే ఏమిటీ?

చంద్రబాబును అరెస్ట్ చేయడం అక్రమం, అన్యాయం అని తెలుగు సమాజం ఏక మొత్తంగా ఘోషిస్తున్నా అలాంటి చర్య వెనుక ఉన్న బలమైన కారణం కేవలం జగన్ రెడ్డి 'ప్రతీకారం' అని మాత్రమే తెలుగు దేశం, జనసేన బి.జె.పి.నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పరిగణిస్తున్నారు. మేధావులుగా చలామణి అవుతున్న వారి విశ్లేషణల్లో కూడ అంతకు మించి కొత్త కోణం వెలికి రావటం లేదు. ఇక చంద్రబాబు అరెస్ట్ 'న్యాయమే' అని పేలే వైసిపి నాయకులు, వారి అనుకూల మీడియా, తొత్తు మేధావులు కూడా చంద్రబాబు ఏదో అవినీతికి పాల్పడ్డారని చెప్పడానికే ప్రయాస పడుతున్నారు. నిజానికి, ఇంత సులువైన వివరణతో (సింప్లిఫికేషన్) చర్చను అటూఇటూ తిప్పటం ప్రస్తుత పరిస్థిని లోతుగా విశ్లేషించటంలో తెలుగు జాతి వైఫల్యాన్ని సూచిస్తున్నది.

ఈ ఉపరితల విశ్లేషణలు (సర్ఫాన్ ఎనాలిసిస్) చేస్తున్న చాలామందికి ' ఇనాక్యులమ్ ఎఫెక్ట్' అంటే ఏమిటీ, రాజకీయ సామాజిక తంత్రంలో ఈ 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' ఎలా పనిచేస్తుంది తెలియదు. అది తెలిసినా ఒక రాజకీయ, సామాజిక దృగ్విషయం పూర్వ, ఉత్తర రంగాలపై లోతైన, సమగ్ర అవగాహన ఉంటే తప్ప సరిగ్గా అన్వయించ లేరు. ఇక్కడ తెలుసుకోవలసిన ప్రాథమిక సూత్రీకరణ ఒకటుంది. చంద్రబాబును ఒక వ్యక్తిగా, రాజకీయ నాయకుడిగా పరిమితంగా పరిగణిస్తే వ్యాఖ్యానాలు, విశ్లేషణలు ఇంతకు మించి పరిణతి ప్రదర్శించలేవు. ఈ వ్యాసం చంద్రబాబును ఒక అత్యంత కీలకమైన రాజకీయ వ్యవస్థగా, ఒక రాజకీయ దృగ్విషయంగా పరిగణించి విశ్లేషిస్తుంది. గత 70 ఏళ్ల భారత

చరిత్రలో, 40 ఏళ్ల తెలుగు రాష్ట్రాల భూత, భవిష్యత్, వర్తమానాల్లో ఏకాలంలోనూ చంద్రబాబు లేని సమాజాన్ని ఊహించుకోవటం సాధ్యకాదు. అటువంటి చంద్రబాబు అనే ఒక 'వ్యవస్థను' శాశ్వతంగా కూకటివేళ్లతో పెకలించే ప్రయత్నం జరుగుతున్నప్పుడు ఇలాంటి ఉపరితల విశ్లేషణలను పక్కనబెట్టి 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' ను ఎంత పకడ్బందీగా అమలు చ్చేస్తున్నారో గమనిస్తే, పొంచి ఉన్న ప్రమాదాలు చీకటి కోణాలు వెలుగు చూస్తాయి .

ఈ విశ్లేషణలో కొందరు 'కేంద్ర ప్రభుత్వం అనుమతితోనే చంద్రబాబు అరెస్ట్ జరిగింది' అని చెప్పటం తోనే ఆగిపోతున్నారు. కొందరు దానికి కారణాలు వివరించటం లేదు. కేంద్రానికి చంద్రబాబును అరెస్ట్ చేయటంలో జగన్ రెడ్డికి సహకరించటం వలన వచ్చిన ప్రయోజనం ఏమిటీ? ుఅన్న విషయం ఎవ్వరూ చర్చించటం లేదు. కొందరు 'కేంద్రం మౌనం వహించటం శోచనీయం' అని వ్యాఖ్యానించి ముక్తాయిస్తున్నారు. కొందరు పవన్కళ్యాణ్ చంద్రబాబుకు మద్దత్తు ప్రకటించి, తెలుగుదేశంతో కలిసి రాబోయే ఎన్నికల్లో పోటీచేసే విషయంలో బిజేపి కలిసి వచ్చే విషయంలో సందేహం వెలిబుస్తున్నారు. కానీ, వారు కూడ కొంత దూరం లోనే ఆగి పోతున్నారు.

అసలు నిజం ఏమిటంటే చంద్రబాబు అరెస్ట్ ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షాల ప్రేరేపణతోనే జరిగింది అనటంలో ఎవ్వరికీ సందేహం ఉండవలసిన పనిలేదు. ఇది 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' అనే ప్రక్రియతో రాజకీయ సామాజిక తంత్రం లో భాగంగా చంద్రబాబును శాశ్వతంగా తొలగించే లక్ష్యం తోనే జరిగింది. ఈ వయస్సులో కూడ చంద్రబాబు ఎంతో ఆరోగ్యంగా ఉండటం, ఆయన అద్భుతంగా,

అలుపులేకుండా గంటల తరబడి ప్రసంగాలు చేస్తూ, ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్య వంతులను చేయటం, నానాటికి ప్రజల్లో అంతులేని ఆదరణ పొందుతుండటం గురించి సొంత పార్టీ నేతలనుంచి, జనసేన నుంచేగాక ఇంటలిజెన్స్ ద్వారా కూడ కేంద్రానికి సమాచారం ఉంది. నిజానికి చంద్రబాబు, తెలుగుదేశం కనుమరుగు అయితేగాని, భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలోకి అడుగు పెట్టలేదని మోడీకి, అమిత్ షా కూడ అర్థమైంది. పోనీ తెలుగు దేశంతో పొత్తు పెట్టుకొంటే కేవలం కొన్ని సీట్లతో సరిపెట్టుకోవలసిందే. కానీ, ఆంధ్రలాంటి ప్రకృతి వనరులు అపారంగా ఉన్న ధనిక రాష్ట్రం నుంచి గుజరాత్ పెట్టుబడి దారులకు, ఆదానీలకు దోచి పెట్టడానికి వీలు ఉండదు. ఆ అవకాశం జగన్ రెడ్డి వంటి తొత్తులు ముఖ్య మంత్రులుగా ఉంటేనే సాధ్యం. లేదా బిజేపినే స్వయంగా రాష్ట్ర పగ్గాలు పడితే ఇక ఆకాశమే హద్దు. ఒకసారి తెలుగుదేశం స్థానం బీజేపీ ఆక్రమిస్తే ఆ తరువాత జగన్ రెడ్డికి ఏ గవర్నర్ పదవో ఇచ్చి గాని, కేంద్ర మంత్రి పదవినిచ్చి గాని వైసీపీ నుంచి రాష్ట్రంకు విముక్తి కలిగించవచ్చు. జగన్ రెడ్డి కేసులు కేంద్రం చేతిలో ఉన్నంత కాలం జగన్ను ఉంచటమా, పీకేయటమా అన్నది బీజేపీకి మంచి నీళ్లు తాగినంత సులువు. కాబట్టి సమస్యల్లా చంద్రబాబు, తెలుగు దేశమే.

నిజానికి చంద్రబాబును, తెలుగు దేశాన్ని ఒక మూలకు నెట్టి వేసి, ప్రజల్లో ఆయనకు ఆదరణ లేకుండా చేసే ప్రయత్నం 2014 లోనే కాంగ్రెస్ ప్రారంభించింది. నాటి మన్మోహన్ సింగ్ కు ఆనాడే ఇంటలిజెన్స్ ద్వారా సంయుక్త రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే చంద్రబాబు అధిపతిగా ఉన్న తెలుగుదేశం అధికారం లోకి వస్తుందని ముందే తెలుసు. రాష్ట్రం విడకొడితే కనీసం తెలంగాణా అయినా తమకు దక్కుతుందనే సోనియా

హడావుడిగా ప్రత్యేక విమానంలో బిల్లు పంపి సంయుక్త రాష్ట్ర శాసనసభలో ఆమోదం సాధించింది. కేసీఆర్ తిరగబడటంతో తెలంగాణా కాంగ్రెస్ చేయి జారిపోవటం వేరే విషయం. వాస్తవానికి తెలుగుదేశం , చంద్రబాబు నుండి ఆంధ్ర రాష్ట్రం విముక్తి పొందాలని రాజశేఖర రెడ్డి కాలం లోనే బీజాలు పడ్డాయి. రెండవసారి అతిస్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ 2009లో రాష్ట్రంలో అధికారంలోకి రావటంతోనే రాజశేఖర్ రెడ్డి 'ఆకర్ష' పధకానికి శ్రీ కారం చుట్టి , తెలుగుదేశం నుంచి వీలైనంత మంది ఎం ఎల్ ఏలను లాగు కొనే ప్రయత్నం చేశాడు. శాసన సభలోనూ , వెలుపల విచారణా కమిటీల పేరుతొ తీవ్రమైన అవమానాలకు గురిచేశాడు. 'మామకు వెన్నుపోటు' అంటూ బాబు కుటుంబ వ్యక్తిగత విషయాలకు రాజకీయ ప్రాధాన్యత ఉన్నట్టు వెకిలి మాటలు మాట్లాడి శునకానందం పొందటం ఎలా అన్నది నాటి ఎం ఎల్ ఏ లకు నేర్పింది రాజశేఖర రెడ్డే.

మోడీ, బాబు, పవన్ 2014లో అధికారాంలోకి రావటానికి మాత్రమే చంద్రబాబు ప్రజాదరణను వాడుకున్నా, అధికారం లోకి వచ్చినప్పటినుంచి చంద్రబాబును, ఆయన కొడుకు లోకేష్ ను దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగానే మోడీ, షా పధకాలు రచించారు. అందులో భాగంగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తెలివిగా 'నీతి ఆయోగ్' ను అడ్డంపెట్టుకొని ఆంధ్ర రాష్ట్రాన్ని దెబ్బ తీశారు. అలాగే రాష్ట్ర రెవిన్యూ డెఫిషిట్ కూడ ఎగ వేయడానికి పన్నాగాలు పన్నారు. వంద శాతం నిధులతో నిర్మించవలసిన పోలవరం ప్రాజెక్టుకు 'ఇంతే ఇస్తాం , అంతే ఇస్తాం' అంటూ చంద్రబాబును వేధించారు. లోకేష్ చంద్రబాబుకు వారసుడై, పరిపాలన పగ్గాలు పడితే ఇక తెలుగు దేశంను ఎప్పటికి ఆంధ్ర రాష్ట్రం నుంచి బయటకు పంప సాధ్యం కాదనే ఆయన పై

'పప్పు' అనే ప్రచారంకు శ్రీ కారం చుట్టారు. అలాగే కేంద్రంలో రాహుల్ను కూడా 'పప్పు' అని దుష్ప్రచారం చేశారు. ఆఖరుగా ఆంధ్ర ఆస్తులను మోడీ కోరుకున్నట్టుగా గుజరాత్ కు దోచి పెట్టడం, ఆదానికి అప్ప చెప్పటం బాబు ఉంటే సాధ్యం కాదని లోపాయికారిగా జగన్ వైసీపీతో సంబంధాలు ఏర్పరచుకొని, కేంద్రంలోని జీ వి ఎల్ నరసింహారావు లాంటి వారిని బాబు ప్రభుత్వం పై ఉసిగొల్పారు. మోడీ అవినీతి పోరాటం ఒక బూటకం అని దేశ ప్రజలకు రాజకీయ చాణుక్యుడైన చంద్రబాబుకు ఏనాడో అర్ధం అయింది. కానీ, అప్పట్లో రాష్ట్రంలో బలంగా ఉన్న జగన్ వైసీపీని , మోడీని ఒకేసారి ఢీ కొట్టి జైలుకు పోవటం ఇష్టం లేకనే చంద్రబాబు మోడీని నాలుగేళ్లు భరించాడు.

అంతే కాదు , టీడీపీని బీజేపీలో కలిపేస్తే చంద్రబాబుకు మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తామని, కానీ ప్రధాన నిర్ణయాలన్నీ బీజేపీ చెప్పిన ఉపముఖ్యమంత్రికి కట్టబెట్టాలని ఆపైన తెలుగుదేశం, లోకేష్లు శాశ్వతంగా రాజకీయాలనుంచి తప్పుకోవాలని ప్రతిపాదన కూడ ఒకటి చంద్రబాబుకు వచ్చిందని, దానిని ఆయన సున్నితంగా తిరస్కరించారని ఒక ప్రచారం నాడు కొన్ని వర్గాలలో విస్తారంగా ఉండింది. చంద్రబాబు మౌనంగా ఉండి మోడీ ప్రతిపాదనకు అంగీకరించక పోవటం వలననే, ఆయన 29 సార్లు ఢిల్లీ వెళ్లి మోడీని కలవాలని ప్రయత్నించినా మోడీ అపాయింట్మెంట్ ఇవ్వలేదని కూడ చంద్రబాబుకు తెలుసు. ఇలాంటి ప్రతిపాదనని మోడీ కెసిఆర్ కు కూడ ఇచ్చారని రాజకియ విశ్లేషకుల ప్రఘాడ విశ్వాసం. అయితే అందుకు బదులుగా ఆయన కాంగ్రెస్ రాష్ట్రంలో లేకుండా చేసి, బీజేపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కలిపిస్తానని, ఎన్నికల్లో తమని ఓడించి బీజేపీ పాలనలోకి రావచ్చని సూచించినట్టు కూడా

రాజయాకియ పండితుల్లో ఒక వర్గం అంటుంటారు. ఇవన్నీ ఉట్టి ప్రచారాలని కొట్టిపారేయడానికి వీలు లేదు. కీర్తి శేషులు సి .నరసింహారావు రావు విశ్లేషించినట్టు మోడీ, అమిత్ షా, జగన్, కెసిఆర్ లు ఒకే తానులో ముక్కలు. అధికారం, ధనం, బలం కోసం ఏ దుర్మార్గానికైనా ఒడికడతారు. పైకిమాత్రం మహనీయుల ప్రవచానాలే వల్లిస్తుంటారు.

కేంద్రంలో నాడు వెంకయ్య నాయుడు మినహా మిగతా ఎవ్వరూ నాటి చంద్రబాబుకు కేంద్రంలో సహకరించే స్థితిలో లేరు. చంద్రబాబును నిస్సహాయుడిగా చేయటంలో భాగంగానే వెంకయ్యను ఉపరాష్ట్ర పతి చేసి బాబును ఒంటరి చేశారు. తనను ఒంటరి చేసే లక్ష్యం తోనే బీజేపీ జగన్కు మద్దతు ఇస్తున్నదన్న సంగతి నాడే చంద్రబాబుకు తెలుసు. కానీ, ప్రజలు, ప్రజాస్వామ్యంను మాత్రమే నమ్ముకొన్న చంద్రబాబు ఒంటరిగా పోటీలో దిగటం మినహా వేరే గత్యంతరం లేదని గ్రహించాడు. కానీ, ఆయన నమ్ముకొన్న తెలుగు ప్రజలు, ప్రజా స్వామ్యం ఆయనని వంచించి అవినీతిపరుడైన జగన్ను ఒక హీరో గా చూపించిన నీలి మీడియా ప్రచారం నమ్మి ఆయనకు ఓటు వేశారు. అక్కడినుంచి కమ్మ కుల ద్వేషం, అమరావతి నాశనం, పోలవరం విధ్వంసం అన్నీ జగన్– మోడీ –అమిత్ షా త్రయం నాయకత్వం లోనే జరిగాయి. ఇది తెలియని బీజేపీ కార్యకర్త లేడు. అయినా మోడీని స్లాఘిస్తూ జీవితం ఈడ్చడం కన్నా వారి దగ్గర వేరే దారి లేదు. పార్టీ వేరని , ప్రభుత్వం వేరని అర్ధం పర్ధం లేని చచ్చు బొక్కు పాలనా తంత్రాలను ప్రతిపాదిస్తూ కాలం ఈడుస్తుంటారు. ఇది తెలిసిన కొంతమంది బీజేపీ నేతలు జగన్తో సఖ్యంగా ఉండటమే మేలని కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇది చంద్రబాబు అరెస్ట్ కు ముందు కేంద్రం పన్నిన విషపన్నాగం పూర్తి స్వరూపం.

ఇక ప్రస్తుత రంగానికి వస్తే చంద్రబాబు అరెస్ట్ కేంద్ర పథకమే. చంద్రబాబును, తెలుగుదేశమును రాష్ట్రం నుంచి వెళ్లగొట్టి ఆ స్థానంలో బీజేపీ రావడానికి తగిన పథకాలను జగన్కె అప్పచెప్పింది కేంద్రం. తెలంగాణాలో కూడా ఇదే పథకం అమలు చేసింది. మోడీ ఒక గొప్ప నేతనే ప్రచారంకు ఎటువంటి విఘాతం కలగకుండా, చేతికి బురద అంటకుండా, రాష్ట్ర అధిపతులయిన ముఖ్యమంత్రులతోనే ఈ కార్యానికి శ్రీకారం చుట్టారు. సామాజిక సిద్ధాంతాలలో 'ఇనోక్యూలం ఎఫెక్ట్ ' అనే ఒక సిద్ధాంతం ఉంది. అది ఏమిటంటే ఏదైనా తీవ్రమైన సామాజిక చర్యకు ఒడిగట్టే ముందు అతి తక్కువ స్థాయిలో దానిని (తాము భవిష్యత్తులో చేపట్ట బోయే దానిని) సూచనగా ప్రజలలోకి వదులుతారు. ప్రజల్లో వచ్చే స్పందనను జాగ్రత్తగా అంచనా వేస్తారు. ముందు ప్రజల్లో కొంత అలజడి, వ్యతిరేకత, తిరుగుబాటు వస్తుందని గ్రహించి పోలీసును, అవసరమైతే పారామిలటరీ బలగాలను సిద్ధంగా ఉంచుతారు. మొదటి సారి పొంగులా వచ్చి చల్లారిన తరువాత, వెంట వెంటనే తీవ్ర చర్యలకు దిగుతారు. ప్రజలు గతంలో చేసిన ప్రతిఘటన రెండవ సారి చేయలేరు. క్రమంగా ప్రజలు ఈ తీవ్ర చర్యలకు అలవాటు పడిపోతారు. అంటే మసూచి వ్యాధి రాకుండా ముందుగా ఇచ్చే వాక్సిన్ లాంటిది అన్నమాట. అందువల్ల దీనికి 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' అని పేరు వచ్చింది.

'బొంబాయి' సినిమా రాకముందే ముస్లింలు, హిందువుల గలాటా రావచ్చని భావించిన మహారాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఇండియన్ ఎక్స్ప్రెస్, టైమ్స్ అఫ్ ఇండియా పత్రికల ద్వారా సినిమా తాలూకు స్టోరీని లీక్ చేసింది. ఒక హిందువు యువకుడు ముస్లిం యువతిని పెళ్లాడుతాడని కథ బయటికి రాగానే బొంబాయి అంతా అట్టుడికింది . హిందూ ముస్లిం

సంఘాలు ఆ సినిమాను విడుదల చేస్తే సినిమా హాల్ నే తగలబెట్టేస్తామన్నారు. కొంత కాలం సినిమా విడుదల వాయిదా వేశారు. కొంత కాలం అయినాక సినిమా విడుదలయింది. తరువాత ప్రజల్లో మత సంబంధమైన అలజడి లేకుండానే సినిమా సంవత్సరం ఆడింది. అలాగే గోధ్రా సంఘటనల అంచనా ఆధారంగా గుజరాత్ అల్లర్లు ప్రభుత్వ సహకారంతోనే జరిగాయి. మోడీ తిరిగి అధికారంలోకి వచ్చాడు. ఎందుకంటే గోధ్రా ఘటనలు హిందువుల మధ్య ఐక్యమత్యాన్ని రగిల్చాయి. కాబట్టి గుజరాత్ అల్లర్లలో ముస్లిములు దారుణ హింసకు గురైనా, ముస్లింలకు ప్రభుత్వ కావాలనే రక్షణ కలిపించకుండా దారుణాలను జరిపించినా హిందువులు మోడీని హీరోగా భావించారు. అందుకే నేటి దాకా బీజేపీనే గుజరాత్ను పాలిస్తున్నది. పైగా మోడీ ప్రధానియై అన్ని రాష్ట్రాలకు గుండు కొట్టి గుజరాత్ కు అన్నీ తరలిస్తున్న వైనం గుజరాత్ ప్రజల మార్వాడి మనస్తత్వానికి బాగా నచ్చిన అంశం. ఈ అంశాలను విశ్లేషిస్తూ 'ఇనాక్యులమ్ ఎఫక్ట్స్' వివరిస్తూ నేను 2007 లో 'తెహెల్కా స్టింగ్ ఎక్సపోజ్ , ఏన్ ఇనాక్యులమ్ ఎఫెక్ట్ ?' అనే వ్యాసం హూట్ పోర్టల్ (ప్రముఖ జర్నలిస్ట్ సెవంటీ నినన్ సంపాదకత్వంలో నడిచే పోర్టల్)లో రాశాను. దాదాపుగా దశాబ్దంన్నర తరువాత అవే పరిణామాలకు తెరలేప బోతున్నారు మోడీ ఆంధ్రాలో.

ప్రజలను చైతన్య పరుస్తూ నాడు గుజరాత్ అల్లర్లలో ఏమి జరిగిందో ప్రజలకు తెలియ పర్చాలని బీబీసీ చేసిన ప్రయత్నానికి కేంద్రం ఎలా అడ్డుపడిందో తెలిస్తే గాని మనకు ఈ రాష్ట్రంలో రాబోయే రావణ కాష్టం గురించిన ఒక అంచనా, ఆలోచనా రాదు. తమకు వ్యతిరేకంగా ఏమైనా రాస్తారు అని అనిపిస్తే ఆ మీడియాని సమూలంగా నాశనం

చేసి, కేసులు పెట్టి వేధించే ఆలోచన చేసే విషయంలో మోడీకి, జగన్కు, కెసిఆర్ కు తేడా ఏమీ లేదు. వీరంతా తమ అధికారంలో శాశ్వతంగా చనిపోయే వరకూ ఉండాలని కోరుకొనే వారే. అందుకు అవసరమైతే ఏ స్థాయికైనా దిగజారుతారు. వీళ్ళు అవినీతి దురంధరులు, కానీ తాము ఎంతో నిజాయితీ పరులమని, వారి వ్యతిరేక వర్గంలోని వారే భయంకర అవినీతి పరులని ప్రచారం చేస్తుంటారు. నెహ్రూ,గాంధీ, సోనియా అవినీతికి పాల్పడి దేశాన్ని నాశనం చేసారని మోడీ ప్రచారం చేస్తే, చంద్రబాబు అంత అవినీతి పరుడు ప్రపంచంలోనే లేడని జగన్ అంటాడు.

ఈ ప్రచారం వినీ విని ప్రజలు అవినీతికి స్పందిచటమే మానేశారు. అదే 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్'. ఇక్కడ కొన్ని సమీకరణాలు ఇస్తాను. గమనించండి . రాజశేఖర రెడ్డి తరుచూ 'ఆ రెండు పత్రికలు' అంటూ వల్లెవేసేవారు. 'ఆ రెండు పత్రికలు (ఈనాడు, ఆంధ్ర జ్యోతి) పట్ల తాత్కాలికంగా కొంత వ్యతిరేకత వచ్చినా, క్రమంగా ఆవిమర్శను ప్రజలు పట్టించుకోవటం మానేశారు. ఆవిధంగా నేటికీ అగ్ర పత్రికలుగా 'ఆ రెండు పత్రికలు' ఉండిపోయాయి. అలాగే తెలుగు దేశం జగన్, రాజశేఖర రెడ్డిల అవినీతి భాగోతం బయట పెట్టినప్పుడు తొలుత నిర్ఘాంత పోయిన తెలుగు సమాజం, దానిపైనే నిరంతరం కొత్త విషయాలు వెలుగులోకి వచ్చినా తరువాత పెద్దగా స్పందించటం మానేశారు. పైగా అందరు రాజకీయ నాయకులు అవినీతిపరులే, వీళ్ళ కోసం మనం ప్రజా ఉద్యమాలు, పోరాటాలు ఎందుకు చేయాలి , జైలుకు ఎందుకు వెళ్ళాలి అని నిశ్చయించుకొంటారు. ఇలా ప్రతిపక్షాలను చంద్రబాబు, పవన్, లోకేష్ లాంటి నాయకులను ప్రజలలో పెద్ద నిజాయితీ లేని నాయకులుగా ముద్ర వేస్తే వారు అధికారంలోకి వచ్చే అవకాశాలను

దెబ్బ తీయవచ్చు అన్నదే బీజేపీ, వైసిపి పధకం. అందులో భాగంగానే పవన్ పైన దత్తపుత్రుడు , ప్యాకేజీ పుత్రుడు వంటి ఆరోపణలు. ఎప్పుడైతే అవి పనిచేయట్లేదు అనే భావన కలుగుతుందో అప్పుడు 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్'లో రాజకీయ తంత్రానికి తెరలేపుతారు . ఈ 'ఇనాక్యులమ్ ఎఫెక్ట్' లో భాగంగానే చంద్రబాబు అరెస్ట్ జరిగింది. ముందు ముందు లోకేష్ను అరెస్ట్ చేస్తామని అనటం వెనకాల ఇదే సిద్ధాంతం ఉంది.

పవన్ జరుగుతున్నది అర్థం చేసికొని దారికి రాకపోతే అతని చరిత్ర కూడా అవినీతి ముద్రపైనే ముగించాలని చూస్తారు. ముందు తెలుగు దేశం వంతు అన్నమాట తెలుగు దేశం వాళ్ళు గ్రహించాలి. ఇందులో కేంద్రం, ముఖ్యంగా మోడి, అమిత్ షా కీలక పాత్రధారులు. రాజకీయ తంత్రంలో భాగంగా చంద్రబాబు ను అరెస్ట్ చేసి ప్రజలలో ఎంత స్పందన వచ్చిందో ఈ పాటికి మోడీ, జగన్, అమిత్ షా ఒక అంచనాకు వచ్చే ఉంటారు. దానిని బట్టి చంద్రబాబును అసలు లేకుండా చేస్తే ఎంత ప్రమాదం ఉంటుందో ఒక అంచనా వేయగలవారు. 'ఉగాది తరువాత తెలుగు దేశం, జన సేన ఉండవు' అని బొత్స సత్యనారాయణ సెలవు ఇవ్వటం వెనుక ఒక పెద్ద కుట్రనే ఉంది. అది ఆశా మాషీగా అన్నది కాదు. ఉన్నత పోలీస్ అధికారులు, జడ్జీలు సహా అందరూ ఒళ్ళు కాల్చుకొని చట్ట వ్యతిరేకంగా, ఉన్మాదులుగా ప్రవర్తించటానికి కారణం కేంద్రం నుంచి , రాష్ట్రం నుంచి వారికి అందుతున్న ఉప్పే తప్ప వేరే ఉండే అవకాశం లేదు. సిద్ధార్థ లూథ్రా కత్తి పట్టడం తప్ప వేరే మార్గం లేదనడానికి కూడ చూచాయాగా ఇందుకు సంబంధించిన కొన్ని శకునాలు ఆయనకు అవగతం అవటమే. సొంత బాబాయిని చంపించి నిర్భయంగా తిరుగుతున్న వాడిని మోడీకి దత్తపుత్రుడిగా అభివర్ణించిన

నిర్మలమ్మ మాటలను విస్మరించడానికి లేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు ప్రాణ హాని ఉందని ప్రజలు, రాజకీయ నాయకులు భయపడటం నిష్కారణ మేమీ కాదు. ఏ రోజు ఉదయానికి ఏ వార్త వింటామేమోనని రాష్ట్రం భీతిల్లుతోంది.

(విశాలాంధ్ర దినపత్రిక, సెప్టెంబర్ 27, 2023)